ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుట : ౬. బహుధాన్య, జ్యేష్ఠము : జూన్, 1938. సంచిక : ౧౧.

దేవాలయము

దేవాలయమను పేరేగానీ
దేవు డిచట గలడా ? నీ—నా
దేవు డిచట గలడా ?

ఈవురచించిన విగ్రహాలలో
నీశు డుండగలడా ? ఆ - పర
మేశు డుండగలడా ?

ప్రేమమూర్తియా, ఆపరమేశుడు
కామితార్థియా ? - మనవలె
కామితేచ్ఛ మనునా ?

ఈమర్త్యులవలె లంచగొండడై
యింతలు దెమ్మనునా ? - జుట్టుల
నిచ్చి వెడలు మనునా ?

సర్వసంపదల మనకు వ్యయించే
సత్యరూపు డతడూ ? - నిర్మల
సత్స్వభావు డతడూ.

గర్వులైన యీ మానవకల్పిత
కఠినశిలల నిలడూ - మనవలె
కర్కశుండుగాడూ.

ప్రణయపరిమళభావసూనముల
ప్రకృతిపూజ లందూ - ఎడ నెడ
ప్రణయపూజ లందూ.

క్షణమువిడక, ఆ ప్రణయపుటాత్మల
కాంతిగ వెలుగొందూ - సతతము
శాంతముతో నుండూ.

—ములుమూడి ఆదిశేషాద్రిరెడ్డి.

వయోజనవిద్యావ్యాప్తికి ఒజ్జలకంటె రాత్రిపాఠశాలలకంటె


పుస్తకములు ముఖ్యము

ప్రజాలోకమున ప్రబలియున్న అవిద్య కారణముగా మన దేశమున ఏయుద్యమము తలపెట్టినను సత్వరాభివృద్ధి నందకున్నది. పల్లెటిపట్టులందు చదువుకొనని వయోజనులును, చదువుకొనిన యువకులును ఒకేస్థితియందున్నారు. చదువుకొనని వయోజనులు ఎట్లును అవిద్యయందే మ్రగ్గుచున్నారు. ఇక ప్రాథమికవిద్య నలవఱచుకొనిన యువకులును పాఠశాలవీడిన తరువాత చదువుకొనుటకు తగు పుస్తకములు లేక పాఠశాలలో తామునేర్చిన స్వల్పవిద్యను అచిరకాలముననే మఱచిపోయి మరల అవిద్యకు మరలుచున్నారు. ఈస్థితి తొలగి వయోజనులలోను, యువకులలోను విద్యావ్యాప్తి బాగుగ జరుగువలయుననుచో ఒజ్జలను నియమించుటకంటె, రాత్రి పాఠశాలలను పెట్టుటకంటె పఠనయోగ్యములగు పుస్తకములు వ్రాయించి ప్రచురించుట ముఖ్యము.

వికాసముతోకూడిన విద్యావ్యాప్తికి పుస్తకములే ప్రధాన సాధనములగుట విశేషవిద్యావ్యాప్తి లేని మన భారతదేశముననే గాక విద్యాశిఖర మంటిన పాశ్చాత్యదేశములందును గుర్తింపబడియున్నది. 'మంచి పుస్తకములపై మనసున్నవానికి వేఱుగా విశ్వాసనీయుడైన మిత్రుడుగాని, అనురాగయుక్తుడైన ఆశ్వాసకుడుగాని, ఉల్లాసకరమగు తోడుగాని అక్కఱలేదు' అని భారతీయప్రముఖుడగు ఋషీరామ్ చెప్పినట్లే- పాశ్చాత్యప్రముఖుడును, ఆంగ్లమంత్రిమాణిక్యుడును అయిన గ్లాడ్ స్టన్ 'ప్రథమమున మంచిపుస్తకము చదివినప్పుడు నేనొక క్రొత్తస్నేహితుని సంపాదించుకొనినట్లుండెను. అది రెండవసారి చదివినప్పుడు ప్రాతస్నేహితుని గలసికొనినట్లుండెను' అని చెప్పినాడు. భారతీయులకు ఆంగ్లవిద్యాభిక్ష పెట్టిన మెకాలే ఒకచో 'మంచి పుస్తకములు చదువుటకుగాని మహారాజుగా నుండుటకంటె పేదకొంపలో జదువుటకు పుస్తకములు పుష్కలముగానుండు పరమదరిద్రుడుగానుండుట నాకిష్టము' అని వ్రాసియున్నాడు. ఆంధ్రదేశమునందలి ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులలో వీనుమిగిలిన కూచి నరసింహము పంతులుగారు అనువదించిన 'ఆదర్శ సుఖజీవనము' అనుగ్రంథమున 'అనివార్యమైనయెడల ప్రాతచొక్కా తొడుగుకొనుము. కాని శక్తియున్నచో క్రొత్తపుస్తకము కొనుట మానకుము. గత్యంతరము లేనపుడు చింపిగుడ్డలు కట్టుకొనవచ్చును, అతుకులచెప్పులు తొడుగుకొనవచ్చును, ఒక్కపూటయే తిని బ్రతుకవచ్చును, కాని నీవు సద్గ్రంథముల పట్టున మాత్రము వ్యయభీతిచే నెప్పుడును లోభివి గాకుము.' అని చెప్పియున్నారు.

క్రొత్త పుస్తకములను కొనుట మానకుము! సద్గ్రంథములపట్టున లోభివి గాకుము!! ఎంతటి చక్కని ఉపదేశములు. ఆంధ్రులు ప్రత్యేకముగ శ్రద్ధచేయదగిన ఉపదేశరత్నములివి.

గుంటూరు మండలమునందలి సనాతనసంప్రదాయముగల ఆంధ్ర వైశ్యకుటుంబమునకు చెందిన జమిలి నమ్మాళ్వారుగారు మద్రాసు కార్యస్థానముగా పెట్టుకొని ఆంధ్రమున క్రొత్తవియు, మంచివియునగు పుస్తకములను ప్రచురింపదొరకొనినారు. ఇంతవరకు పండ్రెండు ఉత్తమగ్రంథములు వెలువడినవి. అవిఅన్నియు వయోజనవిద్యావ్యాప్తికి బాగుగ ఉపకరించునవిగానున్నవి. కావున ఆంధ్రులీఉత్తమగ్రంథప్రకాశకునకు తగు పోషణప్రోత్సాహములు కలిగించుట పై ఉపదేశమును శిరసావహించుటయే యగును.



సోల్ ఏజెంట్లు: పటేల్ స్టోర్సు, మునిసిపల్ హైస్కూలు రోడ్డు, బెజవాడ.

'కార్లసరదా తీరాలంటే కాంగ్రెస్‌కు వోటుచెయ్యాలి.'

నా కారు సరదాలు

మొదటికారులో నాతోబాటు కిరసనాలు డబ్బాలు, గోనెమూటలూ—
పెళ్ళాన్ని కారెక్కించిన సుబ్బమ్మమగడంత మంచిమనిషి లేడనిపించింది—
కుచ్చులకథేనా చదవటంరాని నువ్వు మొహాలకి కారు ఎల్లా వస్తుంది ?—
కారువేపు తిరిగి తిరిగి చూస్తూనే లోపలికెళ్ళా. కాని తిరిగివచ్చేటప్పటికి లేదు—

రచయిత:

శ్రీమతి బులుసు ప్రకాశమ్మ

౧

నాకు చిన్నప్పటినుంచీ కూడా కారెక్కడమంటే వల్లమాలిన సరదా.

కారులో కూచుని కాలుమీద కాలు వేసుగుని పేపరు చదుకుంటూ వెళ్ళే మగవాళ్ళనూ, కిటికీల మీద మోచెయ్యానించి ముంజేతిని చెంపమీద అదో నాజూకుగా మోపి ఇటువేపువాళ్ళనీ అటువేపు వాళ్ళనీ యధాలాభంగా చూచినట్లు చూస్తూ వెళ్ళే ఆడవాళ్ళనూ చూస్తే వీళ్ళు ఎంత పుణ్యంచేసుగు పుట్టారా అనిపించేది నాకు.—

దూరాన్నించే అది లోకాలు జయించిన వీరాధివీరుడల్లే ఎవరి లక్ష్యం లేకుండా గర్జిస్తూరావడం, రోడ్లమీదవాళ్ళంతా హడావిడిగా తప్పుగుని దానికి దారివ్వడం దాని ధూళిదుని అంటే అది అందరిమీదా విజృంభింపజేసే దుమ్మువర్షై రాలని యావన్మందీ కిక్కురుమనకుండా సహించడం చూచేసరికి అమ్మమ్మ కథలోచెప్పే, దిగ్విజయంపోం దిన రాజకుమారు డిల్లాగే వుండేవాడేమో అని అనుకునేదాన్ని.

ఆసమయాన్ని ఆకారులో కూచున్నవాళ్ళు రోడ్లమీద ఈపక్కా, ఆపక్కా నడుస్తూ ఖంగారుగా తప్పుగుంటూ, దుమ్ముబాధను చేతులతో చేతనయినమట్టుగు నివారించుగుంటూ, సందులో సందు చేసుగుని తమవేపు చూసేవాళ్ళకి, ఓదార్జాఅంటున చూపు విసిరేసి, ఇట్టే మాయమైపోతూంటే, మనకూడా ఈసౌభాగ్యం ఎన్నడేనా పట్టునా! అనిపించేది. పోనీ ఎవళ్ళ కారేనా ఓమాటు ఎక్కి సరదా తీర్చుకుందామంటే మావూళ్ళో ఎవరికీ కారులేదు. మాదో వెధవ్వూరు. ఇటు పల్లెటూరూకాదు- అటు పట్ణమూకాదు- గబ్బిలాయిలాగ. ఈలాటివూళ్ళో కార్లెవరి కుంటాయి.

ఓనాడు నాచిన్ననాటి స్నేహితురాలు లక్ష్మి మాయింటికి వచ్చింది. మాటల్లో ఆవిడగారు తనుకారుమీద చుట్టాల ఇళ్ళకి ఏవేవోవూళ్ళు వెళ్ళానంటూ తెగచెప్పడం మొదలెట్టింది. పోనీ నాకారుముచ్చట కూడా అల్లాగే తీర్చుకుందామని చూస్తే మాఅత్తిల్లూ, పుట్టిల్లూ కూడా వొక్కవూరే. ఒక్కవూరే ఏమిటి! ఒక్క ఇల్లేకూడాను, మా మేనత్తకొడుక్కే నన్నిచ్చారు. వాళ్ళు మొదట్నించీ మా ఇంట్లోనే ఉండడం. ఇహా వెళ్ళడం ఎక్కడికి?-

ఓమాటు మా దూరబ్బంధువులొకళ్ళ ఇంట్లో పెళ్ళొచ్చింది. లంఖణాలబోటెక్కితే రోజున్నరకి గానీ జేరలేం అవ్వూరు. అందుచేత కారుమీదెడదాం అన్నారు మామానాన్న. నాఆనందానికి హద్దులేదు. కారెక్కుతాననే సరదానాలో పొంగి పొర్లి గట్లుతెగి ప్రవహిస్తోంది. మూటలు కట్టుకునేటప్పుడేమిటి! రవికలు కుట్టుకునేటప్పుడేమిటి! చేతులో ఏపనిచేస్తున్నా నామనస్సుమాత్రం కారులో కూచునేటప్పటి ఆనందమే అనుభవిస్తోంది. ఏంచీర కట్టుగోవాలో, ఏపద్ధతిగా కోచోవాలో కూడా నిర్ణయం చేసుగున్నాను. అనుకున్న రోజు వచ్చింది. కారు గుమ్మంలో కొస్తుం దిగదా సరదాగా ఎక్కవచ్చు

అనుకున్నాను. మానాన్న తొందరగా పదండి కారుమించిపోతుంది అన్నాడు — కారేదన్నాను తెల్లపోతూ.

నీమొహం కారిక్కడ కెల్లా వస్తుంది. రచ్చసావిడి దగ్గరకెళ్ళి ఎక్కాలిగాని అన్నాడు. నా సంతోషంలో సహం నీళ్లు కారిపోయింది. ఎల్లాగో కాళ్ళీడ్చుకుంటూ అందరితోపాటు రచ్చసావిడి దగ్గరికి జేరాను. కారొచ్చిందిగాని, అది నేననుకున్నదానిలా లేదు. కిరసనాయిలు డబ్బాలూ, గోనె మూటలూ దాన్నిండావున్నాయి అసలు నాకు దాన్ని ఎక్కడానికే మనస్కరించలేదు. పోనీ కొంత కాకపోతే కొంతైనా సరదా తీరుతోందిగదా అని సమాధానపడి కారెక్కాను. తొందరగా కిటికీదగ్గర కెళ్లాను. నే అనుకునే రకంగా కూచుందామని కూచున్నాను. ఇట్టే చెయ్యిమోపుగోబోతే అక్కడనే అనుకునే పరుపుల్లేవు సరిగదా కిటికీకూడా లేదు.

ఇది నా మొదటి కారు సరదా—

౨

ఓనాడు మాపక్కింటి సుబ్బమ్మగారి వీధులోకి అచ్చంగా నేననుకున్న కారులాంటిదే ఓకారొచ్చి ఆగింది. ఎవరో నలుగురు మంచి మంచి బట్టలు కట్టుకున్నవాళ్ళు ఆచచ్చు సుబ్బమ్మను ఎంతో ప్రత్యుద్ధానంచేసి ఆకారులో ఎక్కించుకుని తీసికెళ్ళారు. ఏమిటా! ఇదీ! అని విస్తుపోయి అల్లాగే నుంచున్నాను. ఆఖరికి యిదంతా జాతకం మహిమ అనుకున్నాను. నల్లపూసలోకి తెల్లపూసైనా లేని సుబ్బమ్మ అల్లాంటి కారెక్కిందీ అంటే అది జాతకంమహిమ కాకపోతే మరేమిటి? మర్నాడు ఆవిణ్ణి ఆరహస్యమేమిటో చెప్పి నన్ను ధన్యనుచేయమని అడిగాను.—

ఈమధ్యను వాళ్లాయన, ఓపూరిల్లోటి చవగ్గా అమ్మవస్తే, నూటయాభై రూపాయిలకు కొని, తన పేర పెట్టాడనీ, దానితో తనకు ఓవోటుకూడా వచ్చిందనీ, ఆకారు వాళ్లు ఆవోటువాళ్లేననీ, తన వోటు కోసమే వాళ్లు తనను కారెక్కించారనీ, ఆవిడ యెంతో అతిశయంతో చెప్పింది.

ఆమాట కాస్తా వినేసరికి నా నవనాళ్ళూ కుంగిపోయాయి.

ధర్మపత్నిపేర కాస్తో, కూస్తో కొని ఓటు సౌభాగ్యం కలుగజేసి కారెక్కించిన సుబ్బమ్మ మగడంత మంచిమనిషి లోకాలన్నీ వెదకినా లేడనిపించింది. మనసులోనే మా ఆయన్నూ నన్నూ కలుపుగుని ఓ లక్ష తిట్టుగున్నాను.

ఓనాడు సాయంత్రం నేను చెరువునించి బిందెఎత్తుగుని వచ్చేసరికి, మాముందు వాకిట్లో చాపమీద, ఎవరో నలుగురు ఆడవాళ్లు కూచునివున్నారు. నేననుకున్నట్టే వాళ్లు మావూరువాళ్లు కారు. మావూరువాళ్లకి ఆపాటిఅందం కూడాను! నాకు వాళ్లతో ఏం మాట్లాడాలో, ఎల్లా మాట్లాడాలో తోచలేదు. కళ్ళు అలా అప్పగించి నిలబడ్డాను.

మీవయస్సు? మీపేరు? మీయింటి నెంబరు? అంటూనే ఓ చిన్నపుస్తకంలో ఏమిటో రాశేసుగోడానికి ప్రయత్నించింది ఒకావిడ.

ఎలక్షన్లు వొస్తున్నాయి, సంతకం చెయ్యడం చేతనైనవారందరికీ ఓటివ్వడానికి అధికారంవచ్చింది. మీవోటు కాంగ్రెసుకివ్వాలి. మేం మళ్లీవస్తాం అంది రెండో ఆవిడ.

నాకళ్లఎదట సుబ్బమ్మెక్కిన కారు జిగాల్ మంది.

వాళ్లమాట కడితేరా అవకుండానే అల్లాగే యిస్తాను అన్నాను, తొందరగా, కారెక్కుతాననే సంతోషంతో! నా గొంతుగులోంచి ఓపట్టాన మాట పెగిలింది కాదు.

ఆవేళరాత్రి వంట ఏమీ చేతబడలేదు. ధ్యానంఅంతా ఆవచ్చిన ఆడవాళ్లమీదేవుంది. ఆవోట్ల పండగింకా ఎన్నాళ్ళుందో! వాళ్ళ [illegible] కారు ఎల్లావుంటుందో!

కొంపతీసి ఆవేళ పెళ్లికెళ్లినలాంటి కారు తేరుగదా!

ఏంచీర కట్టుకోడం అంటూ కొంతసేపు—

ఇందాకటి ఆడాళ్ళు ఎంత నాజూకు మనుషులు. ఓట్లవాళ్లంతా యిల్లాగే వుంటారేమో! వాళ్ళు మాట్లాడుతూంటే నాగస్వరం పట్టినట్టుంది. వాళ్లందరూ కళ్లకిజోళ్ళు పెట్టుగున్నారు. కాంగ్రెసువాళ్లందరికీ చత్వారంవస్తుంది కాబోలు. అని కొంతసేపు—

ఇవే ఆలోచనలు—

నాకు గాంధీచీర లేదు. నాపెళ్ళి నాడు మాఅత్తవారు పెట్టినది కొల్లేటిచీర ఒకటి పెట్టెలోవుంది. పట్టుచీరకూడా గాంధీచీరల్లోనే జమ అన్నారు, ఎవరో. ఆమాట, తోచీతోచడంలో, ఏనుగు నెక్కి నట్టైంది నాకు. గాంధీచీర లేని యిబ్బంది తీరింది.

ఆనుకున్నరోజు వచ్చింది. మా యింటిముందర కారాగింది. అది అచ్చంగా నేననుకున్న కారే. నేను చీరకట్టుగుని సిద్ధంగానే వున్నాను. గబగబా వెళ్లాను కారుదగ్గరికి. మావీధివాళ్ళు చాలామంది గుమ్మాలలోనే వున్నారు. తలుపు దగ్గర నుంచున్ని అందరి వేపూ ఒకమాటు చూశాను.

కుచ్చుల కథేనా చదవటం రాని చచ్చుమొహాలు! మీమొహాలకి కార్లరమ్మంటే ఎల్లా వొస్తాయి అనుకున్నాను, వాళ్లని చూచి.

సీతాకోకచిలకలాంటి బట్టలు కట్టుగున్న ఓ అబ్బాయి కారు తలుపు తీశాడు. కిటికీదగ్గర నేనను కునేమో స్తరుగా కూచుందామనే ఉబలాటంతో లోపలికెళ్లాను. అప్పటికే ఎవరో ఆడాళ్ళు ముగ్గురు దాన్లో వున్నారు. వాళ్లూ నాలాంటి వాళ్లే కాబోలు కిటికీలు గట్టిగా పట్టుకు మరీ కూర్చున్నారు. నాసరదా సహం చచ్చిపోయింది. పెట్టిన్నివారికీ పుట్టించేసాక్షి! అనుకొని అల్లాగే వాళ్ల మధ్యనే కూచున్నాను.

బొంయి, బొంయి, ఘంటూ కారు బయలుదేరింది. మావూరు వాళ్లంతా మావేపే చూస్తున్నారు. నేనుకూడా వాళ్ల వేపు తలతిప్పకుండానే చూశాను.

వెళ్లి, వెళ్లి, కారు ఓఇంటి ముందు ఆగింది. ఆయిల్లు ఓపెళ్లి వారి ఇల్లులావుంది. బాజాలుమాత్రం లేవు. ఇందాకటి అబ్బాయి కారు దిగమన్నాడు. నాకు దిగబుద్దెయ్యలేదు.

ఎంతమందో మాకు పచ్చటి శుభలేఖలు అందిచ్చారు. నామటుకు నాకు పది శుభలేఖలు ముట్టాయి. కారువేపు తిరిగి తిరిగి చూస్తూనే లోపలి కెళ్లాను.

అక్కడ వాళ్ళు చెయ్యమన్న కర్మకలాపం తొందరగా కానిచ్చుగుని ఒక వురుకున వీధిలో కొచ్చాను- కారెక్కు దామని. కారు వీధులో లేదు—గుండెలలో అయిదురోకళ్లపోటు గబగబలాడింది. ఎటుచూచినా కార్లూ, బళ్లూ దిగే వాళ్లేగాని ఎక్కేవాళ్ళు కనబడ్డం లేదు. దూరాన్ని కొందరు ఆడాళ్ళు కొంగునెత్తి మీద కప్పుగుని చేతులు నుదుటికి అడ్డంగాపెట్టుగుని వెడుతూ కనపడ్డారు. విధిలేక నేను కూడా వాళ్లను అనుసరించాను.

నా రెండవకారు సరదా యీ విధంగా తీరింది.

విడుదలకు సిద్ధమవుతూఉన్నది

సారథి ఫిలిమ్సువారి

అత్యుత్తమ సాంఘికచిత్రం

తరతరాలనుండి ఇతరజాతులవారంతా
కాలిక్రిందబెట్టి నలిపివేస్తున్న అంటరానివారి
దీనచరిత్ర


"మాలపిల్ల"

(తెలుగు)

డైరక్టరు
గూడవల్లి రామబ్రహ్మం.

మ్యూజిక్ డైరక్టరు
భీమవరపు నరసింహారావు.

కాంచనమాల
సుందరమ్మ
సూరిబాబు
వెంకటేశ్వరరావు
డాక్టర్ సుబ్బారావు
రాఘవన్



బుక్కింగునకు:—

సరస్వతీటాకీస్ లిమిటెడ్,
బెజవాడ.

'గురువాయూరులో మహత్తరమైన శ్రీకృష్ణదేవాలయ మున్నది'

కలశాలతో ఊరేగే నాయరుకన్యలు

చొక్కాలతో లోనికి పోకూడని గుళ్లు.
కడజాతివారు కాలుపెట్టకూడని వీధులు.

['మలబారు పర్యటన సందర్భమున ఈ వ్యాసకర్త రచియించిన వ్యాసములలో నిది మూడవది. మొదటిది 'త్రిచూరు'ను గూర్చినది. అది మార్చి సంచికలో ప్రచురితమైనది. రెండవది 'కళ్ళికోట'ను గూర్చినది. అది మేసంచికలో ప్రకటితమైనది.
—సంపాదకుడు.]

రచయిత:

యం. వి. కృష్ణరావు, బి.ఎ., (ఆనర్సు)

'అయ్యా! యిక్కడికి (త్రిచూరికి) ఇరవై మైళ్ళ దూరంలోవున్న 'గురువాయూరు'లో మహత్తరమైన శ్రీకృష్ణదేవాలయ మున్నది. దాన్నిదర్శిస్తే మీ జన్మసార్థకమైనట్లే', అన్నాడు నాతో ఒకసారి లక్ష్మణఅయ్యర్. ఆలయాల్లో, వాటిమహత్తులో నాకు నమ్మకంలేదు. నిజంగా ఆలయాలకి సదుద్దేశాలతోను, దైవారాధనచేయడానికి వెళ్లేవాళ్లు బహు తక్కువ. చక్కగా సింగారించుకుని కేవలం జనాన్ని చూడడానికి చర్చికివెళ్లే క్రైస్తవులని మనవాళ్లు అనుకరిస్తున్నారు. అందుచేతనే గౌరవనీయు లెవరూ ఇప్పుడాలయాలకి వెళ్ళడంలేదు. ప్రపంచమంతా కాంచనమయమైపోయింది; ప్రతిదానికి డబ్బు- ఆఖరుకి వెంకటరమణస్వామి దర్శనానికి రూపాయి టిక్కెట్టు తిరుపతిలో-యిట్లాంటివి చూస్తే మెడమీద తలకాయవున్న ప్రతివాడికి నెత్తురు వుడుకెత్తుతుంది. ఇకనైనా ఆలయాలకి వెళ్లేవాళ్లు ప్రత్యక్షంగా జరిగే ఈఅక్రమచర్యలు జరగకుండాచూస్తారని నేను వాంఛిస్తాను.

అవర్ణులకు శ్రీకృష్ణదేవాలయప్రవేశమివ్వకపోవుటవల్ల కొంతకాలం క్రింద కేళప్పన్ గారు ప్రాణం పోయేంతవరకు ప్రాయోపవేశం చేస్తానని శపథం చేసి చాల ఖ్యాతి గడించారు; ఆయనతోపాటు గురువాయూరికి కూడా పెద్దపే రొచ్చింది. సరియైన సమయానికి గాంధిగారడ్డుపడి కేళప్పన్ గారి ప్రాయోపవేశాన్ని విరమింపచేశారు. లేకపోతే కార్యదక్షుడు కేళప్పన్ గారు తమ ప్రయత్నాన్ని మానుతారా? చిట్టచివరకేమీజరగలేదని, పరిస్థితులు యథావిధిగానే ఉన్నాయని వాకబ్ చేయగా తేలింది. బ్రిటీషు మలబారులోని ఆలయాలన్నిటికి జామరిన్ ధర్మకర్త. ఆ మహానీయుడు అవర్ణులీఆలయాల్లో ప్రవేశించడాని కెంతమాత్రం వీలుపడదన్నాడు. దీనిసంగతి స్వయంగా చూస్తే యుక్తమని 'త్రిచూరు'లో సాయంకాలం అయిదుగంటలకు బస్సు యెక్కాను.

మలబారు ప్రజలు చాల బీదవాళ్లులా కనబడ్డారు. కొంపగోడి లేకుండా, అర్థాకలితో, అస్తిపంజరాల్లాంటి శరీరాలతో వీధులవెంట ఊర్కే తిరుగుతున్న జనాన్ని చూడటం నాకు చాలకష్టమనిపించింది. ఈమధ్య ఏలూరులో ఉపన్యసిస్తూ శ్రీమతి సరోజనీదేవి ఆంధ్రదేశంలోని ప్రజలంతా రోజుకి ఒకసారన్నా తిండి తింటున్నారు; ఉత్తరదేశంలో అదికూడా కరువైపోయిందని సెలవిచ్చింది. తిండికి కరువైనదేశాలకి నేను కేరళదేశాన్నిగూడా చేరుస్తాను. ఈ ఒక్క విషయంలో మాత్రం భగవత్కటాక్షం ఆంధ్రదేశంమీద పరిపూర్ణంగా ప్రసరించింది. ఆంధ్రమాత తన ముద్దుబిడ్డలు తిండిలేక మలమల మాడటం చూసి ఓర్వలేదు; అందుకని దేశాన్ని సస్యశ్యామలంగా చేసింది. ఆంధ్రమాతృహస్తం అన్నపూర్ణం. 'ఆంధ్రమాతా! నీకు జోహారు.'

గురువాయూరు చేరుకునేసరికి రాత్రి ఏడున్నరయింది. బస్సు దిగటంతోనే ఆలయానికి దగ్గరలోవున్న సత్రానికి దారితీశాను. ప్రయాణీకుల సౌకర్యం కోసం ఆసత్రంలోనే భోజనహోటలు పెట్టాడో మలయాళీ బ్రాహ్మణుడు. హోటల్లో భోజనం చేస్తున్నప్పుడా ఊళ్ళోనే సబ్ట్రెజరీలో హెడ్డు అక్కౌంటెంటుగా పనిచేస్తున్న అయ్యరు మహాశయుడు తగిలాడు. చూశారూ, మనం సిమ్లా కొండలనుంచి కన్యాకుమారి అగ్రంవరకు వెళ్లినా అరవలు మటుకు

తప్పక రాచపీనుగు తోడులేందే చావదన్నట్లు వాళ్లు ఒక్కళ్లురారు, తోడుగా ఒక కాఫీహోటలు వెంట పట్టుకొస్తారు. ఆంధ్రదేశంలోని భోజనకాఫీహోటళ్ళలో ముప్పాతిక మూడుపాళ్లు అరవలు పెట్టినవే; తెలుగుదేశంలోఉన్న రైల్వే స్టేషనులోని హోటళ్ళలో పనిచేసే వారంతా అరవలే; ఉద్యోగాలన్నీ అరవలు గుత్తకు పుచ్చుకున్నారు. చివరకు బొబ్బిలిరాజుగారు దయతో ప్రసాదించిన కమీషనర్లుగూడా అరవసోదరులే! ఏమైపోయారు తెలుగువాళ్ళు? అరిపోలేదు, అరిపోలేదు ఆంధ్రజ్యోతి అని ఊర్కేగుండె పగిలేటట్లు అరిచి యేమి ప్రయోజనంలేదు. దాన్ని కార్యరూపేణ చూపిస్తే మన తడాఖా తెలుస్తుంది. ఆంధ్రులుగూడా దేశమంతా యెప్పుడాక్రమిం చుకుంటారా అని యెదురుచూసేవాళ్లలో నేనొకణ్ణి.

మొట్టమొదటూ రాత్రే దేవుడి దర్శనం చేసుకుని మర్నాడు తెల్లవారుఝామున వెళ్లిపోవాలనుకున్నాను. కాని మంచి వాడులాగున్నాడయ్యారు, 'రేపుత్సవ మొకటుంది. నాయరు కన్యలు చక్కగా అలంకరించుకుని కలశాలతో ఊరేగింపు ముందు నడుస్తారు. వచ్చినవాళ్లెట్లాగు యింతదూరం వచ్చారు గదా, ఆ నేత్రానందకరమైన దృశ్యాన్ని చూసి మరీ వెళ్తే బాగుంటుంది,' అన్నాడు. పెద్దవాడు చెప్పిన మాట తీసెయ్యలేక సరే అన్నాను. తదితర ఆలయాల్లోకి రానిచ్చినట్లు మలబారు గుళ్ళలోకి చొక్కాలతో రానివ్వరు. మహారాజాదగ్గరనుంచి ఖూలీవాడివరకు (స్త్రీలుతప్ప) వక్షోభాగం మీదేమీ లేకుండా వెళ్లాల్సిందే! రాత్రి చలిలో యెందుకొచ్చిన బాధ, యేకంగా అన్నీ ప్రొద్దున్నే చూడొచ్చునని సత్రంలో హాయిగా నిద్రపోయాను.

ప్రొద్దున ఊరు చూపిస్తానని వెంట తీసుకెళ్లాడయ్యారు. శ్రీకృష్ణాలయం వల్లే గురువాయూరికంత ప్రాముఖ్యత వచ్చింది. దేవాలయపరిసరాల్లోవున్న వీధులవెంట అవర్ణులని పిలువబడే వాళ్ళెవరు నడవటానికి వీల్లేదుట. కేరళదేశంలో అస్పృశ్యత తీవ్రంగా వున్నదని సర్వజనవిదితము. తియ్యాలు, యెజహావాలు, నాయాడీలు, పొడయాచీలు (అవర్ణులాపేర్లతో పిలువబడుతారు మలబారులో) సవర్ణహిందువుల దౌర్జన్యాన్ని భరించలేక తండోపతండాలుగా అన్యమతములు స్వీకరిస్తుంటె, సనాతనులందరు విస్తుపోయి వేలు కదల్పకుండా కూర్చున్నారు. ఇదేవిధంగా దేశంలోని ప్రజలంతా ఊరుకుంటె పుణ్యభూమి హిందూదేశంలో హిందువు డనేవాడు ఉండకుండాపోతాడు. బౌద్ధమతం మాదిరి హిందూమతంగూడా జన్మభూమిని విడిచి పారిపోతుంది. గాంధిగారి తపఃప్రభావ కార్యదీక్షులవల్ల మాలవ్యాజీ పండితుల సదోబ్ధవల్ల అస్పృశ్యత మహారాక్షసి కొనఊపిరితో వున్నది; రేపో మాపో చచ్చిపోవడం మటుకు సత్యం. కేరళదేశంలో ఉన్నంత ఘాటుగా అంటరానితనం మనదేశంలో లేదు. పల్లెటూళ్ళలో కొంచెంగావుంటే దాన్ని కొండంత చేసి సంఘసంస్కారుల మనుకునే కొందరు కథకులు పత్రికలలో పేజీలు పాడుచేస్తున్నారు. సంస్థానాధికారంలోవున్న దేవాలయాలన్నిటిలోకి జాతిమతభేదములేకుండా అందరు రావచ్చునని తిరువాన్కూరు మహారాజాగారు శాసించటంతోనే యెండిపోయిన అవర్ణుల హృదయాలు మళ్ళీ చిగుర్చాయి. కజిన్సుగారు పోలండుస్త్రీ (ఉమాదేవి) హిందూమతం స్వీకరించిన తర్వాత హిందువులలో కొంతసంచలనం కలిగింది. ఓహో! హిందూమతం యింత ఉత్తమమైనదా అనే భావంకూడా ప్రబలింది. ఎటువంటి అజ్ఞానాంధకారంలో వున్నాం మనం! కేరళదేశంలో అన్యమతస్వీకరణయొక్క ముమ్మరం చాలవరకు తగ్గిపోయింది. దేవాలయప్రవేశార్హత యిచ్చినంతమాత్రాన అవర్ణులకు మానసికసంస్కారం కలుగుతుందని గాని, ఆర్థికంగా బాగుపడతారనిగాని నేననుకోను. హిందూసంఘానికి చేరియుండి, తోటిహిందువు లనుభవించే హక్కులను అవర్ణు లనుభవించకపోవడం ఘోరమైన అన్యాయం. ఈ ఒక్క కారణంకోసమే హరిజనుల దేవాలయప్రవేశాని కందరు సమ్మతించాలి.

దేవాలయ ధర్మసత్రం చాలపెద్దది. కుటుంబాలుండటానికి కొన్నిభాగాలు, నాబోటి బ్రహ్మచార్లుండటానికి కొన్ని ప్రత్యేకగదులు వున్నాయి. సత్రంలో సంస్కృతపాఠశాల నొకటివున్నది. అక్కడ బ్రాహ్మణబ్రహ్మచార్లకి సంస్కృతం, వేదం విధిగా నేర్పిస్తారుట- అంతా బాగానేవున్నది. హిందూధర్మాదాయాల బోర్డు స్థాపించబడ్డ పిమ్మట, ధర్మకర్తలు నిద్రనుంచి మేల్కొని గట్టిగా పని చేస్తున్నారు; ఇన్స్పెక్టరు పరీక్షచేయడానికి వస్తున్నాడంటె హడిలిపోతారు. ఈ బోర్డువల్ల యెక్కువ ప్రయోజనం లేకపోయినా, లెఖ్ఖలవిషయంలో, ఆలయాల్ని చూడటానికి వచ్చే ప్రజల యేర్పాట్ల విషయంలో ఉపయోగకరంగానే వున్నది. బోర్డుసభ్యులకు ఆలయపు టాచారసంప్రదాయాలేమి తెలియకపోవడం శోచనీయం. ఇవన్నీ తెలిసినవాళ్ళని నియమిస్తే ఆలయనిర్వహణం పకడ్బందుగా వుంటుంది.

శ్రీకృష్ణాలయంలోకి ప్రవేశించేసరికి దైవభక్తిలో మునిగి తేలుతున్న భక్తులు నాకంటబడ్డారు. లోపలున్న జనాన్ని, విగ్రహాల్ని చూసి బయటకొచ్చేశాను. దక్షిణదేశంలోని ఆలయాలు ఆయాదేవతల మహాత్మ్యమువల్లను, శిల్పకళావైపుణ్యంచేతను అఖండమైన ఖ్యాతిని సంపాదించాయి. శిల్పకళ ఉట్టిపడే ఆలయం మలబారులో మచ్చుకైనా కనబడదు.

ఆలయానికి సమీపంలో ఒకస్నానఘట్టమున్నది. ఏదో దుర్గంధపూరితమైన

తైలాన్ని రాసుకుని, ఆ కోనేరులో చాలమంది జలకమాడుతున్నారు. పరిశుభ్రతకోసం రోజుకి రెండుమూడుసార్లు స్నానంచేయడం మంచిదే! కాని నూనె పోకుండా స్నానంచేయడ మంత ఆరోగ్యకరంకాదు. శీకాయి వాడి జిడ్డు పోగొట్టుకుంటె బాగుంటుందనే సంగతి అక్కడివారు తెలుసుకోవాలి.

సత్రంలో విశ్రాంతి తీసుకుంటుంటె ఒకడు నాగదిలోకి వచ్చాడు.

'ఎవరయ్యా నువ్వు?'

'ఉడిపి బ్రాహ్మణ్ణండి.'

'ఉడిపినుంచి యింతదూరం యెందుకొచ్చావు? అయినా యేమిటి సంగతి?'

మీబోటి పెద్దల అనుగ్రహంవల్ల చాలకాలంనుంచి యిక్కడే కులాసాగా వుంటున్నాను. తమ సెలవైతే దేవుడి ప్రసాదం తెచ్చిపెడతాను.

'సరే, తీసుకురా.'

'చిత్తం.'

వాడు చల్లగా జారుకున్నాడు. వాడి వైఖరిచూస్తే కొంచెం అనుమానాస్పదంగానే వున్నది. సాధారణంగా దేవాలయాల్ని అంటిపెట్టుకుని 'పండాలు' అసంఖ్యాకులున్నారు. దేవుడిదర్శనం చేసుకోడానికి వచ్చేవాళ్ళకి వసతిభోజనసదుపాయాలు చేసి, ధనార్జనచేయడం వాళ్ల వృత్తి. ఈపండాలు అందరు గర్హించవలసిన పనులుగూడా చేస్తున్నారు. వాటి నీవ్యాసంలో వ్రాయడానికి నా మనసు వొప్పటంలేదు; వాటిని పాఠకులీపాటికి ఊహించేవుంటారని తలుస్తాను. ఈపండాలు ప్రతివాణ్ణి జలగలాపట్టి డబ్బుకోసం పీక్కుతింటారు. బడితల్లాగున్నా పనిచెయ్యడానికి వాళ్ళకిష్టంలేదు. మొన్న ఒక బ్రాహ్మణ్ణి, యేదన్నా పనిచేయరాదుటయ్యా- ఊర్కే యాచిస్తూ యెన్నాళ్ళని కాలంగడుపుతావంటె- ఆయన గుడ్లెఱ్ఱచేసి, 'పూర్వజన్మపుణ్యంవల్ల మీరుద్యోగంచేస్తూ హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. యాచనచేయటం నాజిరాయితీహక్కు- నేనేమి పని చెయ్యలేను, చెయ్యను', అని వెళ్ళిపోయాడు. పాపం యెంతకోపం వచ్చిందాయనకు! యాచనవృత్తి అవలంబించడంవల్లనే బ్రాహ్మణు లధోగతిలో వున్నారు. అందరిలా యేదైనా ఉపయోగకరమైన వృత్తిని బ్రాహ్మణులుగూడా అనుసరిస్తే గౌరవప్రదంగా వుంటుంది.

ఉడిపి బ్రాహ్మణుడు ప్రసాదంతో చక్కావచ్చాడు. అక్కడ ప్రసాదమంటె తినుబండారంకాదు- గంధంలాగుంటుంది. అదేం పాపకర్మమో గాని ప్రతివాడికి యీరోజుల్లో యేదో ఒకవిధమైన మేత అత్యవసరమైపోయింది. నువ్వు అరిచి చచ్చేది ఒక్కకానీయివ్వను. దేవుడిప్రసాదానికి కూడా డబ్బేమిటని వాణ్ణి వొదుల్చుకునేసరికి నాతలప్రాణం తోకకి వచ్చింది. ఆశీర్వచనమంత్రాలుచదివి నామీద నాలు గక్షతలు వేసి వెళ్ళాడు. వెళ్లేముందు రాత్రి పునర్దర్శనం చేసుకుంటానని అర్థయుక్తమైన ఒక మందహాసం చేశాడు. ఆమందహాసంయొక్క స్వారస్యం మీకు తెలిసేవుంటుంది! అయితే నేనేమి లాభం లేదన్నట్లుగా తలపంకించాను.

ఇంతలో క్రొత్తరకపు మేళతాళాలతో ఊరేగింపు బయలుదేరింది. బయట ఊళ్ళనుంచివచ్చిన తీర్థప్రజకి అంతులేదు- ముఖ్యంగా నాయరుస్త్రీలు. కొచ్చిను మహారాజాగారి అయిదేనుగుల్ని చక్కగా అలంకరించారు. సూర్యరశ్మిలో ఆఆభరణాలు మిలమిల మెరిసిపోతున్నాయి. ప్రతియేనుగుమీద ఒకనంబూద్రీ బ్రాహ్మణుడు కూర్చున్నాడు. నిమిషనిమిషానికి ఆ కూర్చున్నవా డమాంతం లేచి నిల్చుని చేతుల్లోవున్న రెండు చామరాల్తో విసురుతాడు. నేను చూస్తుంటె ఆవిధంగా రెండువందలసార్లు విసిరాడు. దేవాలయానికి ఫర్లాంగు దూరంలోవున్న సత్రం దగ్గరికి రావటానికి పక్కాగంటసేపు పట్టింది.

సందెచీకటి పడుతోంది. ఇక కాలయాపన చేయకుండా బస్సు యెక్కి 'త్రిచూరు' చేరుకున్నాను. త్రిచూరికి నాలుగుమైళ్ళ దూరంలో 'మణ్ణుగుత్తి' అనే ఊరున్నది. అక్కడ శ్రేష్ఠమైన అగ్రికల్చరల్ ఫారమ్ వున్నది- చూడతగిన ప్రదేశం. కొచ్చిను సంస్థానంలో దోమ లెక్కువ. ఆదేశం చూడటానికి వెళ్ళేవాళ్ళు దోమతెర తీసుకువెళ్ళడం శ్రేయస్కరం; మరిన్ని ఆదేశంలో ఉన్నంతకాలం కాచిన నీళ్ళనే త్రాగమని సలహా యిస్తాను.

పండితపామరరంజకమై ఆంధ్రులను అన్నిరీతుల నలరింపచేయజాలు ఫిల్ము
ఇప్పటి కిదియేయని గర్వముతో చెప్పనగు చిత్రరాజము.

త్వరలో విడుదలయగును. తేదీకై నిరీక్షించుడు.

సంజీవి (లేక) కచ-దేవయాని.

కన్నులపండువొనర్చు నృత్యములు—మధుర గానము— విచిత్రసంఘటనలు— భీకరారణ్యములు.
హిమవత్పర్వతదృశ్యములు— చిలకసరస్సు— భయంకరమగు పోట్లాటలు.



కచుని కార్యదీక్ష- దేవయాని ప్రేమ- శుక్రుని నీతులు- రాక్షస రాజుయొక్క దౌష్ట్యము-నారదుని తాంత్రికము- మణికాదేవి భరత నాట్యము.

తారాగణము :

ఆంధ్రదేశమున అసమానకీర్తివహించిన
శ్రీమతి కృష్ణవేణి,
శ్రీమతి కాంతామణి,
శ్రీమతి రాజు,
ఆర్. రామిరెడ్డి (మాయాబజారులో ఘటోత్కచుని పాత్రధారి),
చొప్పల్లి, రఘురామయ్య,
యస్. పి. లక్ష్మణస్వామి,
కుంపట్ల, సి. హెచ్. రామకృష్ణారావు
మొదలగువారు.

ప్రదర్శకులు :
బి. వి. రామానందంగారు & రాధాఫిలుమ్ కంపెనీ.

ఫొటోగ్రాఫరు :
ప్రభోద్ దాస్.

For Booking Apply to:

Chamria Talkie Distributors.

Tele-Chamriya.] 20 Vepery High Road, P.T., Madras. [Tele-2675.

ఆధునికాంధ్రవాఙ్మయమున చిన్నకథ-నవల

రచయిత :
చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాద్, బి.ఏ.

౧ చిన్నకథ

ఆంధ్రవాఙ్మయమునందు నేడు చిన్నకథ లొక గౌరవస్థానము నలంకరించుచున్నవి.

ఇవి కేవలము ఆంగ్ల సారస్వత ప్రోద్బలమున మన పత్రికలలో తొలిసారి తలయెత్తినవని కొందరు తలంచుచున్నారు. చిన్ననాటనుండియు కథలనిన ప్రతివారికిని మిక్కుటముగు ప్రేమ అలవడియుండును. 'అనగా అనగా ఒకరాజు' అని ముసలిఅవ్వ కథ ప్రారంభింపగనే పిల్లలందరు గుమికూడి ఆదరమున వినుచుండుట మన మిప్పటికిని జూచుచున్నారము. విషయవిశదీకరణమునందును, పాత్రనిర్వహణమునందును, నేడు, కాలమున కనుకూలముగ మార్పులు, కూర్పులు, వచ్చియుండునుగాని, కథలు మనకుగాని, మన వాఙ్మయమునకుగాని క్రొత్తలుకావు. అవి అన్యభాషా ప్రోద్బలమున క్రొత్తగా మన వాఙ్మయమున చేరినవని తలంచుట పొరపాటు.

పోకల శేషాచలనాయనిచే రచియింపబడి 1880 ప్రాంతములలో అచ్చువేయింపబడిన పంద్రెండు రాజులకథలు, గుల్బకావలియను పుష్పలీలావతి కథ మొదలగునవి కలవు. ఈకథలయందు కొన్ని పార్షీ భాషనుండి యనువదింపబడినట్లు తెలియుచున్నది. ఇవిగాక శ్రీరామానుజశర్మగారు వ్రాసిన, వినోదకథాకల్పవల్లి, చిత్రకథాలహరి, అను గ్రంథములును గలవు. ఈపై గ్రంథములయందన్నింటను అధికముగ శృంగారరసము వర్ణింపబడియున్నది. ఆకాలమునందలి సంఘమర్యాదలను ప్రతిబింబించునవిగానున్న, ఈకథలు, వాఙ్మయమున కమూల్యాలంకారములై యలరుచున్నవి.

శ్రీవీరేశలింగము పంతులుగారును పెక్కుకథలను రచియించియున్నారు; అవి స్త్రీలకుపయుక్తములై యలరుచున్నవి.

కాలముగడిచిన కొలది కథావస్తువును నిర్ణయించుకొనుటయందే మార్పు గోచరించుచున్నది. ఇరువదవ శతాబ్దారంభమునుండియు కొందరు, పురాణములనుండియు, ఇతర ప్రాచీన గ్రంథములనుండియు కథావస్తువును నిర్ణయించుకొని, చిన్న కథలను వ్రాసి ప్రకటించుటకు గడంగిరి. భారతకథామంజరి, భోజరాజుకథలు, మయూరకథామంజరి, మొదలగునవి ఈకాలముననే వ్రాయబడెను. శ్రీరెంటాల వేంకటసుబ్బారావుగారి కథారత్నావళి యందెన్నియో వింత విషయములకు చెందిన చక్కని కథలుగలవు. ఈగ్రంథము మిగుల వ్యాప్తిలోనికివచ్చి, తెనుగువారికి కథలయందుగల యభిరుచిని విశదపరచెను.

శ్రీవేంకటరాయశాస్త్రి గారి కథాసరిత్సాగరము, ఉమాకాన్తముగారి షేక్స్పియరు కథలు, సరస్వతీ పత్రికవారి యవదానకల్పలత, అరేబియాదేశపుకథలు మొదలగునవి ఇతర భాషలనుండి, అనువదింపబడినవి. బౌద్ధమతమునకు చెందినకథ లింకను మనభాషలోనికనువదింపబడుచున్నవి.

సాహితీసమితివారు, ఆంధ్రసారస్వతమునకు గావించిన సేవ యనల్పము. సాహితీ పత్రికయందు ప్రకటింపబడిన కథలు, తెనుగువారికి, చిన్నకథలయందు గలవిలువను విశదపరచినవి. చిన్నకథలను వ్రాయుట సామాన్యవిషయము కానేరదని మనవా రప్పుడే గ్రహించిరి.

పాఠకుని హృదయమున కన్నివిధముల సమ్మతమగు నట్లెంతటి విషయమునైన చిన్నకథయందు

చిత్రించుట కవకాశముకలదు.

కొందరు, ఏదియో ఒక విషయమును మనమునం దుంచుకొని, దానిని గూర్చి పాఠకునకు సమ్మకము కలుగునట్లు కథను గల్పింప బ్రయత్నింతురు. అట్టి యాశయములతో కథలు వ్రాయుట ప్రోత్సహింపదగిన విషయము. కాని మనమునందున్న ఆశయమునందే దృష్టిని నిలిపి, కథయొక్క గమనమును, కథయందు చిత్రింపబడుచున్న పాత్రలయొక్క చిత్తవృత్తిని మరచి కలమును నడపుటపాడిగాదు. కథను చదువ మొదలిడినపుడే, కథకుడు తనకేమి బోధింప ప్రయత్నించుచున్నది, పాఠకుడు తెలిసికొనినచో లాభమేమి? కథను తుదివరకు చదివి గ్రంథమును మూసినతరువాత, కథయందు ప్రస్తరింపబడిన విషయము పాఠకుని కాలోచనము రేపవలయును; 'ఈవిషయమును విశదపరచుటకు కథకు డెంతటి యుపాయమును పన్నినాడ'ని పాఠకుడు తుదిని ఆశ్చర్యమును వెలువరింపవలయును. తాను చెప్పదలచిన విషయమును, చక్కగా కథావస్తువుతో మేళవింపజేసి, పాఠకుని హృదయమున కెక్కునట్లు దానిని ప్రదర్శింపవలయును. కథావస్తువును నడుపుటలోను, పాత్రలను చిత్రించుటలోను, మానవాతీతములగు విషయములను, అస్వాభావికవర్ణనములను జేర్పరాదు. పాఠకుని తన వశమొనరించుకొని, ఒకప్పు డాతనికి విషాదమును, వేరొకప్పుడు సంతసమును గూర్చుచు, 'ఇంకను కథనడచిన, ఎట్లుండెడిదో' యను నుత్కంఠ (Suspense) వానియందు గూర్చుటకు ప్రయత్నింపవలయును; అప్పుడే, తన ప్రయత్నము ఫలవంతమైనదని కథకుడు సంతసింపదగును.

శ్రీమునిమాణిక్యము నరసింహారావుగారి కాంతముకథలు, శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి కథలు, పూడిపెద్ది వేంకటరమణయ్యగారు తొలుత భారతియందు ప్రచురించిన కథలు, శ్రీ చింతా దీక్షితులుగారి చిన్నికథలు నేటి కథావాఙ్మయమునం దుత్తమ స్థానము నలంకరించుచున్నవి.

తెనాలి యువకార్యాలయము వారి కథలు కొన్ని క్రొత్తరీతుల నలవరచుకొని యున్నవి. శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారి కథలయందలి ఆశయములు ప్రశంసార్హములు.

శ్రీ వేంకటాచాలముగారి కథలయందు కొన్ని ప్రశంసింప నర్హములైన ప్రత్యేకలక్షణములు గలవు; వీరికథ లన్నిటియందును, ఒకే ఆశయము గోచరించుచున్నది; ఇందు కొలది మార్పులను గొనివచ్చినచో వీరికథలు మిగుల రాణించును.

౨
నవల

శ్రీ వీరేశలింగము పంతులుగారు తెనుగు వచన రచనమునందు క్రొత్తతీరుల వెలయించిరని ఈవరకే వివరించియున్నాను. ఆంధ్రవాఙ్మయమున, శ్రీపంతులుగారే, రాజశేఖర చరిత్రమను నవలను ప్రథమమున ప్రచురించిరి. ఇంతకుపూర్వము మనభాషయందు నవలలు వ్రాయబడి యుండలేదు. 'వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డు' అను నవలకు, రాజశేఖరచరిత్రము భాషాంతరీకరణమని పలువురు చెప్పగా వింటిని. ఇట్టి యభిప్రాయము మనవారికేల కలుగవలసి వచ్చెనో తెలియకున్నది. ఈరెండు నవలలయందు కొలది పోలికలున్న వేమో గాని, రాజశేఖరచరిత్రము, వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డుకు భాషాంతరీకరణ మనుట కేవలము పొరపాటు. తొలిసారి ఇట్టి సాంఘికనవలను రచియించి, జయమందిన శ్రీ పంతులుగారు ప్రశంసార్హులు. తరువాత వెలువడిన ఒకటి రెండు నవలలు, రాజశేఖరచరిత్రమున కనుకరణములై వెలయుచున్నవి.

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు రచియించిన మాలపల్లె యను నవల తెలుగునవలావాఙ్మయమునం దొకప్రత్యేకస్థానమును నేటివరకు అలంకరించియున్నది. అనుకరణయోగ్యములైన ఆశయముల కది నిలయము. పల్లెటూరి జీవితము, బీదల కష్టసుఖములు, చక్కని భాషలో 'మాలపల్లె' యందు వర్ణింపబడినవి. ఇట్టి నవల, తెలుగునాట వేరొకటి వెలసి యుండలేదనినచో నతిశయోక్తి

కానేరదనుకొందును. సంఘాభ్యుదయమునకు, దేశాభ్యుదయమునకు, ఇట్టి నవలలు మిగుల దోడ్పడును. కొన్ని, అనివార్యములగు కారణముల మూలమున నింతదనుక 'మాలపల్లె' తగిన వ్యాప్తిలోనికి రాలేదు. కాంగ్రెసు మంత్రుల కరుణవలన నట్టి యాటంకములు తీరిపోయినవి, తెనుగువారికనైన ఈనవలను సమగ్రముగ పఠియించి, అందలి విశాలాశయములను, అలవరచుకొన బ్రయత్నింతురుగాక !

వర్తమాన కాలమునకు చెందిన విషయములను చక్కగా వర్ణించి, సంఘాభ్యుదయమున కనువగు నవలలను వెలయించిన వారిలో, శ్రీ చిలకమర్తి లక్ష్మీనృసింహముగా రొకరు. రామచంద్ర విజయమను వీరి నవలను, ప్రతివారును పఠియింపవలయును. అహల్యాబాయి, హేమలత మొదలగు వీరి నవలలు, చరిత్ర నాధారపరచుకొని, ఆయాకాలములందలి మర్యాదలను, సంఘపరిస్థితులను విశదము చేయుచున్నవి. సౌందర్యతిలక అను వీరి నవల పురాణగాథపై నాధారపడి యున్నది. శ్రీ చిలకమర్తి లక్ష్మీనృసింహము పంతులుగారి వచనరచనావైభవము నే కొలది మందియో నేడలవరచుకొని యున్నారు. గ్రంథమును తుదివరకు, విసుగెరుగకుండ పాఠకునిచే జదివింపగలరుచి వీరిశైలికి కుదిరియున్నది.

బంగాళీభాషనుండి పెక్కు నవలలు, తెనుగులోని కనువదింపబడెను. వీనివలన మనభాషకు కలిగిన మేలు స్వల్పము. ఉబుసు పోకకు, ఇతరగ్రంథములు సమీపమున లేని సమయములందు చదువదగినవేగాని, ఈయనువదింపబడిన నవలలవలన తెనుగుజాతి, ఆచారవ్యవహారములు, బాగుపడు నవకాశమే లేదు. తెనుగువానియందు మరుగుపడియున్న కల్పనాచాతుర్యమును, (Creative talent) ఇట్టి యనువాదములే కొంతవరకు నిర్మూలన మొనరించినవి. శ్రీ వేంకట పార్వతీశ్వరకవులు, ఇట్టి నవలలను, అనువదించి కొంతవర కమూల్యమగు కాలమును వృథాపరచిరనియే తలుపవలసి యున్నది. శ్రీ విజ్ఞాన చంద్రికాగ్రంథమండలి వారి, రాణీసంయుక్త, రాయచూరు ముట్టడి మొదలగు నవలల యందున్న 'తెలుగుదనము' వీనియందు కానరాదు.

ఆంధ్రవాఙ్మయమున కథలకు విలువ హెచ్చినకొలది, నవలలపై, అభిమానము సన్నగిల్లినది. ఇప్పటికిని, భోజనమునుగూడ మరచి ప్రారంభించిన నవలను తుదివరకు చదివి వదలువారున్నారు కాని, అట్టివారిసంఖ్య క్రమముగా తగ్గిపోవుచున్నది.

ఇంకను, కొన్ని యుత్తమములగు నవలలు, బయల్వెడలవలసిన అవసరమున్నది. సాంఘికనవలలింకను ప్రచురింపబడవలయును. కొలదికాలము క్రింద, ఆంధ్ర విశ్వవిద్యాలయమువారిచే బహుమాన మునందిన వేయిపడగలు అను శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి నవలవంటి క్రొత్త నవలలు, కొంతవరకు మన నవలావాఙ్మయమునకు వన్నెగూర్చునని యెతలంతును.

మూడు పరప్రభుత్వములనుండి పోలెండురాజ్యమును విడదీసిన

మార్షల్ జోసెఫ్ పిల్సుడుస్కీ

జాతీయవీరులలో అంతటివాడు మఱి లేడనవచ్చును.

అదృష్టము చేసికొనిన జాతియే అట్టివానిని ప్రసవించును.

ఆధునికపోలెండురాజ్యనిర్మాణమంతయు అతని చేతులమీద జరిగినది.

ఆత్మదేశముకొఱకు అతడు పడని కష్టము లేదు.

రచయిత:

కొత్తపల్లి రామమూర్తి, యల్.యం.ఇ.

ఒకప్పుడు ప్రపంచప్రఖ్యాతి గాంచినది లిథూవియాపోలెండు రాజ్యము. లిథూనియా ప్రఖ్యాతవీరుల ప్రోత్సాహముచేత పోలెండు దేశముయొక్క విజ్ఞానము వన్నె గాంచినది. అట్టి రాజ్యమును 1795-వ సంవత్సరమున జరిగిన యుద్ధములో జర్మనీ, రష్యా, ఆస్ట్రియా దేశములు పంచుకున్నవి.

రష్యన్ పోలెండునందును, జర్మన్ పోలెండునందును ఆ యా ప్రభుత్వముల దౌర్జన్యము మిన్నుముట్టినది. అందును రష్యన్ పోలెండులో ప్రభుత్వదౌర్జన్యము మిక్కిలి విపరీతముగా నుండెను. పోల్సుయొక్క జాతిని, మతమును, విజ్ఞానమును విధ్వంసముచేసి రష్యన్ జాతిని మతమును తత్ స్థానములను ఆక్రమించునట్లు చేయుటయే రష్యన్ ప్రభుత్వముయొక్క పరమావధియై యుండెను.

ఏయుద్యమమైనను అణచిన కొలదియు అభివృద్ధియగునుకదా! రష్యన్ ప్రభుత్వముయొక్క ఒత్తిడివలననే పోల్సుజాతిలో పెక్కుమంది వీరులు బయలువెడలిరి. వారు ఆత్మదేశముకొఱకు, స్వజాతికొఱకు, విశేషకృషి గావించిరి. పరప్రభుత్వపు రాక్షసకృత్యములను ఎదుర్కొని మృత్యువును కొలిచి ఆత్మజాతీయత పూర్తిగ నమసిపోకుండ వారు రక్షించినారు.

విప్లవకారులగు పోల్సును ప్రభుత్వము కఠినముగ శిక్షించునది. పిల్సుడుస్కీ జననమునకు పూర్వము పాలకజాతికి చెందిన రష్యన్ జాతీయుడు ఎవడైనను తమ గృహాంగణము లందు ప్రత్యక్షమైనచో కంపమెత్తి కొయ్యబారిపోవువారు పోల్సుప్రజలు.

అట్టి అమానుషకృత్యములను రూపుమాపి, మాతృదేశమునకు దాస్యవిముక్తి కలిగించి చీలిపోయిన రాజ్యమును తిరిగి కూర్చి స్వతంత్రముగా చేసిన ధన్యమూర్తి మనకథానాయకుడు మార్షల్ జోసెఫ్ పిల్సుడుస్కీ. అనాటి ప్రపంచమునందు మహాబలవంతములైన జర్మన్, రష్యన్, ఆస్ట్రియన్ రాజ్యముల భల్లూకపు పిడికిలినుండి మాతృదేశమును విడదీసి ప్రత్యేకముగా రాజ్యనిర్మాణము గావించిన అసహాయశూరుడు పిల్సుడుస్కీ. దేశస్వాతంత్ర్యసంపాదనమున బద్ధకంకణులమైయున్న మనకు ఆ మహావీరునిజీవితము స్మరణీయమైనది.

ఆవీరుడు లిథూనియా రాజవంశమున 1869-వ సంవత్సరమున డిసెంబరు 5-వ తేదీని 'జులో' అను గ్రామమున జన్మించినాడు. ఆ గ్రామము 'విల్నా' అను ప్రఖ్యాతనగరమునకు సమీపమున ఉన్నది. పిల్సుడుస్కీ పెద్దకుటుంబములో జన్మించినాడు. ఐదుగురు సోదరులు, నలుగురు సోదరీమణులు.

పిల్సుడుస్కీ తండ్రి విద్యావంతుడు. వ్యవసాయశాస్త్రమును బాగుగా చదివిన వివేకవంతుడు. అతని పేరుకూడ జోసఫ్ పిల్సుడుస్కీయే. భార్యమూలమున తనకు సంక్రమిం

చిన జమీని శాస్త్రపద్ధతిని వ్యవసాయము సాగించినాడు. శాస్త్రోక్తముగా చేసినచో కుక్కమూతి పిందెలు పుట్టునన్న సామెత అతని పట్ల సార్థకమైనది. శాస్త్రోక్తమైన ఆవ్యవసాయము అతనికి నష్టమునే కూర్చినది. ధనమంతయు సెలవై పోయినది. అయినను అతడు నిరుత్సాహము పొందలేదు.

అంతదనుక బంధువులతోను, స్నేహితులతోను కిలకిలలాడుచుండిన వానిభవనము ఇప్పుడు దరిద్రదేవతకు విహారమందిరమై పాడుపడినది.

మన పిల్సుడుస్కీకి ప్రియతములలో కెల్ల ప్రియతమురాలు తల్లి. ఆమెనామము బీల్‌విక్జ మేరియా పిల్సుడుస్కీ. ఆమె విద్యావతి. విశేషించి వివేకవతి. ఇంతకును అనుకూలవతియగుభార్య. భర్త భాగ్యమును భూమిపాలు చేయుచున్నను ఆమె పెదవిమెదపి యెరుగదు. ఆమెకు ఆత్మదేశముపై అపరమితమైన ప్రేమాభిమానములు కలవు. తమజాతిని సర్వవిధముల పీడించుచున్న విదేశప్రభుత్వముపై ఆమెకు అమితద్వేషము. ప్రభుత్వము యొక్క క్రౌర్యమును కన్నులారా చూచి విచారించునది. మాతృదేశపు కడుపుచిచ్చును చల్లార్పగల పుత్రుడు తన గర్భముననే పుట్టవలెనని వాంఛించినది. ఆవాంఛయే మనకథానాయకుని కథకు బీజము. ఆమాతృదేవి పవిత్రసంకల్పబలమున పిల్సుడుస్కీ పెరిగి పెద్దయై మాతృదేశదాస్యవిమోచనము గావించినాడు.

పిల్సుడుస్కీ తల్లి వీరమాత. దేశదార్భాగ్యమునకు ఆమె ఎంతయు వగచునది. రష్యాప్రభుత్వముపై ద్వేషమును ఉగ్గుపాలతో నేర్పినదామె తన పుత్రులకు. మాతృలాలన వలన పిల్సుడుస్కీ రష్యన్ ప్రభుత్వమును పూర్తిగా ద్వేషించినాడు; అంతియేకాదు తన జాతిని ఉన్నతస్థానమునకు తీసికొని రావలెనని పట్టుపట్టినాడు.

1874 కు పిమ్మట పిల్సుడుస్కీ కుటుంబము జులో గ్రామమున జీవించుట దుర్భరమైనది. ఏమన? ఆసంవత్సరము వారియిల్లు అగ్నికిఆహుతి అయినది. వారియిల్లు ఒక్కటేకాదు; ఊరంతయు ఒక్కసారిగ కాలిపోయినది. తిరిగి గృహము నిర్మింప పిల్సుడుస్కీకుటుంబమునకు ధనము లేదు. ఆదరిద్రావస్థలో ఆకుటుంబము 'విల్నా' నగరము చేరినది.

ఆనగరమందు మన కథానాయకుడు ప్రాథమికవిద్య నభ్యసింప సోదరులతో కూటు ఒక పాఠశాలలో జేరినాడు.

ఆపాఠశాలలోని ఉపాధ్యాయులందరును రష్యన్‌జాతివారే. అదే కాదు ప్రతి పాఠశాలయు పాలకజాతి చేతులయందే యుండినది. ఉపాధ్యాయుల మతము వేరు, ఆశయములు వేరు. వారు పోలిష్ విద్యార్థులకు బోధించువిషయములు ఎంతసేపును వారికి విధేయులుగా నుండుడనియు; వారి మతమును, భాషనుస్వీకరింపుడనియును.

అసమానమైన ఆత్మజాతీయాభిమానముగల జోసఫ్‌కి యీబోధన లేమియు సరిపడలేదు. ఇంటివద్ద తల్లిదండ్రులు చిన్ననాటనుండియు నేర్పినది దేశభక్తి. పాఠశాలలో ప్రభుత్వము బోధించునది తమకు సేవకులై యుండుడని. పోల్సుజాతిని స్మరింపజేయు, ఉద్దీపింపజేయు గీతములు చదవకూడదని అచ్చట విద్యార్థులపై ప్రభుత్వము ఆంక్ష కూడ పెట్టినది. దేశభక్తి దురంధరుడైన పిల్సుడుస్కీ దానిని సహింపలేక పోయినాడు. మాతృభాషయందలి మమకారముచేతను, జాతీయగీతములు పాడుకొనవలెనను కుతూహలముచేతను అతడు ఊరికి దూరముగానున్న తోటలలోనికి పోయి మనసుతీరునట్లు ఆ గీతములను కంఠమెత్తి పాడుకొనువాడు. ఆగీతములలోని మాధుర్యమును తృప్తిగా అస్వాదించి తిరిగి యింటికి చేరువాడు. విద్యార్థిదశలో అది వాని కొకదినచర్య అయినది.

రష్యన్ పద్ధతులపైన నేర్పబడు ఆవిద్య అతనికి విషతుల్యముగా నుండెను. కాని ఎంతవిషముగా నుండినను మాతృదేవి యాజ్ఞానువర్తియై ప్రాథమికవిద్యను పూర్తి కావించినాడు. తరువాత వైద్యవిద్య నభ్యసించుటకుగాను 'ఖార్‌కాన్' విశ్వవిద్యాలయములో 1886-వ సంవత్సరమున ప్రవేసించినాడు.

కాని అది తుదముట్టలేదు. పో

లెండు దేశమునం దెల్లెడలను విప్లవ జ్వాలలు ప్రజ్వరిల్లుచుండిన కాలమది. విద్యాలయములో విద్యార్థులను విప్లవమునకు పురికొల్పుచున్నాడను నెపమున పిల్సుడుస్కీని విద్యాలయాధికారులు విద్యాలయమునుండి వెడలగొట్టిరి. విద్యాలయమునుండి వెడలగొట్టబడి పిల్సుడుస్కీ తిరిగి 'విల్నా' నగరము చేరినాడు.

ఆసమయమున రష్యాలో విప్లవము రేగి భయంకరరూపము తాల్చినది. అప్పటి రష్యాచక్రవర్తి యగు మూడవ అలెగ్జాండరు హత్యగావింపబడెను. ఆకుట్రలో పిల్సుడుస్కీకి ఏమియు జోక్యములేదు. కాని విప్లవకారులతో తిరుగుచుండువాడగుటవలనను, స్వాతంత్ర్య ప్రియుడగుటవలనను ప్రభుత్వము పిల్సుడుస్కీని కూడ అనుమానించి పట్టుకొన్నది; అయిదు సంవత్సరములు ప్రవాసశిక్ష విధించినది.

ప్రవాసశిక్ష ననుభవించు రష్యా రాజకీయఖైదీలకు సైబీరియా నిలయము; మనకు అండమానుదీవులవలె. పిల్సుడుస్కీని కూడ సైబీరియాకుపంపిరి. అతనితోకూడ బంధింపబడి, అతనితోబాటు సైబీరియాకు గొనిపోబడుచుండిన యితర ఖైదీలు దారిలో పోలీసువారిపై తిరుగబడిరి. అందుమీద పోలీసువారు ఖైదీలను కఠినముగ శిక్షించిరి. ఆ సందర్భమున పిల్సుడుస్కీకి తలపగిలినది. ఖైదీని అధికారులకు జీవముతో ఒప్పగింపక పోయినచో తన జీవము పోవునను భయము చేత అతనిని కొట్టిన పోలీసే అతని గాయములకు కట్లుకట్టి జాగ్రత్తగ చికిత్సచేసినాడు. అనంతరము పిల్సుడుస్కీని 'లెనా' జిల్లాలో ప్రవాసశిక్ష ననుభవింప మనినారు. కాని అచ్చటి వేడికి అతడు తాళలేకపోయినాడు. అతని ఆరోగ్యముకూడ చెడినది. అందుమీద ప్రభుత్వము వారు అతనిని 'టన్‌క్రా'కుమార్చిరి.

పోలెండులో అప్పటికి ఇరువది మూడేండ్లక్రితము, అనగా 1863 లో ఒక తిరుగుబాటు జరిగినది. 'బ్రానిస్లాస్వార్సి' అను పోలిష్‌నాయకుడు, దీనికి కారకుడను అనుమానము మీద రష్యాప్రభుత్వము అతనికి ఆజన్మాంతప్రవాసశిక్ష విధించినది. అతడీసమయమున టన్‌క్రాలో ప్రవాసశిక్ష ననుభవించుచుండెను. అగుట టన్‌క్రాలో పిల్సుడుస్కీకి అతనితో పరిచయముకలిగినది. మాతృభూమికి దూరమైపోయి ఆమె సేవచేయుటకు వీలులేకుండ పోయినందుకు విధిని దూరుచు కాలముగడుపుచుండు స్వార్సుకి పిల్సుడుస్కీ స్నేహము కొంతహృదయభారమును తగ్గించెను. అతనికి పిల్సుడుస్కీలో తన వాంఛను ఈడేర్చు లక్షణములు కనుపించెను.

దేశదాస్యశృంఖలమును దీక్షతో తెంపనున్న పిల్సుడుస్కీ యువకుని ఉత్సాహము స్వార్సున కెంతయు ఆనందముగొల్పెను. స్వార్సు అతనికి సాయుధమైన తిరుగుబాటువల్లకాని మరి యితర పద్ధతుల మీద స్వాతంత్ర్యము రాదని బాగుగా బోధించెను. ఆబోధయే పిల్సుడుస్కీకి తారకమంత్రమైనది. నెపోలియన్ వీరుని ఆదర్శునిగా పెట్టికొనియున్న జోసఫ్‌కి ఈసలహా అతడు దేశోద్ధారకుడగుట కెంతయో తోడ్పడినది.

రష్యారాజకీయ వేత్తలు పలువురు సైబీరియాలో ప్రవాసశిక్ష ననుభవించినవారే! అది చరిత్రాత్మకమైన విషయము. వారి అందరికి జీవితములో గుణపాఠము నేర్పిన సైబీరియాయే మన పిల్సుడుస్కీనికూడ నాయకునిగా చేసినది. అతడు, భావి కార్యక్రమమంతయు అక్కడనే నిర్ణయించుకొన్నాడు.

1892 లో పిల్సుడుస్కీ ప్రవాసశిక్షాకాలము ముగిసినది. సైబీరియానుండి 'విల్నా'కు చేరుకున్నాడు. వెంటనే రాజకీయరంగమున దూకినాడు. సోషలిస్టు పార్టీలో సభ్యుడైనాడు. పిల్సుడుస్కీ శక్తిసామర్థ్యములకు ఆమోదితులై సభ్యులందరు అతనిని ఏకగ్రీవముగా 1893 లో నాయకునిగా నెన్నుకొనిరి. తన పార్టీయొక్క సిద్ధాంతములను ప్రజలకు బోధించుటకు ఒక పత్రిక అవసరమని అతడు ఆసందర్భమున తలచినాడు. కాని అతడు పత్రిక ప్రచురించుటకు ప్రభుత్వము అనుమతి నొసంగదు. అందుచే పత్రికాప్రచురణము రహస్యముగా నిర్వర్తించవలసివచ్చి

నది. ఆస్ట్రియాపోలెండునకు పోయి అక్కడనుండి పత్రికను బహిరంగముగా ప్రచురింపవచ్చును. కాని రష్యాపోలెండులో ఉండియే పత్రిక ప్రచురింపవలయునను పట్టుదలతో ప్రచురణ మొదలుపెట్టినాడు. పత్రికాప్రచురణమంతయు బ్రహ్మరహస్యముగ నుండునది. దాని పేరు 'రెబెటోనో' (Worker) అనగా కూలివాడు అని అర్థము.

అచిరకాలముననే ఆ పత్రిక రష్యాప్రభుత్వమునకు పక్కలోని బల్లెమయ్యెను. కాగా దానిని ధ్వంసముకావింప ప్రభుత్వము విశ్వప్రయత్నములు చేసినది. కాని ఎంత ప్రయత్నించినను దానిజాడ తీయలేకపోయినది. పదునెనిమిది మాసములు నిరంతరప్రయత్నములుచేసి ప్రభుత్వము ఆపత్రికా ప్రచురణ స్థలమును కనుగొనకలిగినది.

కడుచిత్రమైన పత్రికాప్రచురణము! దాని ప్రథమకార్యస్థానము లిథ్‌నిజ్. 1894 జూన్‌మాసమున ప్రథమసంచిక వెలువడినది ఇతరులవలన ఏమాత్రము పనిగైకొన్నను ప్రభుత్వము త్వరలోనే కనుగొనునని పిల్సుడుస్కీ పత్రికలోని విషయములను తానేవ్రాసి, అక్షరములను తానేకూర్చి, తానే ముద్రించువాడు. తయారైన పత్రికలను తానే స్వయముగా పాఠకులకందచేయువాడు. ఎంతటి కార్యదీక్ష! విజిటింగ్‌కార్డులు ముద్రించుటకు మాత్రము ఉపయోగింపబడునంతటి చిన్న మిషను- అచ్చుయంత్రము. అట్టిదానితో గుట్టుగా పనిచేయువాడు. కేసులలో అక్షరములు చాలతక్కువగా ఉండునవి. అందుచేత తరుచు ఒక్కొక్క అక్షరము లోపించుచుండునది. అట్టి సందర్భములలో అతక్కువపడిన అక్షరమురాకుండ అదే అర్థము వచ్చు ఇతర అక్షరములుగల పదములను జోనిపి తంటాలుపడువాడు. ఎంతటిఓర్పుగల విద్యావంతుడో!

ఇంకను చిత్రమేమన? మిషను భాగములు దేనికవి విడతీసినచో అవి సంసారమునకు కావలసిన పనిముట్ల రూపమున ఉండునవి. పోలీసు సోదాభయము తగిలినచో ఆ అచ్చుయంత్రము అంతలో ఇంటిపనిముట్లుగా రూపాంతరమును పొందునది. ప్రతిదినము అచ్చుకూటములోని చెత్తకాగితములను కాల్చి భస్మముచేయువాడు. తన ప్రింటింగు ఆఫీసుతాళముచెవి ఎవరికి తెలియకుండ నుండుటకుగాను ఒకానొక విగ్రహము కడుపులో దాచువాడు. ఆవిగ్రహము అతడు సైబీరియానుండి తెచ్చుకొన్నది. పంద్రెండు పేజీలపత్రికను నెలకు రెండు సంచికలచొప్పున ప్రచురించువాడు. దినమునకు 11 గంటలవంతున పనిచేయువాడు. ఇన్నితిప్పలుపడి పత్రికను బయటపడవేయువాడు. ప్రపంచమునందలి వార్తాపత్రికలచరిత్రలో ఇట్టిది అప్పటికి, ఇప్పటికి అశ్రుతపూర్వము.

మరుచటి వత్సరము పత్రికా కార్యాలయమును 'విల్నా'కు మార్చినాడు. అక్కడ వానికి క్రొత్త సహాయము దొరికినది.

ఆరోజులలోనే వివాహము చేసికొన్నాడు. భార్య అన్నివిధముల అతనికి తగినది. ఆమె అతని కష్టములకు ఆదుకొన్నది. పత్రిక ప్రచురణమునకు అంతులేని సాయము చేసినది.

పత్రికపై ప్రభుత్వపు నిఘా అంతకంతకు తీవరించినది. ఇక అక్కడ ఉండిన లాభముండదని 1896లో కార్యస్థానమును లోడ్జా పట్టణమునకుమార్చినాడు. ప్రభుత్వదృష్టిగాని ప్రజాదృష్టిగాని సోకని కార్యాలయము కావలయును! అందుకుగాను జనము సమ్మర్దముగా నుండుట కవకాశములేని సామానునిలువచేయు కొట్లపై మేడమీాద బసపెట్టినాడు. అచ్చుయంత్రముయొక్క శబ్దముకూడ బయటకు వినిపించకుండ ముద్రించువాడు.

ఆ కాలమున అతనికి చార్లెస్ రొజ్నోవిర్ అను వానితో మిత్రత్వమేర్పడెను ఆమిత్రుడు హాస్యప్రియుడు. వాని ఛలోక్తులచే అతని కార్యాలయములోని నిశ్శబ్దమునకు భంగపాటు కలిగినది. 1900 సంవత్సరములో ప్రభుత్వము ఆపత్రిక జాడపట్టుకొన్నది. ప్రభుత్వము తీక్ష్ణదృష్టికి గురియైనపత్రిక ఎంత కాలము రహస్యరక్షణము కావించుకొనగలదు.

సంపాదకుని, అతనిభార్యను, అతనిమిత్రుని అరెస్టుచేసినారు. పిల్సుడుస్కీని, అతనిభార్యనుకారాగారము

నందుంచిరి. సంపాదకునిపై నుండు క్రోధము అంతమాత్రమున తీరక అతనిని పార్కాలోని ప్రత్యేకభాగ్యహములో బంధించిరి. ఆభాగర్భస్థమైన జైలులోపడినవాడు బ్రతుకడని వదంతి.అందుచే పిల్సుడుస్కీ బ్రతికియున్నాడో చనిపోయినాడో ప్రజలకు తెలియరాలేదు. కొందరు ప్రజలు పిల్సుడుస్కీ మరణించియే యుండునని తలచిరి. సోషలిస్టుపార్టీ వారు అతనిని విడిపించుట అసంభవమని నిరాశ చేసికొనిరి.

దీనులకు దేవుడే దిక్కు. పిల్సుడుస్కీ నిర్బంధముననున్న జైలు వార్డరు దైవభీతికలవాడు. వానికి తోటిమానవులన్న ప్రేమమెండు. విశేషించి అతడు టాల్‌స్టాయి శిష్యుడు. వాని సహాయమున సోషలిస్టు నాయకులు కొందరు పిల్సుడుస్కీతో ఉత్తరప్రత్యుత్తరములు జరిపినారు. వార్డరు ఉత్తరములను అగ్గిపెట్టెలో పెట్టి పిల్సుడుస్కీకి అందజేయువాడు. జవాబులుకూడ అట్లేవచ్చునవి.

ఇట్లు ఉత్తరప్రత్యుత్తరములు సాగుచువచ్చిన కొంతకాలమునకు పిల్సుడుస్కీ పిచ్చివానివలే నటించుట మొదలుపెట్టినాడు. తిండి తినువాడుకాడు.

అందులో విషమున్నదని గోల చేయువాడు. ప్రభుత్వము అది నిజమైన పిచ్చియే అనుకొన్నది. పాపము! నిజముగా అతనికి దేశస్వాతంత్ర్యపు పిచ్చితప్ప వేరుపిచ్చి లేదు. పళ్లెములతో మంచి పలహారములను పెట్టుచుండువారు. కాని ఆపళ్లెములను కూడ బ్రద్దలుకొట్టువాడు. అయినను ప్రభుత్వము అతనిని కరుణించునట్లు కనుపించలేదు. ఆదినమున కాదినము అతనికి నీరస మధికమైనది, పార్టీ సభ్యులు కలవరపడసాగిరి. ఇక ఆలస్యమైనచో పిల్సుడుస్కీకి ప్రాణాపాయమే కలుగవచ్చునని అధికారములోనున్న ఒక పోలిష్ డాక్టరు కలుగచేసుకొని అతనిని పెట్రోగ్రాడ్‌లోని సెయింట్ నికోలస్ పిచ్చిహాస్పిటల్‌నకు పంపునట్లు ఏర్పాటు గావించెను.

హాస్పిటల్ బందోబస్తుగా నుండెను. గోడలు ఎత్తైనవి. తప్పించుకొనుట అసాధ్యమైనపని. పిల్సుడుస్కీని హాస్పిటల్‌నుండి తప్పించు భారము పార్టీ జూనియర్ మెంబరులలో నొకడైన 'మాజిర్‌కీలిగ్' అను డాక్టరుపైన బడినది. అందులకు అతడు ప్రత్యేకముగా పిచ్చివారిని గూర్చి కృషిసల్పవలెనను నెపములో మెంటల్‌హాస్పిటల్‌లో చేరినాడు. కాల మనుకూలమైనది. అతనిని హౌస్‌డాక్టరుగా నియమించినారు. పెద్దడాక్టరు లేని సమయమున తనకర్తవ్యము నెరవేర్చుకొనుటకుగాను ఈడాక్టరు పిల్సుడుస్కీకి వలయు దుస్తులను లోపల జేర్చి భద్రపరచి యుంచినాడు.

ఒకరోజున నగరములో ఉత్సవములు జరుగుచుండెను. పెద్ద డాక్టరు ఆస్పత్రిలోలేడు. పిచ్చికుదురు ముఖమునకు వచ్చి ఇక కొద్దిరోజులలో ఆసుపత్రినుండి విడుదలపొందనున్న రోగులు పలువురు ఆ ఉత్సవములు చూచివచ్చుటకు అనుజ్ఞ కోరినారు. మాజిర్ కీలిగ్జు వారికందరకు అనుమతియిచ్చినాడు. మిగిలిన రోగులనందరను చూచుటకు తన వద్దకు రప్పించికొన్నాడు. పిల్సుడుస్కీ రాగానే అతనిని చాలసేపు వైద్యపరీక్ష కావింపవలసియున్నదను నెపమున తన అసిస్టెంటును అవతలకు పంపివైచినాడు. అసిస్టెంటు అవతలకు పోగానే పిల్సుడుస్కీకి ఆ డాక్టరు ఇదివరకు తానుదాచియుంచిన దుస్తులను యిచ్చినాడు. కొత్త దుస్తులు ధరించుటతో పిల్సుడుస్కీకి పిచ్చిపోయింది. ఆదుస్తులలో అతనిని ఆనవాలుపట్టుట కష్టమే! డాక్టరు, అతడు కలసి ఆసుపత్రిగేటు వద్దకు పోయినాడు. చిన్నడాక్టరును ద్వారపాలకుడు ఎరుగునుగనుక వారిని నిరభ్యంతరముగ బయటకు పోనిచ్చెను.

అట్లు వారిద్దరు బయటపడిరి. పిల్సుడుస్కీ ఒక స్నేహితునిఇంటి వద్ద ఆదినమునకు ఆగి మరుచటిదినమున రష్యాకస్టమ్సుఆఫీసరు దుస్తులు ధరించి రష్యన్‌పోలెండు సరిహద్దుదాటి ఆస్ట్రియాపోలెండులోనిదగు 'క్రాకో' పట్టణము చేరెను. అప్పటికి అతనిభార్యకూడ విడుదల పొందియుండెను. తనభర్త క్రాకో చేరెనసంగతి తెలిసికొని ఆమెవచ్చి అతనిని కలసికొనెను. అక్కడ ఆ భార్యాభర్తలు కొంతకాలము విశ్రాంతి తీసుకొనిరి. అక్కడ అత

డు తిరిగి పత్రికకు సంపాదకుడైనాడు.

తరువాత లండను, మెక్కో-మొదలగు ప్రదేశములు తిరిగి పోలెండు స్వాతంత్ర్యసంపాదనోద్యమమును గూర్చి ప్రచారముచేసినాడు. విదేశములనుండి తిరిగి రాగానే అతనికి పోలిష్‌ప్రజలు అఖండస్వాగత మిచ్చిరి.

1904 లో జపాను రష్యాలకు యుద్ధము పొసగినది. యుద్ధానంతరము పోల్సుకి ఏదోమహత్తరలాభము చేయుదునని ప్రకటనలు కావించినది రష్యా. రష్యా పోల్సుని సైన్యములోజేరి జపానుపై పోట్లాడమని కోరినది.

పిల్సుడుస్కీ-కి ఇది నచ్చలేదు. తమకెట్టి సంబంధములేని విషయములో పోల్సువారు తమరక్తమును వెచ్చింపరని వాదించినాడు. అతరుణమునందు రష్యాపై తిరుగుబాటు కావించినచో పోల్సుకు లాభముండునని తలచినాడు. తమకు ఆయుధములు సరఫరాచేయవలసినదిగా జపానుప్రభుత్వమును కోరినాడు. కాని పిల్సుడుస్కీ-కి వ్యతిరేకభావములుగల డిమూస్కిక్ అను మరియొక పోలిష్ నాయకుని మంతనమువల్ల జపాను అతనికోరిక నిరాకరించినది.

డిమూస్కిక్ పోలిష్ నేషనల్ పార్టీనాయకుడు. అతడు రక్తపాతమునగాక శాంతిమార్గముననే స్వాతంత్ర్యము సంపాదింపవలె ననువాడు. కావున రక్తపాతమున కియ్యకొనక పిల్సుడుస్కీ-కి అడ్డు తగిలినాడు.

కాలము మారినది. ప్రజలలో పిల్సుడుస్కీ-భావములు ప్రబలినవి. గొరిల్లా యుద్ధముచేయుటను నేర్పుటకు గిలిషియా అను సరిహద్దు పట్టణమున పాఠశాలను నిర్మించినాడు. యుద్ధముచేయుట బాగుగా నేర్చుకొన్న యువకులతో 1905-6 లో రష్యాపోలెండు జేరినాడు. వీరు పోలీసువారిని ఎక్కడపట్టిన అక్కడ ప్రతిఘటించువారు. ఈతరుణముననే రష్యాలోకూడ కార్మికుల విప్లవ మొకటి బయలుదేరినది. దీనికి ఎంతయు సంతసించి పిల్సుడుస్కీ- తన ఉద్యమమును మరింత తీవ్రముగా సాగించెను. ప్రభుత్వమునకు అపారనష్టము కలిగినది. ప్రజలు పిల్సుడుస్కీ-ని ఒక వీరునిగా పూజింప దొడగిరి. చేయునది లేక ప్రభుత్వము పోలెండులో ప్రజాప్రతినిధిపాలన స్థాపించినది. అందుతో దేశములో కొంత అలజడి తగ్గినది. స్వలాభపరాయణులు మంత్రిపదవులు స్వీకరించినారు.

కాని స్వాతంత్ర్యపిపాసియగు పిల్సుడుస్కీ-కి ఇంతమాత్రమున తృప్తి కలుగలేదు. పూర్ణస్వాతంత్ర్యము వచ్చువరకు నిదురింపరాదని, ఆందోళన సడలింపరాదని నిశ్చయించినాడు. జాతియొక్క భావిని నిర్ణయించునది కత్తిగాని కలము కాదని నమ్మినాడు. తనకు రష్యాపోలెండులో స్వేచ్ఛలేదని హోమ్ రూల్ అనుభవించుచున్న ఆస్ట్రియాపోలెండు చేరినాడు. అక్కడ 1908 లో 'రైఫిల్‌యన్' సంఘము నొకదానిని స్థాపించినాడు. నేటి పోలెండు సైన్యమున కదియే పునాది.

ఇంతలో 1914 సంవత్సరము ఆగష్టు మాసమున మహాసంగ్రామము ప్రారంభమైనది. పోలిష్ సుప్రీమ్‌నేషనల్ కమిటీవారి అనుమతిమీద పిల్సుడుస్కీ- చిన్నసేనను సమకూర్చుకొన్నాడు. వారికి తగిన ఆయుధములు లేకపోయినను రష్యాపై ధైర్యముగా దాడివెడలినాడు. కెలిసీ పట్టణమును పట్టుకొన్నాడు. దానిని తన సైనికశిబిరముగా నిర్మించుకొని ముందునకు సాగినాడు.

పిల్సుడుస్కీ- ఇతరప్రభుత్వముల జోక్యములేకుండ తాను పోలెండుకై యుద్ధముచేయవలె ననుకొనినాడు. కాని అతని విజయమునకు వెరచి ఆస్ట్రియాప్రభుత్వము అతనిని ఆస్ట్రియా సర్వసైన్యాధిపతికి లోబడి పనిచేయవలయునని కోరినది. ఆసైన్యాధిపతి అతనికి మిలటరీ ట్రయినింగు లేదను నెపమున అతని సైన్యమును ఆస్ట్రియా సైన్యముతో కలిపి అతనిని విరమింపమని ఆజ్ఞాపించెను.

చీమునెత్తురులు వెచ్చించి నిర్మించి ప్రాణతుల్యముగా చూచుకొను తన చిన్న సేనను వదలుటకు పిల్సుడుస్కీ-కి ప్రాణసంకటముగా నుండెను. ఆవిషయమును అతడు పోలిష్ నేషనల్ కౌన్‌సిల్‌వారికి

తెలుపగా వారు ఆస్ట్రియా ప్రభుత్వముతో సంప్రదించి పిల్సుడుస్కీని అక్కడనే యుండునట్లు చేసిరి.

ఇంతలో ఆస్ట్రియా జర్మన్ సైన్యములు రష్యన్ పోలెండును పూర్తిగా ఆక్రమించుకొన్నవి.

జర్మన్ ప్రభుత్వపు రక్షణక్రింద పోలెండును ప్రత్యేకరాజ్యముగా స్థాపించుకొనుటకు అనుమతినొసంగిరి. ప్రత్యేకరాజ్యము ఏర్పడినది. 1917 లో కౌన్‌సిల్ సమావేశమైనది. కాని అధికారమంతయు జర్మన్ గవర్నర్ చేతులలోనే యున్నది. పోలెండు స్వయముగా సైన్యమును నిర్మింపకూడదని ఒకఆంక్ష చేయబడెను. కాని ఆస్ట్రియా ప్రభుత్వము ఉదారభావముతో పోలెండు స్వయముగ సైన్యమును నిర్మించుకొన వచ్చుననియు, దానిని జర్మనీ అధికారముక్రిందనే ఉంచవలెననియు కోరినది. జర్మనీ ప్రతిరోధించినను పోలెండు సైన్యమును చేకూర్చినది. పిల్సుడుస్కీని యుద్ధమంత్రిగా నియమించినది. అయినను పోలెండు జర్మనీకి శాశ్వత దాస్యముచేయవలసి వచ్చునట్లు కనుపించెను.

పిల్సుడుస్కీ ఇది కనిపెట్టినాడు. గర్భశత్రువైన జర్మనీతో పొందు కుదురలేదు. కౌన్‌సిల్ సమావేశ సమయమున తీసికొనవలసిన ప్రమాణములో పిల్సుడుస్కీకిని జర్మన్ గవర్నరుకు భేదాభిప్రాయములు వచ్చినవి. పోలిష్ సైనికులు పోలెండుకు విధేయులా? జర్మనీకి విధేయులా? గవర్నరు వారు జర్మనీకి విధేయులుగానుండవలెనని శాసించినాడు. పిల్సుడుస్కీతో సహా సైన్యమంతయు జర్మన్ విధేయతకు ప్రమాణము గైకొన నిరాకరించినది. తనసైన్యము జర్మనీతో కలసి రష్యాతో ఎన్నటికిని యుద్ధము చేయదని పిల్సుడుస్కీ తెలిపెను. దానికి కోపించి జర్మన్ ప్రభుత్వము అతనికి కారాగారశిక్ష విధించి మేగ్డిబర్గు దుర్గములో బంధించెను. రష్యన్ ప్రభుత్వముకన్న జర్మన్ ప్రభుత్వము రాజకీయ ఖైదీలను గౌరవముగాచూచును. అందుచే అతడు ఇష్టమువచ్చినంతసేపు జైలులోని ఉద్యానవనములో తిరుగువాడు. కొంతకాలమునకు పిమ్మట అతని ప్రియమిత్రుడైన 'సాస్నొవిస్కీ'ని కూడ అందులోననే బంధించిరి. ఆరాజకీయశిక్షితులు ఇద్దరు తీరిక సమయములందు కులాసాగా చదరంగమాడుకొనుచుండువారు.

ఇంతలో జర్మనీలో విప్లవము వచ్చినది. మహాసంగ్రామములో జర్మనీ ఓడిపోయినది. వెర్‌సైలీసు సంధిసమయమున జాతిసమితి పోలెండుకు స్వాతంత్ర్యము ప్రసాదించినది. 1918 లో 'లుబ్లిన్' నగరమున పోలిష్ స్వతంత్రరాజ్యమున రీజెన్సీకౌన్‌సిల్ సమావేశమైనది. పిల్సుడుస్కీ విడుదల గాంచెను.

వెంటనే లుబ్లిన్ నగరమునకు వచ్చినాడు. ప్రజలు అమితోత్సాహముతో అతనికి స్వాగతమిచ్చిరి. రాజ్యాధికారమునంతను అతనిపై పెట్టిరి. ఆస్వాతంత్ర్యోపాసకుని కలలు నాటికి నిజములైనవి. అధికారము దొరకినది కదాయని జాతికి ద్రోహముచేయలేదు. అతడు నియంతృత్వము వహింపలేదు. ప్రజలకు రాజ్యతంత్రమును బోధించి, వారిచేతనే రాజ్యాంగచక్రమును నడిపింపవలెనని తలచినాడు. ఆత్మదేశముయొక్క సుస్థితికి అనుకూలముగా నుండునట్లు నూతనచట్టనిర్మాణమును గావించెను.

ప్రజలు తమప్రతినిధులను ఎన్నుకొనిరి. ప్రజాస్వామికప్రభుత్వముయొక్క ప్రథమ Seym అనగా శాసనసభ 1919 ఫిబ్రవరి 10-వ తేదీన సమావేశమైనది. పిల్సుడుస్కీని పోలెండు రాజ్యమునకు సర్వాధికారిగాను (Chief of the state), సుప్రీమ్‌వార్ కౌన్‌సెల్‌కు అధ్యక్షుడుగాను ఎన్నుకొనిరి.

విటోసు అనునతడు పిల్సుడుస్కీకి సహకారిగా నుండెదనని 1923 సంవత్సరపు ఎన్నికలలో వాగ్దానముచేసి ప్రధానమంత్రి అయినాడు. విటోసు పార్టీ ప్రాబల్యము అధికమైనది. విటోసు దేశమును మరల పూర్వస్థితికి తెచ్చునేమో అని పిల్సుడిస్కీ భీతిచెందినాడు. కాని తాను సైన్యమునకు సర్వాధికారిగా నున్నంతకాలము ఎట్టి ప్రమాదములు సంభవింపకుండ చూచుటకు కంకణము కట్టుకొన్నాడు.

విటోసు అధికారము వహిం

చిన వెనుక పిల్సుడుస్కీకి వ్యతిరిక్తముగా ప్రవర్తించినాడు. ప్రజాప్రతినిధి పాలనము పాడుచేయుట కియ్యకొననందునను ప్రజల ప్రతినిధులే రాజ్యభారమును వహించుటచేతను తాను ప్రజలకు ఉన్న పరిస్థితులను తెలిపి విటోసు వర్తనమునకు విసుపుచెంది రాజీనామా నిచ్చినాడు.

అతడు విశ్రాంతికొరకు సులిజువికర్ పోయెను- అక్కడ పిల్సుడుస్కీ కథలు వ్రాసుకొని జీవింపసాగెను. కాని దేశమును క్లిష్టపరిస్థితుల నుండి ఉద్ధరించుటకు సర్వకాలములందు సంసిద్ధుడే. విటోసు కేబినెట్టు వాని త్యాగమునకు, దేశసేవకు, మెచ్చుకొని నెలకు 600 పౌనులు ఉపకారవేతన మిచ్చుటకు ఒక తీరుమానమును ప్రతిపాదించెడు.

దేశములో ఆర్థికదుస్థితి అలముకొన్నది. 1926 ఎన్నికలలో కూడ విటోసు తిరిగి ప్రధాని అయినాడు, పిల్సుడుస్కీకి సైనికులు చూపు ఆదరాభిమానములకు అసూయపడినాడు. పిల్సుడుస్కీకి సైన్యమునకల పలుకుబడిని భగ్నముచేయ యత్నించినాడు. పిల్సుడుస్కీకి ప్రబల విరోధియగు 'మోల్ జ్వాస్కీ'ని యుద్ధమంత్రిగా నియమించినాడు. అందుచే సైన్యాధిపతులలో అసంతృప్తి ప్రబలినది. పూర్వపు యుద్ధమంత్రియగు పిల్సుడుస్కీని నమ్మిన బంటులగు సేనాపతులను విటోసు తొలగింప ప్రయత్నించెను. అందుతో పిల్సుడుస్కీ కినుకజెందినాడు. మంత్రుల ప్రవర్తన అన్యాయమయినదని నిర్భయముగా వార్తాపత్రికలలో విమర్శించినాడు, ఆవిమర్శన ప్రకటించిన పత్రికప్రతులను ప్రభుత్వము నిర్మూలించినది. ప్రభుత్వపక్షపు మరియొకపత్రిక పిల్సుడుస్కీయొక్క చర్యకు అతనిని ప్రాసిక్యూట్ చేయవలెనని కోరుచు వ్యాసమును ప్రచురించెను.

ఏమహావీరుని దీక్షచేత, వీరవిహారముచేత, పోలెండుప్రజలు స్వాతంత్ర్యమును సంపాదించి ఆ మహానందమును పొందుచుండిరో ఆమహాత్ముని బంధింపుడను ప్రకటన పత్రికలో చూచినవెంటనే ప్రజలు తొక్కత్రొక్కిన త్రాచులవలె లేచిరి. విటోసును రాజీనామాయిమ్మని కోరిరి. పిల్సుడుస్కీని అధికారము స్వీకరింపుమని ప్రార్థించిరి. ఎక్కడచూచినను పిల్సుడుస్కీపై విశ్వాసమును, విధేయతను చూపు ప్రకటనపత్రములు గోడలయందు నిండెను, రెంచెర్టోలోని సైనికదళములు వచ్చి అతని యింటిముందు నిలిచి అతని ఆజ్ఞలకై వేచియుండెను.

ప్రజల కోరికపైన పిల్సుడుస్కీ తన అండచేరిన సైన్యముతో విటోసు అధికారమును ధ్వంసముచేసి శాంతి నెలకొల్పెను.

ఆరాజఋషి ప్రజల బాగును, దేశము అభివృద్ధిని, జాతి ఔన్నత్యమునే వాంఛించెనుగాని తనకు అధికారము కావలెనని కోరలేదు. అందుచే ఎన్నికలవరకు రాజ్యభారమును వహించినాడు. సైన్యములో కలిగిన అలజడిని అణచినాడు. ఎన్నికల అనంతరమున అతనిని ప్రెసిడెంటుగా నెన్నుకొనిరి. అధికారములేని ఆపదవిని నిరాకరించినాడు, హెడ్ ఆఫ్ది జనరల్ స్టాఫ్గాను, యుద్ధపు సంఘమునకు (వార్ కౌన్సిలుకు) ప్రసిడెంటుగాను జీవి

తాంతమువరకు పనిచేసినాడు.

రష్యాలో బోల్షివిజము జయముగాంచినది. తోడనే ఇతర దేశములందుకూడ దానిని వ్యాపింపజేయవలెనని రష్యాసైన్యము విదేశయాత్ర సాగించినది. రష్యాకు సరిహద్దుదేశమైన పోలెండు ఆ సైన్యమునకు ప్రథమరంగమైనది. నిన్నగాక మొన్న ఏర్పడిన పోలెండు రాజ్యము రష్యాకు ఎదురొడ్డ గలదా? పిల్సుడుస్కీ తన యుద్ధవైశారద్యముచేత రష్యాదౌర్జన్యమును ప్రతిఘటించినాడు: ఇతర రాజ్యములనుండి ఎట్టి సహాయము రాకపోయినను, పట్టుదలతో శత్రువులను ఎదిరించి వారిని తనరాజ్యపు పొలిమేరనుండి పారదోలినాడు. రాజధానినగరమగు వార్సావరకు వచ్చిన రష్యాసైన్యమును ఎదిరించినాడు. అతడు స్వయముగా రణరంగమున వీరవిహారము గావించినాడు. భటులను ఉద్బోధించినాడు. జయమును పొందినాడు.

ఆవిజయమే అప్పటి యూరప్‌లో శాంతి నెలకొల్పినది; బోల్షివిజము విజృంభణమును అరికట్టినది. రష్యా పిడికిటిలో చిక్కిన యూక్రేనియా రాజ్యమును విడిపించి శరణుజొచ్చిన యుక్రేనియా నాయకుడగు పెల్టుర అనువానికి ఒప్పగించెను. యుక్రేనియా రాజ్యము సుస్థిరముగా నుండువరకు తన సైన్యమును కొంత అందు నిలపెను. ఆశూరుని సహాయమునకు యుక్రేనియా ప్రజలు పరమానందమును పొందిరి. తనరాజ్యమునకు స్వాతంత్ర్యము సంపాదించినిలబెట్టుటయే గాక తన పొరుగు రాజ్యమునకుకూడ ఆమహామహుడు స్వాతంత్ర్యము సంపాదించి ఇచ్చినాడు.

అధికారగర్వము వానిని అవహించలేదు. తనజాతికి తాను రక్షకుడుగానుండవలెననియే గాని నియంతయై యితరదేశములను కూడ భక్షింపవలెనని అతనికి ఎప్పుడును లేదు.

పిల్సుడుస్కీ దీర్ఘనేత్రములు, విశాలఫాలభాగము అతని ఉదార భావమును చాటుచుండెను. అతని కోరమీసములు పౌరషమును ప్రకటించుచుండెను. ఎత్తైనవాడు కాకపోయినను పొట్టివాడు కాదు.

పిల్సుడుస్కీ ఆధ్యాత్మికచింతకలవాడు. నిరాడంబరజీవి. చిన్నతనములో దరిద్రమనుభవించినాడు. పెద్దతనమున ధనము దొరికినది కదాయని భోగము లాశింపలేదు. ధనమన్న అతడు భయపడువాడు. రక్తపు కాలువలో జంకులేక దుముకునుగాని ధనముచెంత చేరడు. అతడు మంత్రిగానున్న కాలమందు గణించినధనము నంతయు 'విల్నా' విశ్వవిద్యాలయమునకు ధారపోసెను. ఆత్మదేశముయొక్క ఔన్నత్యమే వాని మొదటికోరిక. ఇతరకోరికలు చాలతక్కువ. ఉన్నను వానిని దేశమునకై త్యజించువాడు. స్వయముగ చేసికొనగల ఏపనినిగాని అతడు పరిచారకులచే చేయించుకొని ఎరుగడు. ఒకరాజ్యమునకు అధిపతి అయిన అతనికి ఉండిన సేవకులు చాల తక్కువ.

ఇతర నియంతలవలె అతడు పోలీసురక్షణ కోరువాడుకాదు. ప్రజాసమూహములో ఎట్టి భయసంకోచములులేక కలసి తిరుగువాడు. వారితో చనవుగాను, చతుత్కారముగాను సంభాషించు

వాడు. కాని మహావక్తకాడు. స్నేహితులు హేళనచేసినను కోపించుకొనువాడు కాడు. తనను ఉద్దేశించి పత్రికాధిపతులు ఎట్టి కార్టూనులు(వ్యంగ్యచిత్రములు) ప్రకటించినను నవ్వువాడేకాని చికాకు పడువాడుకాదు.

యుద్ధమంత్రిగా నున్నంతకాలము సైయామ్ (పోలిష్‌పార్లమెంటు) సమావేశములకు వెళ్లువాడు కాదు. ఆయుద్ధమంత్రి కార్యములు అతని పరోక్షమునందే సైయామ్ ఆమోదమును పొందునవి.

ఆత్మదేశసుఖమునకు ఇంత చేసిన ఆదేశోద్ధారకునకు కుటుంబసుఖము చాలతక్కువ. అతనితో కష్టములపడి పడి భార్య యౌవనమునందే పరమపదించినది. పిల్సుడస్కీ, తిరిగి వివాహము చేసికొన్నాడు ఆమెతో కొంత సుఖమను భవించినాడు. ఆమెవలన ఇద్దరు పుత్రికలను పొందినాడు, ఇది అతని కుటుంబగాథ.

అతనికి సంగీతమనిన తలనొప్పి. జాతీయగీతములన్న అమితప్రేమ. పిల్లలు పెట్టు రేడియో సంగీతము విని విసుగుచెందువాడు. సైనికులు అతనిని చండశాసనుడని పేర్కొనువారు. అట్లు పిలిచినను వానిశాసనము సుగ్రీవాజ్ఞగా చేయువారు; పితృదేవునిగా పూజించువారు. అతడు శత్రువులకు సింహస్వప్నమే. పిల్సుడుస్కీ మొక్కవోని యుద్ధ విశారదుడు. ఏయుద్ధమునందైనను అతడు స్వయముగానే ఎత్తులు వేయువాడు. కాని యితరులు చెప్పు పద్ధతులన్నియు వినువాడు. చతురంగపు ఆటయన్న చెవికోసుకొనువాడు. గుఱ్ఱపుస్వారియన్న కులాసా.

తాను అధికారమువహింపగానే దేశముయొక్క దుస్థితిని చూచి రక్షించుటకు తగిన సైన్యముండవలెనని బ్రహ్మాండమగు సైన్యమును సమకూర్చినాడు. జీవితాంతమువరకు తానే దానికి సర్వాధికారిగా నున్నాడు.

1932 లో 500800 ఎకరముల భూమిని జమీందారుల వద్దనుండి లాగుకొని కష్టపడి పనిచేయు కర్షకుల వశముచేసినాడు.

అతనికి మతపు పిచ్చిఎక్కువ అని చెప్పలేము. అన్నిమతములను సమానముగా గౌరవించు విశాల హృదయుడు. అతడు యూదుల నుహింసించుట క్రూరమని వారిని స్వజాతీయసోదరులతో సమానముగానే గౌరవించువాడు. కాని పోలెండులో అధికారము ఇతరజాతిహస్తములందుండుట కెంత మాత్రము అతడు యిష్టపడువాడు కాడు. పోల్సుజాతియే పోలెండును పరిపాలింపవలెననివానినిశ్చయము. ఇతరులకు అధికారములో తావుండకూడదు. ఇది అతని మతము.

శిరమున కిరీటములేదుకాని అతడు పోల్సురాజ్యమునకు చక్రవర్తి. చేత రాజదండములేదు కాని అతడు పోల్సురాజ్యమునకు సర్వాధికారి. 1935 మే 12-వ తేదీ ఆదివారమునాడు అతడు స్వర్గమలంకరించినాడు. ఆ ఆధునికపోలెండు దేశనిర్మాత మరణమునకు పోల్సు ఆబాలగోపాలము అంతులేని విచారమున మునిగినారు.

చనిపోవుసమయమున జెనరల్ రైడజ-స్మిగ్‌లీని పిలచి దేశములో పార్టీలు ప్రబలి దేశమును పాడుచేయును. నీవు పొగడ్తకులో బడక ఒకరిమీద ఆధారపడక పార్టీకి అతీతుడవై దేశగౌరవమును కాపాడు మని మూర్ధాభిషేకము చేసినాడు. అప్పటినుంచి స్మిగ్‌లీ సైన్యసర్వాధికారమును వహించెను.

ఎవరి ప్రబోధమున తాను ఇంత ఖ్యాతిగాంచినాడో అట్టి తన మాతృదేవి సమాధివద్దనే తనదేహమునుకూడ పాతునట్లు అతడు కోరెను. కాని పోల్సుప్రజలు తమ నాయకునందుండు గౌరవముచే అతని తుదికోరికను నెరవేర్పలేకపోయిరి. అతనియందుండు తమ రాజభక్తికి సూచకముగ అతని దేహమును పూర్వము పోలిష్ చక్రవర్తులను, పోలిష్ రాజులను పాతిపెట్టుచుండెడి రాజస్మశానమునందే పాతిపెట్టుటకు వారు నిశ్చయించిరి. శవమును 'వార్సా' నుండి 'క్రాకౌ' నగరమునకు రైలుమీద తీసుకొనిపోయిరి. అచ్చట పూర్వపురాజులను పాతిపెట్టు వావెల్‌కోటలో అతనిని పాతిపెట్టిరి. క్రాకౌనకుపోవు మార్గ

మధ్యమునందు స్టేషనులలో తండ్రి చచ్చిన పిల్లలచందమున విలపించుచు వేనవేలు ప్రజలువచ్చి ఆశవమును దర్శించిపోవువారు. ఆదేశభక్తుని పవిత్రభౌతికదేహము ఇక కనుపించదు కదాయని పుంజువంటి చలికైనను లెక్కచేయక అర్ధరాత్రియందు కూడ వచ్చి కడసారి దర్శనముచేసికొని బరువైన హృదయములతో మరలిపోవువారు, ప్రజలు.

తమకు ఇంతచేసిన తమ నాయకుని తుదికోరికను ఒకవిధముగానైన నెఱవేర్చుటకై పోలిష్ ప్రజలు అతని తల్లిసమాధినుండి కొంతమన్ను తెచ్చి అతనినిపూడ్చిన మట్టిలో కలిపిరి!

పిల్సుడుస్కి నిరంతరకృషివలననే పోలెండురాజ్యము పునరుద్ధరింపబడినది. ఆచంద్రార్కముగా అతని కీర్తి దిగంతవిశ్రాంతమై వెలుగుచుండును. పోలెండు చరిత్రలో వానిజీవితము సువర్ణాక్షరములతో లిఖింపబడినది.

జీవితసౌఖ్యమును తృణప్రాయముగా- మాతృదేశసౌభాగ్యమును ప్రాణాధికముగా- చూచి పోల్సుభాషను మాట్లాడు ప్రజలను అందరిని రష్యా, జర్మన్, ఆస్ట్రియా దేశముల యినుపపిడికిలి నుండి వేరుచేసి ఒకజెండాక్రిందికి తీసుకొనివచ్చిన ఆజాతీయనిర్మాత నేటి ప్రపంచవీరులలో ప్రథమగణ్యుడు కాదగిన వాడు!—!

పేరంటములో రవికలగుడ్డలు

[దిగువను ప్రచురితమగుచున్న బాపట్ల స్త్రీహితైషిణీమండలి వారి కరపత్రములో నొక నూత్నసంస్కారము అవబోధింపబడు చున్నది. ఈ సంస్కారమునుగూర్చి ఆంధ్రభూమి పాఠకులు తమ అభిప్రాయములను జూన్ ౨౦-వ తేదీలోపుగ తెలియజేసిన జూలై సంచికలో ప్రచురింతుము. అభిప్రాయములు కూడినంత క్లుప్తముగ నుండవలయును.

—సంపాదకుడు.]

జనుల ఆచరణలోనున్న పద్ధతికి ఆచారమనిపేరు. ఈ ఆచారములు లోకాచారము, దేశాచారము, వంశాచారము ఆదిగాగల పేరులతో వివిధములుగా నున్నవి. మనుజులు వేదాదిధర్మశాస్త్రములనైనను నుల్లంఘించగలరుగాని ఆచారముల నుల్లంఘించలేరు. ఆచారములు జనులకు త్రెంపరాని శృంఖలలు. మానవసహజమైన పరిశీలనాదృష్టి నరికట్టి వ్యక్తిత్వమును చంపి కేవలము మనుజుని తనకు బానిసగా జేసికొను శక్తి ఆచారమునకు గలదు.

జనవాడుకమీద యెట్టి సదాచారములను శిథిలమై మాఢ్యవర్తనగా పరిణమించుచుండును. కాని జనులకీవిషయము తెలియదు. కనుకనే అనేకదురాచారములు సంఘములో ప్రబలియున్నను ప్రబలుచున్నను గమనింపకుందురు.

ఏజాతియైనను ఆచారదాస్యమునకు లోనుగాక కాలానుగుణ్యమగు మార్పులను నంగీకరింపగలిగినప్పుడే అభివృద్ధి నందగలుగును. ఈదేశమున చిన్నవియు పెద్దవియునగు ననేకాచారములు స్త్రీలను నిబద్ధించుచున్నవి. అమాయకలగు స్త్రీజనము వీనివలన పెక్కుకష్టములను భవించుచున్నను వీని నతిక్రమింపజాలకున్నారు. నీతికిని ధర్మమునకును విరుద్ధము కానంతవఱకు ఏ ఆచారమునైనను, నెవరుగాని యతిక్రమించుట దోషము కాజాలదు. మఱియు శ్రేయస్కరము గూడ నగును.

ఈ దేశమున స్త్రీలకు ద్రవ్యవసతి లేదు. సంపాదనావకాశము లేదు. వీరెల్లప్పుడు ఒక్క దమ్మిడీ కొఱకైనను పురుషుల అనుగ్రహముపై నాధారపడవలసిన అస్వతంత్రులుగా నున్నారు. అయినను సొంతముగా వ్యయముచేయవలసిన కొన్ని బాధ్యతలు స్త్రీల నెత్తిపైనుండుటయు వాని సాఫల్యమొనర్చుకొనజాలక స్త్రీలు వెతలుబడుటయు పురుషులచే ఛీత్కారముల నందుటయు శోచనీయమగు విషయము. ఇట్టి చీవాట్లకు హేతువులగు నాచారములను స్త్రీలు విడనాడుట సర్వవిధముల నుచితమగు పని.

ఏ శుభకార్యము సందర్భమునైన నెవరి యింటికైన పేరంటమునకు గాని భోజనమునకుగాని వెళ్ళవలసివచ్చినచో, చీర రవికలగుడ్డలు వగైరాలు గాని, లేక రవికలుగుడ్డలు మాత్రమే గాని లేక యిప్పటి నవనాగరికతాపద్ధతిని బట్టి యేవెండివస్తువునైనగాని తీసికొని పోవుట స్త్రీలలో నాచారముగా నున్నది. అయితే యీ ఆచారముయొక్క ప్రయోజనమేమి? ప్రతి స్త్రీయు నీవిషయము బాగుగా నాలోచించవలయును.

చీరలేమి; రవికలేమి; వెండివస్తువులేమి ఇవి యన్నియు బాహ్యమునకు బహుమతుల రూపమున కనపడుచున్నను వాస్తవమున కివి యీఁగగరాని అప్పులు గాని ఆనందించవలసిన బహుమతులు గావు. ఇచ్చి మరల కోరనిది బహుమతి. ఇచ్చిపుచ్చుకొనునది అప్పు. నేడు యే వస్తువునైతే మనము ఒకరికి పేరంటము సందర్భమున యిచ్చివచ్చుచున్నామో దానిని జాగ్రత్తగా పరిశీలించి వెలగట్టి అంత విలువగల వస్తువును తీసుకొనిన వారు మరల మనకు చెల్లించుచున్నప్పుడు అది అప్పుగాక బహుమతి యెట్లుకాగలదు? పొట్టప్పు బట్టప్పు ఉండదని మన దేశములోనున్న సామెతనుబట్టియే యీ ఆచారము ఋణమువంటిదిగాని బహుమతివంటిదిగాదని నిశ్చయమగుచున్నది.

ఈ ఆచారము అప్పువంటిదగుటయే గాక, అప్పుకంటె కఠినమైనదిగాగూడ నున్నది. అప్పునకు రేపని మాపని మఱి పదిరోజులకని నెలకని రెండునెలలకని గడువులు పెట్టతగిన అవకాశములున్నవి. కాని యీ పేరంటపు ఋణమో అట్టిది గాదు. ఏ దినముననైతే వెనుక మన యింటికి పసుపుకుంకుమ తెచ్చినవారి యింట్లో పేరంటపు వేడుక జరుగునో ఆ ఋణమున నీబాకీ చెల్లించివేయబడవలయును. చేతిలో డబ్బులేదనిగాని తెచ్చిపెట్టువారు లేరనిగాని, మగవారు సమ్మతించలేదనిగాని, యీ ఆచారమును మానుటకు వీలులేదు. ఎన్ని అసౌకర్యములున్నను తలతాకట్టుపెట్టియైనను నీఅప్పును తీర్చితీరవలయును. కనుక లోభివాడి అప్పుకంటె, సర్కారు పన్నుకంటె, యీ పేరంటపుపన్ను చాలా కష్టతరమైనది. కౌన వేడుకరూపమున నున్న ఈ దురాచారములు స్త్రీలెల్లరు విడనాడుట శ్రేయస్కరము.

సంపాదనాపరులగు మగవారు కానీ కర్చులేకుండ సుఖముగా విందుభోజనములారగించి వచ్చుచుండ కానీ మల్లెపూవులు కొనుక్కొనవలయునన్న మగవారిని దేహీయని దేబిరించవలసిన స్త్రీలు మగవారి మనస్సు కష్టపెట్టి, తాము కష్టపడి మఱియొకరికి కష్టముకలుగునట్లు లీయప్పును వారిపై మోపుట వివేకమగుపని కాజాలదు.

సంపన్నకుటుంబినులకీ ఆచారము భారముగా తోచక పోవచ్చును కాని దేశములో నీయాచారమువలన బాధలేని భాగ్యవంతురాండ్రకంటె బాధపడు సామాన్యకుటుంబినులే యెక్కువగా నున్నారు. కౌన వారి శ్రేయముకొఱకు భాగ్యవంతురాండ్రుగూడ నీయాచారమును మానుట జాత్యభిమానముగల నారీమణుల కర్తవ్యమైయున్నది.

నాగరికత ప్రబలమైనకొలదియు నీ వేడుకలలో నొసంగు బహుమానవిధములుగూడ బహురూపముల విస్తరిల్లుచున్నవి. వెండిదుకాణములలో నిందుకొఱకు వింతయైన చిన్నచిన్న వస్తువులు సిద్ధముచేయబడి అధికధరలకు విక్రయింపబడుచున్నవి. ఈ ప్రయోజనములేని వస్తువులను ఒకరినిమిత్త మొకరు కొనుట దుర్వ్యయము గానున్నది.

కావున స్త్రీలెల్లరు యీ ఆచారమువలని బాధను గుర్తెరింగి తమ యింట జరుగు శుభకార్యములందు నీరవికలు గుడ్డలు వగైరాలు పుచ్చుకొనుట మానియు నితరుల యిండ్లలో వేడుకలు జరుగునపుడు తీసికొనిపోవుట మానియు నీ ఆచారము తొలగునట్లు ప్రయత్నింపవలయును.

ఇది మతమునకుగాని సంఘమునకుగాని సంబంధించిన ఆక్షేపణకరమగు విషయముకాదు. కావున స్త్రీలెల్లరొక మాట యనుకొని మానినచో నీయాచారమును సులభముగా తొలగించవచ్చును. స్వసంఘశ్రేయ మెఱిగిన స్త్రీలెల్లరీవిషయమును గమనించి ఆచరింతురుగాక!

'ఆమె నాగదిలోవున్నతరువాత కామం నన్ను లోబఱుచుకొంది.'

'ఎందుకొచ్చాను ఈవూరు ?'

'ఒకవిధమైన ఉదుటు నన్ను ప్రతిఏడూ ఆవూరు తీసికెడుతోంది.'

చిన్నకథ :

Maupassant వ్రాసిన పరాసుకథకు స్వేచ్ఛానుకరణము.

రచయిత:

కావలి శ్రీరామమూర్తి, బి. యే.

చాలాకాలంనుంచి నాగుండెల్లో రాయికట్టుకుపోయింది నేను చెప్పలేనిది. ఇది నన్ను మంటలో కాల్చివేసింది, అవమానంచే అణచివేసింది. నా సందేహం, నా ఆశంక తీరని సమస్యలై పోయాయి. ఇవి ఎప్పటికైనా తీరుతాయని ధైర్యంకాని వీనికి అంతూపంతూ కాని కనిపించడంలేదు.'

నాకు ఇరవైఐదుఏళ్ళప్పుడు, ఒక స్నేహితుడితో యాత్రకు వెళ్లేను.

పది, పదిహేనురోజులు యిష్టంవచ్చినట్లు తిరిగినతర్వాత ఓపల్లెచేరేం.అక్కడ నాస్నేహితుడికి జ్వరంవచ్చింది. వెంటనే పక్కనున్న 'పా—'అనేపట్నం వెళ్లేం. మా అదృష్టవశాత్తు అక్కడ ఓహొటలు వుంది. అక్కడ నాస్నేహితుడికి జబ్బు ఎక్కువయింది.

నువ్వు ఎప్పుడైనా 'పా—'వెళ్లేవా? లేదూ! అది ఓగమ్మత్తువూరు. పల్లెకాదు పట్నంకాదు. మధ్యగకం. ఆజిల్లా లక్షణాలన్నీ ఆవూళ్ళో ప్రతిఫలిస్తాయి. అక్కడ నవనాగరికత చొచ్చుకొనే మార్గంలేదు. అప్పటికి యిప్పటికీ ఆవూరులో ఏమార్పూ కనిపించదు.

ఇప్పటికీ అని ఎందుకంటున్నానంటే నాపాపఫలం కోసం ప్రతిఏడూ నేను అక్కడికి వెళ్తున్నాను.

రైలు దిగగానే ఓపాడుపడిన కోట నిన్ను ఆహ్వానిస్తుంది. ఓకాలువ ఆకోటనుచుట్టి ప్రయాణం సాగిస్తోంది. ఆ సన్నని వీధులకి యుగయుగాలనాటి పూరికొంపలే అలంకారం. మోకాళ్ళు దిగని బట్టలూ, బుజాలుదిగని షర్టులూ మొగాళ్ళదుస్తులు. ఇంక యువతులా! మంచి బలంగా వుంటారు. అంత అందగత్తెలు కారుకాని, నాగరికుల్లా శల్యాల్లా కాకుండా జీవంతో పొంగుతూ వుంటారు. కప్పీకప్పనిబట్ట వక్షాలని మరుగుపరుస్తోంది. చెవులకు రెండు యిత్తడిచక్రాలు వాళ్ళ లోలక్కులు.

హొటలుదాసీ 'నళిని'కి పద్ధెనిమిది ఏళ్ళకంటె ఎక్కువవుండవు. ఆమె అంత పొడుగనడానికి వీలులేదు. ఆలేత నీలాల్లాంటి కళ్ళకు నల్లని కంటిపాపలు వింతసోయగాన్ని ఇస్తున్నాయి. ఆమె దంతాల్లాంటి పళ్ళవరుసలు నవ్వినప్పుడల్లా మంచిముత్యాలు వెదజల్లుతున్నాయి. ఆమెకు మనభాష కొంచమైనా రాదు. ఆమె తనదేశంవాళ్ళలాగే 'మరాటీ' తప్ప యింకేమీ మాట్లాడేదికాదు.

నాస్నేహితుడికి జ్వరం తగ్గలేదు. డాక్టరు ఆవూరు వదలివెళ్ళడానికి వీల్లేదన్నాడు. అతని పరుపుపక్కనే గడపవలసివచ్చింది కాలమంతా. నళిని, ఒకప్పుడు భోజనం, ఒకప్పుడు ఫలహారం, ఇంకో అప్పుడు డ్రింకులు పట్టుకొచ్చేది గదిలోకి. ఆవచ్చినప్పుడల్లా వేళాకోళం చేసేవాణ్ణి. హాస్యాలాడేవాణ్ణి. ఆమె నవ్వుతూవున్నట్లు కనిపించేది. ఒకళ్ళభాష ఇంకోళ్ళకు తెలియకపోవడంవల్ల మేము ఎప్పుడూ మాటాడుకోలేదు.

ఒకనాడు రాత్రి చాలాసేపటివరకు స్నేహితునిగదిలోవుండి, నాగదికి వెళ్ళిపోతున్నాను. అక్కడ నళిని తన గదిలోనికి పోతూ కనిపించింది. ఆమెగది నాగదికి ఎదురుగానే. ఆలోచనలేకుండా,అకస్మాత్తుగా సగం హాస్యంకోసం, సగం అల్లరిచేద్దామని, ఆమె చెయ్యి పట్టుకొని నాగదిలోకిలాగి గడియవేసాను. భయంతోనూ, కోపంతోనూ, అవమానంతోనూ, స్తబ్ధు అయిపోయింది నళిని. వెర్రిచూపులతో నాకేసి చూసింది కేకలేస్తే తనగౌరవానికి, మర్యాదకి భంగం కలగడమే కాకుండా, ఉద్యోగం పోవడం తప్పదు.

హాస్యానికే యిది చేసాను మొదట. ఆమె నాగదిలో వున్నతరువాత కామం నన్ను లోబర్చుకొంది. నేను పశుప్రాయుణ్ణయిపోయాను. కొంతసేపు చప్పుడు కాకుండా లొంగతీసుకోడానికి ప్రయత్నించాను. ఇద్దరమూ కుస్తీపట్టినంత పని చేశాము. నిజంగా నళిని చాలాసేపు ధైర్యంగా నిలిచి పోరాడింది. ఒకసారి పెద్దబల్లపై పడిపోయాము. కుర్చీ బోర్లపడింది. పెద్ద చప్పుడయింది. ఎవరైనా లేస్తారేమో అని భయపడి కొంతసేపు నేను వూరుకొన్నాను. మళ్ళీ ఆమెను లొంగతీయడం మొదలెట్టాను. ఆమె తన్ను కాపాడుకోడానికి చాలాప్రయత్నించింది. ఆఖరికి అలసిపోయి నేలమీద పడిపోయింది.ఇంక అడ్డుపెట్టలేదు,

ఆమెను వదలివేసినప్పుడు తారాజువ్వ లాగ పరుగెత్తిపోయింది.

అక్కడవున్న మిగతా కొద్దిరోజులూ నేను నళినిని తరచు చూడలేదు. నన్ను దగ్గిరికి చేరనివ్వకుండా దూరంగానే మెలగేది. మరునాడు, ప్రయాణానికి నిశ్చయించాము. ఆరోజు అర్ధరాత్రిని నాగదిలోకి వచ్చింది నళిని. తనబాహువుల్లో నన్ను బంధించి తనహృదయానికి నన్ను అద్దుకుంది. ఏడుస్తూ, విచారిస్తూ, ఓదారుస్తూ, తను నన్ను ప్రేమించినట్లు అనేకచిహ్నలతో చూపింది. మూగసంజ్ఞలతో నాకేదో బోధించింది.

ఓవారంరోజు లయాక నేను నళిని మాట మేము గడిపిన రాత్రులుకూడా మరచిపోయాను.

మళ్లీ ముప్ఫయ్యేళ్లదాకా ఆతలపే లేదు నాకు. నేనెప్పుడూ, ఈ ముప్ఫయి ఏళ్లలోనూ 'పా—' అనేవూరు వెళ్ల లేదు. నేను రాస్తున్న నవలలో కొన్ని ఘట్టాలకోసం, ఆజిల్లాఅంతా తిరగవలసివచ్చింది. అప్పుడు 'పా—' వెళ్లేను. ఏమీమార్పులేదు ఆపట్నానికి. అపాడుపడినకోట, ఆకాలువ, ఆహోటలు అన్నీ మునపటివే. మరాటీయువతుల ఆచార వ్యవహారాల్లోకూడా ఏమీ భేదంలేదు.

సాయింకాలం అరైంది. హోటలు యజమానితో మాటామంతీ ఆడుతూ కూర్చున్నాను.

'ఇదివరకు ఈహోటలు ప్రొప్రయిటరు, నీకు తెలుసా? నేను యిక్కడ పదిరోజు లున్నాను... ముప్ఫయియేళ్ళ మాట. చాలాకాలమయింది.' అన్నాను.

'వాళ్లు నాతలిదండ్రులండి.' అన్నాడు.

అప్పుడు అతనితో చెప్పాను. నేను అక్కడికి రావడం, స్నేహితుడిఇంట్లో అస్వస్థతవల్ల చాలాకాలంవుండడం. అంతలో నామాటకు అడ్డువచ్చి

'నాకు బాగా జ్ఞాపకముందండి. అప్పుడు నాకు పదిహేను లేక పదహారేళ్లుంటాయి. మీస్నేహితుడిగది అదిగో. అది నాగది యిప్పుడు. మీగది అదిగో.'

అప్పుడు జ్ఞాపకమొచ్చింది నాకు నళినిమాట.

'ఇక్కడ ఓపద్ధెనిమిదేళ్ళ పిల్లవుండేది, జ్ఞాపకముందా?' అని అడిగాను.

'అవును. ఆమె ప్రసవసమయంలో చనిపోయింది. దొడ్లో పనిచేస్తున్న ఓ సన్నని కుంటివాణ్ణి చూపించి 'వాడే దాని కొడుకు' అని చెప్పాడు.

నాకు నవ్వొచ్చింది.

'తల్లిఅంత అందంగాలేడు వీడు. వాడితండ్రిపోలిక కాబోలు' అన్నా.

'అయివుండవచ్చు. కాని అతనితండ్రి ఎవరో ఎవరికీ తెలియదు. ఆమె చనిపోయేటప్పుడైనా చెప్పలేదు తండ్రిపేరు. ఆమెకు అసలు ప్రియుడున్నాడనే తెలియదు ఎవరికీ. ఆమె గర్భంధరించిందంటే అందరికీ చాలా ఆశ్చర్యంవేసింది. ఎవరూ నమ్మలేదు చివరదాకా.' అన్నాడుఅతను.

నాహృదయంలో ఏదో తీరని వ్యధకి ఉపోద్ఘాతంలాగ, ఒకవిధమైన చెప్పలేని సంచలనం కలిగింది. ఆదొడ్లో పనిచేస్తున్నవాడికేసి చూసాను. ఆవులకి నీళ్లు తోడుతున్నాడు. తనపొట్టికాలు ఈడ్చుకుంటూ బుజాన్ని బరువైనకావిడి మోసుకుపోతున్నాడు. మాసి తూంట్లుపడిన బట్టలు, పొడుగైన చింపిరిజుట్టు చెవులు దాటి బుజాలమీద పోగుపడుతోంది.

'వాడి అవసరం మాకేమీలేదండి, దయదలచి వాణ్ణి అట్టేపెట్టేము. ఇతర కుర్రాళ్ళలా పోషణపొందితే మంచివాడు అవును. మన మేంచేస్తాం! ఎవడి ఖర్మానికి ఎవడుకర్తలు? ఏమవుతుందండి. తల్లి లేదు. తండ్రిలేడు. డబ్బులేదు.' అన్నాడు యజమాని.

నేను జవాబుచెప్పలేను. గదిలోకిపోయి పడుకున్నాను. రాత్రంతా నిద్రపట్టలేదు. ఆకుంటివాణ్ణిగురించే ఆలోచనలు.

'వాడు నాకొడుకేమో? నేను ఆ పశువుతండ్రినా? అతని తల్లిని చంపిన వాణ్ణి నేనే!' వాడితో మాట్లాడి అతను పుట్టినరోజు కనుక్కుందామని నిశ్చయించాను. ఇంతకన్న మంచివుపాయంలేదు, నాసందేహం తీరడానికి. ఉదయాన్నే, ఆకురూపికి కబురంపించాను. వాడితల్లిలాగే వాడికీ మనభాషరాదు. అంతేకాదు వాడికేమీ అర్థంకాదు. వొట్టి కుంకలా కనిపించాడు. కాని అతనిముఖం మీద మాత్రం తల్లి చిరునవ్వు తాండవమాడుతోంది. ఆకళ్లు, ఆ పెదవులు నళినివే. ఆసమయానికే హోటలు యజమాని వచ్చి మునిసిపల్ ఆఫీసులో వాడిపుట్టుక దినం కనుక్కొనివచ్చాడు. నేను 'పా—' ముప్ఫయిఏళ్ళకింద విడిచిపెట్టిన ఎనిమిదినెలల ఇరువైయారు రోజులకు వాడు దిగాడు యీలోకంలో. నాకు బాగా స్ఫురణలోవుంది నేను ఆవూరు విడిచినరోజు.

ఇది వినేటప్పటికి నాగుండెలలో దడపుట్టింది. నాశరీరం పులకరించింది. గొంతుకలోనే వుండిపోయాయి నేను అనుకున్న మాటలన్నీ, తెల్లపోయి చూసాను నళినికొడుకుకేసి. నాతీక్షణవీక్షణాలలోపడి గజిబిజియై పారిపోయాడు అతను.

ఆదినమంతా కాలవగట్లమ్మట తిరిగాను విచారహృదయంతో. నా ఆలోచనలకు ఓతెగూ తెంపూ కనిపించలేదు. గంటలకొద్దీ, ఓనిర్ధారణకు వద్దామని ప్రయత్నించాను. నేను వాడి తండ్రిని అవునాకాదా? ఛీ! ఛీ! ఎంతమాత్రం కాదు. నేనేమిటి ఆకుంటివాడి తండ్రినేమిటి అనుకునేవాణ్ని. [smudged] సందేహాంతరంగాలలో దొర్లిపో[smudged]ణ్ని. ఆఖరికి వాడు నాకొడుకుఅని భయంకరమైన నిర్ధారణకు వచ్చేవాణ్ని.

భోజనం సహించేదికాదు. ఎవరైనా నన్ను, నాస్థితి చూస్తే నాపని అయినట్టే. అయ్యో! దైవమా! ఎందుకొచ్చాను ఈవూరు? ఏంవిచారంలేని మనిషిలావుండాలని ప్రయత్నించా. నలుగురూవుంటే

నాగదిలోకి వెళ్ళిపోయేవాణ్ణి. ఆరాత్రి కలలు కలలుగా గడిపేను. భయంకరమైన కలలు నాకు విషాదం కలిగించాయి. ఆకురూపి నాముఖంమీద నవ్వుతూ 'నాన్నా' అని పిలిచేడు. ఇంతట్లో, కుక్కఅయి నాపిక్కపట్టుకొని కరిచాడు. తప్పించుకుందామని ఎంత ప్రయత్నించినా వదలకుండా వెంటేపరుగెత్తి నన్ను తెగతిట్టాడు. వాడితండ్రిని నేను అవునో కాదో నిశ్చయించడానికి ఓసభ నియిమింపబడినదట. అందులోకి వాడు వచ్చాడు. ఒక డన్నాడు. 'అబ్బే సందేహంలేదు. వాళ్ళపోలిక చూడండి.' అప్పుడు నిజంగా ఆనీచుడికి, నాకు పోలిక కనిపించింది. ఇంతలో మెలుకువ వచ్చింది.

కాని, పోలికవున్నదన్నమాట మాత్రం మనసులో వుండిపోయింది. వాడ్ని బాగాచూసి నాతో పోల్చుకో నిశ్చయించాను., అది ఆదివారం. కొలువగట్టున వాడు కనిపించాడు. వాడికి ఓరూపాయి ధర్మంచేసి మాటమంతీ ఆడుతూ జాగ్రత్తగా పరిశీలించాను. ఆడబ్బుపుచ్చుకొని వెకిలినవ్వునవ్వుతూ నుంచున్నాడు. కొంతసేపటికి నాతీవ్రపరిశీలనచూసి సిగ్గుపడి, క్షమించమన్నట్టు వాడి భావలో పలికి నడచిపోయాడు.

ఆరోజుకూడా వేదనతోనే గడిచింది. సాయింకాలం, యజమానినిపిలిచి, నిగూఢంగాను, 'డిప్లమేటిక్'గాను నాకు ఆ అనాథపై జాలికలిగిందని, వాడికేదైనా సాయంచేయాలని వుందని చెప్పాను.

'మీరు వాడికోసం ఏమీ విచారించకండి. మీదయకు పాత్రుడవడానికి తగినవాడుకాడు. మీకు కష్టం కలుగుతుంది చివరికి. ఇక్కడ ఆవులకి నీళ్లుపెడుతూ మాయింట్లో పనిచేస్తూ వుంటాడు, వాడికి కావలసిన తిండీ బట్టా నేను యిస్తాను. మీకు పనికిరాని బట్టలుంటే యివ్వండి వాడికి.' అన్నాడు అతను.

ఇంక ఎక్కువగా నేను చెప్పలేదు, ఆలోచిస్తానని చెప్పాను. సాయంకాలము, నళినికొడుకు చెడత్రాగి వచ్చి నానా అల్లరీ చేసాడు. ఇంటిపెంకు లెగిరేటట్టు కేకలేసాడు. బల్లలు చితుకకొట్టాడు. చివరికి వర్షంలో పడుకున్నాడుట. నే నిచ్చిన రూపాయి యింతపని చేసింది.

యజమాని వాడికి యింక డబ్బుయివ్వవద్దని బతిమాలుకొన్నాడు. 'మీకు వాడ్ని చంపేయాలనివుంటే డబ్బుయివ్వండి.' అని ముగించాడు అతను. వాడికి డబ్బుకి వేరే ఉపయోగం కనిపించలేదు, సారాయికొనడానికి తప్ప.

గంటలకొద్దీ నాగదిలో పుస్తకం చేతిలోపట్టుకొని కూచునేవాణ్ణి చదువుతున్నట్టు నటిస్తూ, కిటికీలోంచి పనిచేస్తున్న ఆకుంటివాణ్ణిచూస్తూ. నాలక్షణాలు వాడిలో ఏమైనా వున్నాయా అని పరిశీలించేవాణ్ణి. ఆ నుదుటిమీద ముడుతలు, ఆముక్కూ నాపోలికే అని అనుకున్నాను. నాలక్షణాలు వాడిలో కనిపించాయి అని తలచాను.

ఇంక ఆవూళ్ళోవుంటే అనుమానాలెక్కువవుతాయి. కొంతడబ్బు యజమానికియిచ్చి, వాడ్ని సరిగా పోషించమని చెప్పి వెళ్లిపోయాను.

వాడికి చదువు చెప్పిద్దామని ప్రయత్నించా. లాభంలేదు. వాడు వొట్టి మూర్ఖుడు. అడవిమనిషి. త్రాగుబోతు. ఏమాత్రం డబ్బున్నా కల్లు అంగడికి పోతాడు. హోటలు యజమానికి లంచమిచ్చి వాడి కష్టం తగ్గించాను. బాగా చూడమన్నా. చివరికి యజమాని నాపనులకు ఆశ్చర్యపడి, అనుమానించాడేమో కూడా. 'మీరేంచేసినా ఫలందక్కదండి. వృథాప్రయాస. మీరు అతన్ని పాడుచేస్తారుకాని బాగుచేయలేరు. మీకు బీదలకి సాయంచేద్దామనే వుంటే కావలసినంతమంది అనాథులున్నారు. మీ కష్టానికి ఫలందక్కించే ఓకుర్రాణ్ణి ఏరుకొండి' అన్నాడు.

అతనికేం జవాబుచెప్పను? నాసందేహాలుకాని, నా అనుమానాలుకాని కొంచెం తెలిస్తే నా అవమానానికి మితి వుండదు. నన్ను నాశనంచేయడానికి ఏమాత్రం సందేహించడు.

'నళినిని చంపినవాణ్ణి నేనే. నళినికొడుకు నీచజీవితానికి కూడా నేనే కారకుణ్ణి' అని ఎప్పుడూ అనుకుంటూ వుంటా. వాడి జన్మకి నేనే కారకుణ్ణి అని, నాకూ వాడికీ రక్తసంబంధము వుందనీ, నిజంగా నాపేరు వాడికి రావలసిందనీ అనుకున్నప్పుడల్లా, నా అంతరాత్మ బాధపడడమే కాకుండా, నాహృదయంలో ఏదో వెచ్చగా విచారకరంగా వుంటుంది. వాణ్ణి చూసినప్పుడల్లా, ఏదో ఆశ్చర్యకరమైన, చెప్పలేని సహించలేని భావం కలుగుతుంది. అది నువ్వు తలచుకోనైనా లేవు సుమీ!

వాణ్ణి చూడాలన్న దాహానికి తృప్తిలేదు. కాని అతన్నిచూస్తే, భరింపలేని బాధకలుగుతుంది. ఆ కిటికీలోంచి ఆకుంటివాణ్ణి చూస్తూ, 'అడుగో నాకొడుకు' అనుకుంటూవుంటా. అప్పుడే వొకసారి వాణ్ణి కౌగలించుకోవాలని తోస్తుంది. కాని ఎప్పుడూ ఆకుంటివాడి చేతులైనా ముట్టుకోలేదు.

ఆరేళ్ళనుంచి ప్రతిఏడూ ఈతలపు మాత్రం నన్ను విడిచిపెట్టలేదు. ఏదో బరువు పెట్టినట్టు వుంటుంది నాహృదయంలో. ఒకవిధమైన ఉదుటు నన్ను ప్రతిఏడూ ఆవూరు తీసుకెడుతోంది. ప్రతివత్సరం, ఆకుంటివాడు కాళ్ళీడ్చుకుంటూ ఆపేడలోనూ, ఆవులశాలలోనూ తిరుగుతుంటే చూసి వాడికీ నాకూ, పోలికవుందని నిర్ధారణకువస్తూ, వాడికి సాయంచేద్దామని నిశ్చయిస్తూ నాపాపానికి ప్రతీకారం చేయడానికి ప్రయత్నిస్తున్నాను. కాని ప్రతిఏడూ, ఏనిశ్చయానికీ రాలేక బాధపడుతూ, తపిస్తూ, అనుమానిస్తూ, భయపడుతూ తిరిగి వస్తున్నాను.

శారదాచట్టం మన పెళ్లిళ్ల తంతుని తారుమారు చేసింది

చిన్నపిల్లను పెళ్లిచేసుకుంటే జెయిలు

అయినా యువకులు భయపడవలసిన అవసరంలేదు.
చిన్నపిల్లలనే పెళ్లాడే వారు శాసనధిక్కారం చేయాలి.
పెద్దపిల్లలను చేసుకుని పూర్వం ఎవరూ సుఖించలేదు.

రచయిత:

కాశ్యపుడు

పదిసంవత్సరాల క్రితం ముచ్చట్లు. వయసువచ్చిన పిల్లను పెళ్లి చేసుకున్నవాడిని సంఘంలో వెలివేసేవారు. వాడిని హేళన చేసేవారు. చాకళ్లు బట్టలుతక్కుండా కట్టుకట్టేవారు. మంగలి క్షౌరం చేసేవాడుకాదు. ఒకవేళ వాడిమీద అభిమానంకొద్దీ చాకళ్లు, మంగళ్లు వాడియింటికి వెడితే వాళ్ళని యితరులు తమయిళ్ళకి రానిచ్చేవారు కాదు. అంచేత భయపడి వాళ్లు పెద్దపిల్లను పెళ్లిచేసుకున్నవాని యింటికి వెళ్ళేవారుకాదు. ఆప్తబంధువులుకూడా గునిసేవారు వానిగుమ్మం తొక్కటానికి.

ఒక్కదశ తెల్లవారేసరికి, దేశం తల్లక్రిందులైంది. ఇప్పుడు చిన్నపిల్లను పెళ్ళిచేసుకుంటేనే చిక్కులు. సంస్కారులందరూ వానిని వెక్కిరిస్తారు. అదీకాక యీమధ్య జరిగిన మంత్రాంగంమూలాని చిన్నపిల్లను పెళ్ళిచేసుకుంటే జైలులో పెడతారని ప్రతీవాడి నోటంటా వింటూన్నాం.

శారదాబిల్లు పుణ్యమా అంటూ సాపాటురాముళ్ళనోళ్ళల్లో కరక్కాయపడ్డది. ఏనుగ వెలగపళ్లు మ్రింగినట్టు నేతిలో ముంచిన బూరెలను బుట్టలాదిగా పొట్టబెట్టుకునే వినాయకుల పొట్టలు డొల్లుపడిపోయాయి. పూర్వం పెళ్లిఅంటే మహా సరదాగావుండేది. గంటల బళ్లు కట్టుకుని తరిలివెళ్ళడమూ, పెళ్ళివారి తుప్పతీయడమూ రివాజై ఉండేది. పెళ్ళికాలమందు పెద్దలందరూ చేరేవారు. సోమయాజులు, శాస్త్రిలు, ఘనాపాటీలు ఒకరేమిటి సంభావన సంతృప్తిగా దొరుకుతుందంటే లెక్కలేకుండా వచ్చేవారు. అందులో విఘ్నేశ్వర వరప్రసాదలబ్ధులు పొట్టనిమురుకుంటూ, గ్రుక్క తిరగకుండా అర్థంలేని మంత్రాలు ఏకరవు పెడుతూ, పిలకజాడిస్తూ, కుండనాలు కదిలేటట్టు ముందుకివంగి పిడికెడు అక్షతలు వధూవరులమీద పడేసి అధిక సంభావనకోసం హంగామా చేసేవారు. భోజనాలదగ్గిర భూమినానిగోతులుపడేటట్టు భూమిని నేతితో తడిపితేగాని తిన్నట్టు లెక్కబెట్టేవారుకాదు. పప్పుధప్పళాలు పొట్ట నిండా ఎక్కించి లేవలేక 'గోవిందా' అని గోలచేసేవారు.

అవిఅన్నీ ఇప్పుడు ఏవి? శారదా మహాశయుడు వాటిని అన్నిటినీ శివుడు హాలాహలాన్ని మింగినట్లు మింగేశాడు. ఎందరి వుసురో పోసుకుంటున్నాడు పాపాత్ముడు, హరవిలాసశారదా. పెద్దపిల్లలకే పెళ్లిళ్లు చేయాలని శాసనాన్ని పుట్టించాడు, ఇటీవలదాన్ని తిరిగి రేపించాడు.

కాని పూర్వం వయసువచ్చిన పిల్లలను పెళ్ళిచేసుకున్నవాళ్లు ఏమైనా బావుకున్నారా? ఆప్రశ్నకు సమాధానమేరాదు. ఎంచేతంటే ఎవడూ సుఖం అనుభవించలేదు కనుక.

శకుంతల, దమయంతి, రుక్మిణి, అహల్య యిత్యాది స్త్రీలు పూర్వకాలంలో పెద్దవాళ్ళు అయాకే పెళ్లిచేసుకుని శారదాచట్టానికి తల్లులైనారు. వీరి వివాహానంతర

జీవితాలు ఎట్లావుండినాయో పరికించండి.

శకుంతల పల్లెటూరుపిల్ల - ఇంకా నికార్సుగా చెప్పాలంటే ఆశ్రమంలోనిది అనాలి. నేను పట్నాలనుంచి పల్లెలకుదిగే ప్రముఖపురుషుల్లాగే ఆరోజులలో దిగివుంటాడు దుష్యంతుడు పోగ్గా ఆశ్రమానికి వాని వయ్యారం చూసేసరికి ఆమెకు, ఆమె అందచందాలు చూసేసరికి ఆయనకు మనస్సులు కరిగిపోయాయి. పెద్దదై వరయోగ్య అయివున్న శకుంతల నిలువలేకపోయింది. పెళ్ళిచేసుకుంటా నన్నాడు దుష్యంతుడు. చేయిపట్టుకున్నాడు. గాంధర్వం అంతేగా! అడ్డుతీసిపోయింది. ముద్దులు మూటగట్టింది మొగుడికి, ఉద్యానవనంలో వంటరిగా తిరుగుతోందికనక. మోజుతీరింది. పట్నం పరుగెత్తాడు. డాబులుచేసే భోగంవారు హారతు లెత్తుటచేతను చిత్తం తిరిగిపోయి చేసినపని మరిచిపోయాడు.

——మహారాజు-మొగవాడుగా——

ఆమెవచ్చి కాళ్లావేళ్లా పడ్డా కార్యం లేకపోయింది. కార్యం చేసుకున్నప్పుడు పదిమందీ చూడకపోయినందుకు కలిగిన ఫలం- ఆమె ఎవరోకూడా ఎరగనన్నాడు కదా! మారీచమహాముని లేకపోతే అమ్మాయిగతి ఏమయ్యేదో! అందుకే పెళ్లిలో పెద్దలుఅవసరం.

ఇక దమయంతిసంగతి చూడండి. పెళ్లినాటికి యీడేరినపిల్ల కాబోయేపతికి పక్షిచేత కబురుపంపింది. ఆమె అందచందాలు వినిచిత్తైనాడు మొత్తంమీద నలుడు. తీరాపెళ్ళి చేసుకున్నాక తిప్పలు తప్పినవి కావు. శనిగాడి దృష్టిసోకింది ఆజంటకి. పట్టుమని పదిరోజులు గుట్టుగా బ్రతకడానికి వీలులేకపోయింది. యావనమంతా చెట్టుక్రింద బ్రతుకుతోనే చెల్లిపోయింది దమయంతికి. వయసువచ్చిన పిల్లను చేసుకున్న ప్రారబ్ధంచేత నలుడు వంటలవాడుగా తయారుకావలసి వచ్చింది. అంతేకాదు, కురూపిగాకూడా అయ్యాడు. బాహుకుడై బానిసపని చేసాడు. మన నలుడు శారదాయాక్టు పుట్టకపూర్వమే శారదా చట్టసూత్రాలకి బద్ధుడైన ప్రబుద్ధుడవడంచేతనే వానికా తిప్పలన్నీ తలకు చుట్టుకున్నాయి.

పెద్దమనిషి అయిన రుక్మిణి సంగతిమాత్రం ఏమైంది? భార్యకి అన్నగారని కాస్తకూడా ఆలోచించక రుక్మికి కృష్ణుడు పూర్తిగా క్షౌరంచేసాడు. పెద్దపిల్లల పెళ్ళి ముచ్చట్లు ఇట్లానే వుంటాయి! మరిన్నీ కోరివచ్చిందికదా అని రుక్మిణిని కృష్ణుడు చులకనగా చూసాడు. లేకపోతే ఏంవచ్చింది వానికి చెట్టుతెచ్చి సత్యకిచ్చి ; ఒక్కపువ్వా రుక్మిణి కొప్పులో పెట్టడం?

అంటే సత్రాజితిమాత్రం పెద్దది అయాక పెళ్ళిచేసుకోలేదా అనవొచ్చు కొందరు. పెద్దది అయాక పెళ్ళిచేసుకున్నది కాబట్టే మొగుణ్ణి ఫెడీలున తన్నగలిగింది సత్య. పెద్దపెళ్లాన్ని చేసుకున్నవాళ్ల పాట్లు ఇట్లానే వుంటాయి! జగన్నాటకసూత్రధారుడుకూడా ఆమె తన్నితే తలదులుపుకు ఊరుకున్నాడు. పెద్దపిల్లల్ని పెళ్లాడకండిరా బాబూ అని భగవద్గీతలో నన్నా వ్రాశాడు కాదు.

పెద్దదై పెళ్ళిచేసుకున్న అహల్య సంగతి ఇంక చిత్తగించండి. ఆమెను ఎప్పుడు లేవదీసుకుపోతామా అనే కూచున్నాడు శతయోనిగాడు గోతికాడ నక్కలాగ. ఆఖరికి లాభంలేదనికాబోలు కోడై కూసి కార్యంజరిపేడు.

ఇన్ని అవకతవకలతో నిండివున్నాయి పెద్దమనుషులయాక చేసుకున్న పెళ్లిళ్లు. అయితే ఆవధువులంతా మహాపతివ్రతలు గనుక ఏదో వారి కష్టాలు వారితోనే పోయినాయి.

ఈసంగతులన్నీ గమనించి విశేషవిజ్ఞానవంతులు తమపిల్లలకు చిన్నతనంలోనే పెళ్లిచేసుకుందామంటే ఇప్పుడు వీలులేకుండా వచ్చింది.

పెళ్లికి ఒకడోలు సన్నాయియేనా పెట్టుకుందామంటే డోలు సన్నాయి గోల వినబడేటప్పటికి దుడ్డుబడిత చంకపెట్టుకి తయారు; అగ్గిపుల్లగాడు- సాక్షాత్ యమకింకరుడు మళ్ళీ!

ఇప్పటి పెళ్ళికూతుళ్లకి ఏళ్లు తక్కువవున్నా వాళ్ళు ఎత్తరైన వాళ్ళయితే చిక్కులేదు. ఒకవేళ ఏళ్లు ఎక్కువవున్నా మదనాగ్నిచే మాడిపోయి ఎండిపోతే ఆవధవు

పాఠకమహాశయా!

క్రిందటినెల ఆంధ్రభూమి సంచికలో 449-వ పుటలో చదివిన

'భార్యవయోధిక ఐతే మంచిది.'

అను శీర్షికగల వ్యాసమునకు ఇపుడు ఇక్కడ చదువుచున్న

'చిన్నపిల్లను పెళ్లిచేసుకుంటే జెయిలు'

అను శీర్షికగల ఈవ్యాసము ప్రత్యుత్తరప్రాయముగా నున్నదేమో యోచింపుము.

—సంపాదకుడు.

వల్ల తప్పకుండా చిక్కులువస్తాయి. వధువురూపంతోపాటు వయస్సు కూడా ఇప్పుడొక ప్రధానమైన వివాహసమస్య అయింది.

కలియుగ ధర్మరాజుగారికి—పోలీస్ అధికారికి—దాక్షిణ్యం తప్ప తక్కిన శుభలక్షణాలన్నీ వున్నాయి. పెళ్ళిచేసుకుని పెళ్లాంతో మనుగుడుపులు కుడుద్దామని మనసుపడే నవమన్మధావతారులకు (14కు లోబడ్డ ఆడపిల్లలు. 18 సంవత్సరాలకు లోబడ్డ మగపిల్లలు) చోడంబలి సిద్ధం జైల్లో. కాని కాంగ్రెసు ధర్మమా అంటూ మజ్జిగకూడా ప్రసాదించారు—గంజి తాగనివాళ్ళకు. జంటబాసినవాళ్ళ ఏడుపుకు తోడుగా వుంటానికి రేడియోకూడా వుంటూవుంది యిప్పుడు జైళ్ళలో.

సానిమేళం, సన్నాయిమేళం, ముత్యాలపల్లకీ, తోలుబొమ్మలు, గొల్లసుద్దులు, భాగోతాలు, హరికథల్నూ, బుట్టబొమ్మలు, మందుగుండు సామానులు, రామడోలు మేళాలు పంక్తులుతీర్చి పొట్టనిండా భోజనాలు చేసినవారి గోవిందలు వీనితో శారదాయాక్టు పూర్వపు పెళ్లిళ్లు శబ్దబ్రహ్మన్ని అరాధించేవిగా వుండేవి.

శారదాయాక్టు పూర్వపు పెళ్లిళ్ళలో కాశీకిపోతాననే యువకుని కన్నెతాడుతో కట్టితెచ్చి చిన్నపిల్లతో లంకెవేసేవారు. ఆ గుదికర్రను యీడ్చుకుంటూ యీదేవాడు సంసారసాగరం. అంత చందాలు ఎలావున్నా సూత్రబలంచేత సుఖించేవారు. అయిదురోజులు అగ్నిహోత్రాలదగ్గర శుద్ధమనస్సుతో కూచునేవాడు పెళ్ళికొడుకు అర్ధాంగితో.

పెళ్లికి పదిమందీవచ్చి పోవడంచేత సంఘజీవనం వృద్ధిఅయ్యేది. ఫలానావారు భార్యాభర్తలయారని అందరికీ వెల్లడయ్యేది.

పెట్టెలో దాచియుంచిన ముత్తైదువుల పట్టుచీరలన్నీ బయటపడేవి. హారతులుపాడితే ఆదిశేషువు నిద్రపోయేవాడు. పాడినందుకు బహుమానంగా ఆడపడుచులికి పానకపు బిందెలు, నూటపదహార్లు, కాళ్లుగడుగు పళ్ళేలు యిచ్చేవారు ముచ్చటగా.

శారదామహాశయుడు బయలుదేరి పెళ్ళిభోగం అంతా తల్లక్రిందులు చేసి తుంగలో కుక్కేశాడు. అగ్నిహోత్రాలవద్దనుండి పెళ్లిభోగం గుభీమని యానాం, ఫ్రెంచిపేటల్లోకి దూకింది. పవిత్రమైన గంగ శివుని నెత్తిమీదనుండి ఆర్యావర్తానికి తరువాత అగాధంలోకి పోయినట్లు ఇప్పుడు యానాం, ఫ్రెంచిపేటల్లోకూడా నిలవకుండా సందుల్లోకి, పాడుదేవాలయాలకి, దెయ్యాల కొంపలకి పెళ్ళిభోగం దారితీసింది.

ఈపెళ్లిళ్లకి శుభలేఖలులేవు; మంగళవాద్యాలు లేవు. పెదవిదాటి బయటికివచ్చే మంత్రాలు లేవు. కంఠమెత్తిన మంగళహారతులు లేవు. శబ్దమన్నదే పనికిరాదు. బంధువుల బాహాటమైన రాకపోకలుకూడదు. ఆనందంగా, బహిరంగంగా, ఆర్భాటంగా జరుపుకోవలసిన పెళ్లిళ్లు చాటుగా, మాటుగా, సడిచప్పుడూ లేకుండా కానిచ్చుకోవలసి వస్తోంది.

మనపెళ్లిళ్లతంతుని శారదా చట్టం ఈరీతిగా తారుమారు చేసింది.

కాని ఇంతటి కీడులోకూడా ఒక మేలువుంది. అది ఏమిటంటే? ఉద్యోగాలకై పెద్దల యింటి పంచలమ్మట తిరిగే బ్రహ్మచారి యు

వకులు ఓచిన్నపిల్లనుచూసి పెళ్లాడి శాసనధిక్కారంచేసి ప్రభుత్వం వారిచే శారదాయాక్టుక్రింద పట్టుబడి శ్రీకృష్ణజన్మస్థానానికి పోయి నిరుద్యోగసమస్యను కొంతకాలం నిలదోయకలగడం. జైల్లో కొన్నాళ్లు వుండి వచ్చేసరికి శాసనధిక్కారంచేసి జెయిలుకువెళ్లి వచ్చిన తరవాత కాంగ్రెస్‌వారు మంత్రులయినట్లే వీరున్నూ మంత్రులు కావడమో మరోవుద్యోగం సంపాదించడమో చేయవచ్చు. ఏవుద్యోగం దొరకపోయినా ఈలోగా పెళ్లాం ఎదిగి ఈడేరుతుంది కాబట్టి కార్యంచేసుకుని రాత్రి పగలూ ఆమెతో కాలక్షేపంచేసే ఉద్యోగంలో ప్రవేశించవచ్చు. ఈచట్టం ఈవిధంగా ఉద్యోగాన్వేషణపరులైన యువకులకు కొంతవరకు సదవకాశాన్ని ప్రసాదించేదిగావుంది.

నేను యువకుణ్ణి, బ్రహ్మచారిని, ఉద్యోగాన్వేషిణి కాబట్టి ఇటీవల సవరింపబడిన రూపంలో ఈచట్టానికి స్వాగతం ఇస్తూవున్నాను, నాకు పిల్లనివ్వడానికి చిన్నపిల్లతండ్రి ఎవడైనా ముందుకువస్తాడు కాక అని కోరుతున్నాను.



※

సారధిఫిలుమ్సువారి

'మాలపిల్ల'లో

మాలపిల్లతల్లిగా

నటించుచున్న

గంగారత్నం.

'వారానికి లక్షాయెనభై వేల జతల పాదరక్షలను తయారుచేస్తున్నారు.'

బాటానగర్

బాటామార్కు కాలిజోళ్ళ ఫ్యాక్టరీ కథ.
దానినుండి ఆంధ్రులు నేర్చుకోవలసిన గుణపాఠాలు.

'ఆంధ్రదేశంలో చెప్పుకోతగ్గ పారిశ్రామికసంస్థ
ఒక్కటికూడా లేకపోవటం ఆంధ్రులకు తీరని కళంకం.'

రచయిత :

భావరాజు నరసింహారావు

నాలుగైదు సంవత్సరాలనుంచీ మనదేశంలోనే గాకుండా ప్రపంచమంతా బాటా మంచి ప్రచారంలోకి వచ్చి, చాలా విరివిగా వాడబడుతున్న 'బాటా' పాదరక్షలు ఎక్కడతయారవుతున్నదీ, ఆ పరిశ్రమ యొక్క దినదినాభివృద్ధీ తెలుసుకోవటం అందరికీ సహజంగా కొంత కుతూహలంగాను ఆనందంగాను ఉంటుంది.

అవి కలకత్తాకు దక్షిణంగా యిరవై మైళ్ళదూరంలో హుగ్లీ నదికి కుడివైపున అయిదుసంవత్సరాల క్రితం నిర్మింపబడిన 'బాటానగర్' అనే పారిశ్రామిక పట్టణంలో తయారుచేయబడుతున్నాయి. బాటాకంపెనీ ప్రొప్రైటరైన థామస్ బాటా అనే పేరుగల జెకోస్లోవేకియా దేశస్థుడు 1932 లో యీ పట్టణనిర్మాణానికి పునాదివేశాడు. హిందూదేశంనుంచి వెళ్ళి మూడు సంవత్సరాలు జెకోస్లోవేకియా దేశంలో ప్రత్యేక పరిశ్రమచేసివచ్చిన భారతీయ యువకులు దానిని నిర్మించారు. హిందూదేశంలో యింత త్వరలో యింత అభివృద్ధి పొందిన వేరొక పట్టణం లేదనటంలో అతిశయోక్తి యేమాత్రంలేదు.

ఈబాటా పాదరక్షల ఫ్యాక్టరీ (కొంతపెట్టుబడితప్ప) భారతీయులచే నడుపబడుతూ వారి పారిశ్రామికపటిమను తెలుపు శుద్ధ భారతీయసంస్థ. ఈ పాదరక్షలు మనదేశంలో దొరకు ముడిపదార్థాలతోనే తయారుచేయబడి మనదేశంలోనే కాకుండా ప్రపంచమంతటిలోకీ చౌకగా అమ్మబడుతున్నవి. ఇప్పటికి నిర్మించబడిన ఏడు బ్రహ్మాండమైన ఫ్యాక్టరీలలో మూడువేలమంది పనివాళ్లు వారానికి లక్షా యెనభై వేల జతల పాదరక్షలను తయారుచేస్తున్నారు.

పనివాళ్ళకు ఏవిధమైన కష్టనష్టాలు కలుగచేయకుండా ఉండటానికి చాలా నవీనమైన పద్ధతుల మీద, నవీనమైన పనిముట్లతో యీఫ్యాక్టరీలు ఏర్పాటు చేయబడ్డవి. విశ్రాంతి సమయంలో పనివాళ్లు సుఖంగా కాలయాపన చేయటానికి తగిన సౌకర్యాలు ఉన్నవి. వాళ్లు ఉండటానికి చక్కని యిళ్లు కట్టించారు. వాళ్ళకు ఫుట్ బాల్, వాలీబాల్, టెన్నిస్, క్రికెట్ మొదలైన ఆటలాడుకోటానికి తగిన సదుపాయాలున్నవి. ఈదటానికి కొలనుకూడ ఉన్నది.

ఇవన్నీగాక అక్కడ పోస్టాఫీసు, టెలిఫోను, ఎక్సుచేంజిఆఫీసు, దేవాలయం, కాఫీహోటళ్ళు ఉన్నాయి. అగ్నిప్రమాదాలకు ఫైర్ పోలీస్ ఫోర్సు ఉన్నది. ఇంకా సినీమా, నాటకశాలలు కూడ కట్టుతున్నారు. పనివాళ్ళపిల్లలకు ఒక పాఠశాలకూడ స్థాపించబోతున్నారు. దీనిని బట్టి 'బాటానగర్' నిజంగా ఒక ఆదర్శపురమనిపించుకుంటుంది— అందుకు ఈక్రింది పట్టికే నిదర్శనం.

సం.	జనాభా	సగటు నెల సంపాదన
1933	250	రు. 20
1934	553	33
1935	959	25
1936	3,000	26

1931-32 సం. లో మనదేశం

లోకి 63,00,000 జతల రు. 40,55,000 ఖరీదుగల రబ్బరు పాదరక్షలు దిగుమతి చేయబడ్డాయి. 1936-37 సం॥ లో యీపాదరక్షలు 10,70,000 జతల రు. 6,85,000 ఖరీదుగలవి మాత్రమే దిగుమతి అయినాయి. కాగా ఆ సంవత్సరంలోనే 15,40,000 జతల రు. 10,50,000 ఖరీదుగలవి మన దేశంనుంచి ఎగుమతి చేయబడ్డాయి. కాబట్టి మనదేశం రబ్బరు పాదరక్షలను దిగుమతి చేసుకోవటంకన్న ఎగుమతే ఎక్కువ చేస్తూ రు. 43,00,000 లాభం సంపాదిస్తున్నది.

కొద్ది సంవత్సరాలక్రితం నిర్జనంగా ఉన్న ఆప్రదేశంలో యిప్పుడొక ఆదర్శనగరం నిర్మింపబడ్డది. కొద్ది సంవత్సరాల క్రితంవరకూ కొన్ని లక్షల రూపాయలు విలువగల పాదరక్షలు దిగుమతి చేసుకుంటున్న హిందూదేశం, యిప్పుడు—మనదేశంలో, మనదేశపు ముడిపదార్థాలతో, మనదేశస్థుల పనితనంతో తయారుచేయబడిన పాదరక్షలను ప్రపంచకాని కంతటికీ ఎగుమతిచేసి ఆర్థికంగా దేశానికి మేలుచేయడమే గాకుండా, దేశగౌరవాన్ని, పారిశ్రామికాభివృద్ధినీ వేనోళ్ళ చాటుతున్నది.

* * *

అసలుమాట

* * *

పైవిషయమంతా చదివిన తర్వాత మన భారతదేశంలో యింత ప్రపంచవిఖ్యాతసంస్థ ఒకటి వున్నదని గర్వించని భారతీయుడుండడు. ఆవిధంగానే ప్రస్తుత మన ఆంధ్రదేశంసంగతి ఒక్కమాటు తలుచుకుని మనం ఎంత వెనుకబడి వున్నామో గ్రహించుకుని విచారించని ఆంధ్రుడుండడు. మన ఆంధ్రదేశంలో పుట్టి గిట్టిన పారిశ్రామిక సంస్థలను తలుచుకుంటే కడుపు చెరువౌతుంది—బెజవాడలో స్థాపించిన కృష్ణాకాటన్ మిల్సు; బాదరులోని పంచదారఫ్యాక్టరీ, వుయ్యూరులోని పంచదార ఫ్యాక్టరీ; రాజమహేంద్రవరంలోని (యింతవరకూ ఎలాగో పనిచేస్తోంది!) పేపరు మిల్లు వగైరాలు ఆంధ్రుల వ్యాపార కుశలతనూ, కార్యదక్షతను చెప్పక చెప్తూన్నవి. నిజానికి ఆంధ్రదేశంలో చెప్పుకోతగ్గ పారిశ్రామిక సంస్థ ఒక్కటికూడా లేకపోవటం ఆంధ్రులకు తీరని కళంకం.

మనం వెక్కిరించే తమిళ సోదరులు మనకంటే పరిశ్రమలను ఎన్నోరెట్లు అధికంగా వృద్ధిచేసుకున్నారు. కోయంబత్తూరు, సేలం, మధుర, తూత్తుకుడి వగైరా పట్టణాలతో పోల్చతగిన పారిశ్రామిక పట్టణం ఆంధ్రదేశంలో ఒక్కటికూడా లేదు. బంగాళాదేశంలో వున్న నారమిల్లుల్లాంటివి మన ఆంధ్రదేశంలో కనబడవు. బొంబాయి రాష్ట్రంతో యీ విషయంలో అసలు పోల్చడానికే వీలులేని హీనస్థితిలో వున్నది మన ఆంధ్రదేశం.

అయితే మన యీ హీనతకు, నిస్పృహకు కారణమేమిటి? ముడిపదార్థాలకు మన ప్రాంతాలలో కొదువలేదు! పెట్టుబడికి లెక్కకు మిక్కుటంగా జమీందారులూ, శ్రీమంతులూ వున్నారు.

కాగా యిహ కావలసినది ప్రచారం, దానితర్వాత పట్టుదల.

అందుకు ఎలక్షన్లలోను, గుఱ్ఱపుపందేలలోనూ లక్షలు వెచ్చించే మన యీ జమీందారుల దృష్టి పరిశ్రమలమీదికి ప్రసరించేలాగు చేయాలి. ఇతర రాష్ట్రాల వారు యీ విషయంలో చేస్తున్న కృషి జాగ్రత్తగా పరిశీలించి, వారిని అనుకరించి, వీలైతే వారిని మించిపోయేటట్లు ప్రచారంచేయాలి.

అన్నటికంటే ముఖ్యమైనది—ప్రభుత్వసహాయం.

తమిళదేశంలో ప్రభుత్వంవారు అనేక పారిశ్రామిక పాఠశాలలను స్థాపించి పోషిస్తున్నారు. ఆపోషణకు తగిన అభివృద్ధి కనబడుతూనే వుంది. ఆంధ్రదేశంలో అలాంటి పాఠశాలలను వారు ప్రోత్సహించటంలేదు. ఈ విషయం ఆంధ్ర లెజిస్లేటివ్ మెంబర్లు గమనించి తగు ప్రయత్నం చేయవలసి వున్నది.

ఇంతకూ ఆంధ్రరాష్ట్రంవస్తేనేగాని యీ పనులు నిరాటంకంగా కొనసాగవని కూడా తోస్తుంది. అందుకుద్విగుణీకృతోత్సాహంతో సత్వరాంధ్ర రాష్ట్రసిద్ధికి తీవ్రంగా అలజడి చేయాలి. అంతవరకూ ఆంధ్రులకు మోక్షంలేదని అంతా గ్రహించాలి.

‘రాధ చేతికి కృష్ణుడందెనేని ఇక రాధ కనుపించపదు.’

రసోపాసన

రాధాకృష్ణులు ప్రకృతిపురుషులు.

ప్రకృతి పురుషునితో ఎల్లప్పుడు
‘రసబ్రహ్మవై రసమయినగు నాతో రమింపుము.
నన్ను కలుపుకోలేనిచో నాలోనైన కలియుము.’
అని అనుచుండును.

రచయిత:

తురగా వెంకటరామయ్య

ఊఁ, సన్యసించెదవా? నిజమేనా! ఏమి విరాగమోయి! బాగు బాగు!

అనంతలీలాలలితమగు నీ ప్రేమమూర్తిపై నింత విరక్తి యేలా కలిగినదోయి! ప్రియా! ఈపలుకునది నీవేనా! మాటలాడవేమి? నిన్ను సన్యసింపవలదని నిర్బంధింపను లెమ్ము! నీ వేగనున్న గుహాద్వారముల కడ్డమురాను లెమ్ము!

హృదయేశ్వరా! నన్ను దీవ్రముగ జూడకుము! శృంగారప్రియనని యసహ్యము జెందకుము! ఆవేశనుయినని హేళనమొనర్పకుము! నాహృదయమును జీల్చి పరిశీలింపుము! ప్రణయప్రవాహము తరంగిత మగుచున్నది! విశ్వమోహనగానము విజృంభించియున్నది! ప్రేమస్వరూపుడవై నాదివ్యహృదయరంగమున గ్రీడింపలేవా? రసోపాసకుడవు గాలేవా! నన్ను గలుపుకోలేవా! నాలోనైన గలియలేవా? మనమెక్కడనుంటిమి? ఎండలతో మండుచుండు నెడారిలో కాదు! అనంతలీలాలలితమగు కర్మభూమియందుంటిమి! రాధాకృష్ణుల క్రీడారంగమున జన్మించితిమి! సీతారాముల ప్రేమోద్యానములలో బెరిగితిమి: లక్ష్మీనారాయణుల తేజోలీలలలో దిరుగుచుంటిమి.

మనకిరువురకు నవినాభావసంబంధము! ప్రభో! నాశృంగారచేష్టలలో నీయాత్మ నశించునని సందేహింపవలదు? నావిలాసములను ప్రేమనృత్యములుగ దలంపుము! నాభావములను రసోపాసకుడవై తిలకింపుము! నన్ను గ్రీడారంగముగ స్వీకరింపుము! నేను నీకొరకే జన్మించితిని. నీవు నాకొరకే వచ్చితివి! ఒకరిలో నొకరు కలసిపోవలెను!

నాథా! ఒంటరిగ నేమయ్యెదవు? గాలితో నెగురుదువా? పృథివిలో గలియుదువా! ఆకాశమున నిలచెదవా? నీటిలో గరుగుదువా! వెలుగులో వెలిగెదవా? అన్నిటియందు నేనుంటిని? నీవేమయిన నేనది కాగలను! నన్ను విడువలేవు! ఇది నిశ్చయము! ఇప్పుడైన నావంక తేరి పారజూడుము?

అదుగో. మా ఆనందమయి, మారసస్వరూపిణి, రాధ ఆబృందావిపినమందదృశ్యపడినది. ఆయమునాపులినసీమలం బఱుగులిడుచున్నది; కృష్ణా! బాలకృష్ణా! మురళీకృష్ణా! యని యాక్రోశించుచున్నది: కృష్ణమురళీగానలోలయైన రాధ దేహము మరచినది; సంసారము మరచినది; మహదైశ్వర్యము గాలదన్నినది; అభిమానము పోద్రోలినది; కృష్ణవేణునాదామృతమే శరణ్యమన్నది; తన్నుదానే మరచిన రాధాదేవికి- ఉన్మాదినియైన రాధాదేవికి బాలకృష్ణుడు దొరుకుటలేదు? అదియేకళారహస్యము; రసరహస్యము. రాధచేతికి కృష్ణుడందెనేని ఇక రాధ కనుపింపదు.

కృష్ణుడు తానే వలపించవలసి వచ్చునని కాబోలును వేణువును

రాధలైనగాని తమకు మురళీకృష్ణుడు కనిపింపడు.

బూరించుచు అందీయందని లీలతో బరుగిడుచున్నాడు? రాధ యున్మత్తయై వెంటనంటినది.

అయ్యో! రాధాదేవి నేలకొరిగినదే! ఆవేశము, ఆవేదనము, పారవశ్యము లొక్కుమ్మడి రాధాదేవిని మూర్ఛావివశను జేసినవి; కృష్ణుడాగి తన వేణువున గరుణారాగముల బాడదొడంగెను; చూడగల్గితివేని చూడుము? పూర్ణచంద్రిక లమృతధారలు గురియుచున్నవి; బృందారణ్యము పారవశ్యమున స్థంభీభూతమైనది; యమునాతరంగిణి యుప్పొంగి రాధాకృష్ణుల 'పదసరోజములం బూజించుచున్నది.

అదే! వ్రేపల్లెయంతయు గదలి వచ్చుచున్నది. పాలుతీయు పణతులూ పరుగులే; పాలిచ్చు గోవులూ పరుగులే; ఏమిదృశ్యమోయి? జలకములాడు గోపికలు, చన్నుగుడుపు తల్లులు, భర్తల గౌగలించుచున్న ప్రౌఢలు, వస్త్రముల దాల్చుచున్న వనితలు, సగము తినినవారు- ఎక్కడవా రక్కడనుండియే; ఏస్థితిలో వారాస్థితిలోనే; వివస్త్రలై; విగతకంచుకలై; ఆలింగితబాహుయుగలై; యున్మాదినులై; పరుగు పరుగులతో, యమునాతీరమునకు వచ్చుచున్నారు.

మా బాలకృష్ణుడు ఆనందనృత్యములు సల్పుచు కరుణాగానము పాడుచున్నాడు. గోపీసంఘము, గోబృందము, మూర్ఛావివశయైన రాధ, యమునాతరంగిణి, బృందారణ్యము, దక్కనింకేవియు లేవు? వేరొక పురుషుడైన లేడు; మురళీకృష్ణుడొక్కరుడే పురుషుడు! కృష్ణుడే పాడుచున్నాడు; కృష్ణుడే యాడుచున్నాడు; అంతా కృష్ణమయము. మిగిలిన దేమున్నది? అంతయు నావేశము, పారవశ్యము, తన్మయత్వములలో మునింగియున్నది; విశ్వమంతయు యోగనిద్ర జెందినది.

రాధాదేవి లేచినది. కనుదామరలు వికసించినవి. మేనెల్ల పులకాంచితమైనది; బాలకృష్ణాయని యొక్కకేక వైచినది! కృష్ణుడు చకితుడై శృంగారమూర్తియగు రాధాకంఠాభరణమైనాడు!

వేణువాగినది ...... విశ్వము మెలకువ జెందినది. గోపీజనములకు శరీరస్మృతులు కలిగినవి; తామున్న స్థితులు తమకే సిగ్గుగ తోచినవి. బృందారణ్యమంతయు కలయ వెదకుటకు బయలుదేరినారు.

ఎచ్చటను రాధాకృష్ణులు గనుపించుటలేదు; చెట్లను బుట్టలను దిట్టి ఇండ్లకేగిరి. కృష్ణునికొరకు విలపించిరి. వేణునాదమును భావించి, భావించి సాధనకు గడంగిరి. రాధలైనగాని తమకు మురళీకృష్ణుడు గన్పింపడని నిర్ణయించిరి.

మాకు మధురానగరము నేలు కృష్ణుడక్కరలేదు; అష్టభార్యాయుతుడగు కృష్ణుడక్కరలేదు; భారతయుద్ధమునకు గర్ణధారుడగు గృష్ణుడసలే యక్కరలేదు; ఆయశోదాకిశోరుడు; ఆమురళీమోహనుడు; ఆశ్యామలబాలుడు; ఆమయూరపింఛావచూడుడు; ఆరాధాకృష్ణుడు; అతడే మాకు గావలయును; అతడే మామనోహరుడు.

అతనికి నిర్యాణము లేదు; మాకు మరణము లేదు; ఆమనోహర వేణుగానము విని తీరుదుమని శపథమువట్టిరి. అంతయు త్యజించిరి. ఆయమునాపులినసీమలలో, బృందావనామృతవీధులలో, ప్రేమాశ్రమములలో రసోపాసకు గడంగిరి.

ఏలరాడు? ఎందులకురాడు? అదుగో! చూడుము గోపీలోకములో. వీణాగానలోలుడు- కృష్ణుడు! మా రాధాకృష్ణుడు! ప్రేమమయమగు నీలోకమంతయు బాలకృష్ణునితో రమించినది. లీనమైనది. కరగిపోయినది.

ఇపుడేమియు లేదు. ఒక్క శ్రీకృష్ణుడే. వేణువునూదుచు బోవుచున్నాడు. ఎక్కడకో? ఎందులకో? ఏమైన నూహింతువా.....తిలకింపుము. తిలకింపుము. నేనే రాధను. నేనే ప్రకృతిని. సర్వముధరించు చానను నేనే. రసోపాసకుడవు కమ్ము. రసబ్రహ్మవగుము.- రసమయినగునాతో రమింపుము. ఏమి? ఏమందువు?

'నా సౌశీల్యము భంగమయ్యేముందు మృత్యువునే ఆహ్వానిస్తాను.'

స్త్రీవేషంతో యువకుడు

కన్య ఒకశయ్యమీద పాలిన్ సరసన పడుకున్న ఫ్లారిమెల్ ప్రభువు అవస్థ.

'తననూతన మిత్రరత్నాన్ని గూర్చి
అనుమానమేపోని పాలిన్ కంఠాశ్లేషం
చేసి నుదుటిమీద ముద్దాడింది.'

[రంగం: లండన్. క్లేరెండన్ తల్లిలేని ఇద్దరు కూతుళ్ళను- ఆక్టేవియా, పాలిన్‌లను—సాకుతున్నాడు. అక్కా-చెల్లెళ్లు అందకత్తెలు. క్లేరెండన్ తన పెదతండ్రి కుమారుడు మచ్చిమంటు ప్రభువును చూడ్డానికి వెళ్ళిఉన్నాడు. ఆక్టేవియా ఒకనివలలో పడుతుంది. పాలిన్‌ను వరించిన ఒకడు స్త్రీవేషంతో వస్తాడు. అప్పటి ఘట్టమిది. ఇది శ్రీపురాణం కుమార రాఘవశాస్త్రి (బి. ఏ) గారు అనువదించుచున్న 'లండన్ రహస్యాలు' అను గ్రంథములోనిది. ఆంధ్రభూమి పాఠకుల అభిప్రాయము కొరకు ఈఘట్టమును ఇచట ప్రచురించుచున్నాము —సంపాదకుడు.]

రచయిత:

పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.ఏ.

సాయంత్రం ఏడుగంట లౌతుంది. తివాచీమీద కూర్చుని చినిగిన గౌనేదో కుట్టుకుంటూన్నది పాలిన్. వివిధభూషణాలంకృతలై సోఫాల్లో చేరగిల బడిఉండే రాజకుమార్తెల కృత్రిమసౌందర్యం ఆమె సుకుమారతనూవిలాసం ముందు వెలవెలబోతుంది. రత్నఖచితసీమంత శోభితము కాకపోయినా ఆమె మెత్తని, నిగనిగలాడే జుట్టు ఎంత ఆకర్షకంగా ఉంది! మౌక్తికహారసమంచితము కాకపోయినా ఆమెకంఠసీమ ఎట్టికాంతిపుంజము వెలిగక్కుతూంది! ఆరోగ్యచిహ్నితములై, పవిత్రతాశోభితములై ఆమె గులాబిరంగుబుగ్గలు వదనబింబానికి ఎంత అందం చేకూరుస్తున్నవి!

పాలిన్ ఒక్కతే ఉన్నది ఇంట్లో. అయిదుగంటలకే ఆక్టేవియా వెళ్లిపోయింది. చెల్లెలి కామె ఏమిసాకుచెప్పి హార్లీని కలిసికోడానికి పోతున్నదో కాని పాలిన్‌కు ఆమెయెడ ఏఅనుమానమూ పోలేదు.

ఏడుగంటలప్పుడు, ఒకబాలిక భయంతో కంపించుతూ చరచరా లోనికివచ్చి జాలిగా అన్నది: 'దయచేసి నాలుగునిమిషాలు నన్ను ఈయింట్లో ఉండనీయాలి. మాఅమ్మా, నేనూ వస్తోంటే ఎవరో దుర్మార్గులు- తాగి, తూలుతూ, సోలుతూ- మమ్మల్ని అనుసరించి వచ్చారు. చివరకు మమ్మల్ని పట్టుకోటానికి ప్రయత్నించారు కూడాను. నేనిలా పారిపోయి వచ్చాను. మాఅమ్మ ఏమయిందో కదా!'

ఈ వచ్చినబాలిక ఎవరో కాదు. ఫ్లారిమెల్ ప్రభువు. బ్రేస్‌సతి ఎంతో నేర్పుతో స్త్రీవేషం దిద్ది తీర్చి పంపించింది. నల్లటిగౌను- సిల్కుస్టాగింగ్స్- ఉంగరాలుగా దువ్వి పెట్టినతల- అచ్చముగా బాలికవలె ఉన్నాడు ఫ్లారిమెల్.

పాలిన్ ఒకకుర్చీ తెచ్చివేసి అతన్ని కూర్చోబెట్టి 'భయంలేదు; సేదతీర్చుకో' అంటూ మృదువుగా చెక్కులు తడివింది. ఆమెహస్తస్పర్శ సోకినప్పుడు ఫ్లారిమెల్ నరాల్లో విద్యుల్లతలు పాకినట్టయింది.

'నీవిక్కడే కూచునిఉంటే మీ అమ్మను వెదకి వస్తాను' అన్నది పాలిన్.

'వద్దు. వద్దు. అనవసరంగా నీవు చిక్కుల్లో పడతావు. అమె తిన్నగా ఇల్లుచేరుకుని ఉంటుంది ఈపాటికి. కాని నేనీ-చీకటిలో ఎలా ఇంటికిపోనూ?'

'ఈరాత్రి ఇక్కడే ఉండి రేపు ఉదయం వెళ్దువుగాని. పదకొండుగంటలకు మాఅక్క ఆక్టేవియా కూడా వస్తుంది, ముగ్గురం- ఈరాత్రి కులాసాగా గడుపుదాం.'

ఫ్లారిమెల్ సంతోషించాడు. తన పన్నాగం తిన్నగా సాగుతూ వస్తోంది. ఆరాత్రి తా నాయింట్లో ఉండడానికి అభ్యంతరం లేదు. ఆక్టేవియా ఉదయానికిగాని, ఈలోగా తిరిగి రాదని అతనికి బాగా తెలుసును. పాలిన్ వేపు మిత్రభావం వొలికేట్టుగా చూస్తూ: 'ఇదిగో, నాపట్ల ఇంత సౌహార్దంచూపుతూన్న నీపేరు చెప్పవూ?' అని అడిగాడు.

'నాపేరు పాలిన్; నీపేరో?'

'నాపేరా!—నాపేరు గేబ్రియల్.'

'గేబ్రియలీ !—ఎంతచక్కటిపేరు!'

'నీపేరుమాత్రం చక్కనిది కాదూ? నీకు మల్లేనే పాలిన్ !—మధురాక్షరాలు !—నీ కెన్నేండ్లో చెప్పు.'

'నాకా ? నీవే ఊహించి చెప్పు.'

'ఇరవై రెండు ఉండవచ్చు.'

'కాదు ! పందొమ్మిది.'

'నాకూ పందొమ్మిదే. మనిద్దరికీ ఒకటే యీడు. మనం ఇవాళనుంచీ మంచి స్నేహితులంగా ఉందాం.'

'తప్పకుండా మన జీవితాంతంవరకూ స్నేహితులంగా ఉందాం.'

'ఏదీ మనస్నేహచిహ్నంగా ఒక్క ముద్దు!'

పాలిన్ లేచివచ్చి కుర్చీలో కూర్చున్న ఫ్లారిమెల్ పెదవులకు తనసు ధాపూరితములైన పెదవులు అదిమింది. ఆ ముహూర్తాన ఫ్లారిమెల్ ఆమెను కంఠాశ్లేషము చేసి గుండెలకు అదిమికోకుండా ఉన్నాడంటే తన మోహతీవ్రతను ఎంతో బలవంతాన ఆపుకున్నాడన్నమాట.

పదిగంటలైంది; ఇద్దరూ భోజనం చేశారు. పదకొండు కొట్టింది గడియారం; ఇంకా ఆక్టేవియా రాలేదు. పన్నెండయింది. కునుకుపాట్లు పడుతున్నట్టుగా నటించాడు స్త్రీవేషంలో ఉన్న ఫ్లారిమెల్. పాలిన్ మాత్రం ఆక్టేవియా ఇంకా రాలేదే అని భయపడుతోంది.

అప్పుడు ఫ్లారిమెల్ అన్నాడు: 'నీవు నీ అక్కకోసం దిగులుపడుతున్నట్టున్నావే ?'

'పదకొండుగంటలకల్లా వచ్చేస్తానని చెప్పి వెళ్లింది. ఇంకా రాలేదు.'

'అసలామె ఎక్కడికి ఏంపనిమీద వెళ్లిందో' అన్నాడు ఫ్లారిమెల్, ఆక్టేవియా ఏమిసాకు చెప్పివెళ్ళిందో పాలిన్ చేతనే చెప్పిద్దామనే ఉద్దేశముతో.

'నిన్నసాయంత్రం మాఅక్క ఏవో వస్తువులు కొనేందుకు షాపులకు వెళ్లి తిరిగి వస్తోంటే ఒకయువతి అకస్మాత్తుగా బండికింద పడ్డదిట. అప్పుడు మా అక్క ఆమెను సమీపించి తగిన ఉపచారాలుచేసి, ఆయువతియింటికి తీసికెళ్ళి దిగబెట్టి వచ్చిందిట. పాపం!ఆయువతి ఒక్కతే నివసిస్తోందిట! సహాయంగా మా అక్కను ఉండమందిట కూడాను. కాని పదకొండుగంటలవరకూ మాత్రం ఉండి వచ్చేసిందిట. ఇవాళ మళ్ళీ వెళ్ళింది ఆయువతి ఎలా ఉందో చూచివద్దామని.'

'అయితే మనం భయపడవలసినదేమీ లేదు. బండికిందపడ్డయువతి ఒక్కతే నివసిస్తున్నదన్నావుకదూ ! తగిలిన గాయాలు బలమైనవిగా ఉన్నవి కాబోలు! నీవలెనే దయామయి అయిన నీఅక్క ఆమెను ఒంటిగా విడిచి రాలేక ఉండిపోయిందేమో!'

'అవును, అయిఉండవచ్చు — ఇక మనం పడుకుందాం పోయి.'

మేడమీద పడుకగదికి పోయారిద్దరూ, 'ఆక్టేవియా రాలేదుగా! మనిద్దరం ఒకటే మంచంమీద పడుకుందాం' అన్నాడు ఫ్లారిమెల్.

'అది నాకూ సంతోషమే' అన్నది పాలిన్.

ఒకశయ్యమీద పాలిన్ సరసన పడుకున్నప్పుడు ఫ్లారిమెల్ అవస్థ ఏమని వర్ణించాలి? ఎదురుపొంగుతూన్న రక్తపు ఉద్రుతాన్ని ఎలా అణచుకుంటూన్నాడో భగవంతునికి తెలియాలి.

ఇంకో సంగతి. అంత మోహావేశంలో కూడా సద్భావం, అమాయికత్వం ఆకారమైఉన్న పాలిన్ యెడల కపటంగా ప్రవర్తిస్తున్నానే అని వ్యాకులత్వం కూడా అనుభవిస్తున్నాడు. కాని అతని తీవ్రకాంక్షలదే పైచేయి అయింది.

'పాలిన్ నీకు ప్రేమంటే ఏమిటో తెలుసునా ?'

'నే నెప్పుడూ అనుభవించలేదు.'

'నే ననుభవించాను. ఆ దొరక మధురబాధో, లేక బాధామిళితమైన ఒక అనిర్వాచ్యసుఖమో ఏమనాలో నాకు తెలీటంలేదు. నాప్రేమనిధానాన్ని పొందగలననే ఆశ కలిగినప్పుడు సుఖం అనుభవిస్తాను. పొందలేనేమో, అనుకున్నప్పుడు బాధ కలుగుతుంది. సుఖం, బాధ-రెండూ ఒకేసారి నాఆత్మలో కలుగుతున్నై.'

'అయితే ప్రేమబాధ ఏదో అనుభవిస్తున్నావు కాబోలు నీవు.'

'ఔను, నేను ప్రేమించుతున్నాను. నాప్రేమనిధానం నాకు దక్కినప్పుడు నాఆనందానికి పారం ఉండదు.'

'భగవంతుడు నిన్ననుగ్రహించును గాక!—నేనే పురుషుణ్ణి అయితే నిన్ను ప్రేమించగలనని తోస్తోంది నాకు.'

'ఎందువల్ల అలా అంటున్నావు?'

'ఎందువల్లనా? నీవు చాల అందగత్తెవు. ఎంతో మంచిదానివి.'

'నీవుమాత్రం? మనిద్దరమూ ఒకరినొకర్ని మిక్కుటంగా ప్రేమించుకుందాం.'

'తప్పకుండా' అంటూ తన నూతన మిత్రరత్నాన్నిగూర్చి అనుమాన మేమీ పోని పాలిన్ అతన్ని కంఠాశ్లేషం చేసి నుదుటిమీద ముద్దాడింది.

హా! భగవంతుడా! ఎలా ఓర్చుకోగలిగేడు ఫ్లారిమెల్ తనహృదయంలో- ఉన్మాద మెత్తించేట్లుగా- రేగుతూన్న ఉద్రేకాల్ని.

'పాలిన్! పాలిన్! నీకు తెలీదు, నేను నిన్నెంతగా ప్రేమించుతున్నానో.'

'అలా నీవు మాట్లాడుతూంటే నాకు సంతోషంగా ఉంటోంది.'

'కాని నీకు తెలుసా! నేను నిన్నంతగా ఎందుకు ప్రేమిస్తున్నానో? నీపాదములందు వాలి నిన్ను పూజించాలని నాకెందు కనిపిస్తున్నదో? నీ వెంతో అందకత్తెవు. ఎంతో మంచిదానివి. నీవూ, నేనూ, అంతమిక్కుటంగా ప్రేమించుకుంటూన్నప్పుడు, ఏదేవతేనా వచ్చి మనలో ఒకర్ని పురుషుణ్ణిగా మార్చివేస్తే ఎంత ఆనందంగా ఉంటుంది?

'గేబ్రియలీ! నీ ఆలోచనలు చాల విచిత్రములుగా ఉన్నాయి.'

'అటువంటి ఆలోచనాపరంపరల మీద ప్రయాణంచేస్తూపోయి, పోయి, ఆనందవాహినులలో మునుకలు వేస్తాను. నీవు అడ్డుపెట్టకు. ఏదేవతేనా వచ్చి "పాలిన్! నీవొక పురుషుడివైపో, ఈ గేబ్రియలీ పాదాలమీద పడి నీభార్యనుగా స్వీకరించు." అని చెబితే—'

'గేబ్రియలీ! నాకేమో బాధగా ఉంది. అలా మాట్లాడవద్దు' అంటూ పాలిన్ అతని ఎర్రబడ్డ బుగ్గలు విచిత్రంగా చూస్తోంది.

ఫ్లారిమల్ ఆమెవక్షస్థలం చూస్తూ అన్నాడు: 'పాలిన్! ఎందుకూభయం? నిజంగా ఏదేవతేనా వచ్చి నాకోరిక నెరవేరుస్తుందనే భావిస్తున్నావా? నిజంగా అలా జరిగితేమాత్రం భయమెందుకు? నీకు నాయెడ ఎలాగు మిత్రభావమున్నదాయెను. మిత్రభావమే ప్రేమగా పరిణామదశ పొందుతుందని నీవెరుగుదువు. ఆ ప్రేమే ప్రపంచంలో ఉత్కృష్ట సౌఖ్యం చేకూర్చగలదని నేను చెబుతున్నాను. అటువంటప్పుడు ఏదేవతేనా వచ్చి నన్ను పురుషుణ్ణిగా మార్చేస్తుందనుకో, నాకు కావలసినంత ఆస్తి ఇస్తుందనుకో, నీముందు నేను మోకరిల్లి ప్రేమభిక్ష అడుగుతూంటా ననుకో. అప్పుడు నీవు నాకు ఏమిచెబుతావు?'

ఈతర్కమంతా వింటోన్న పాలిన్కు, దూరాన ఎక్కడో మోగుతూన్న గంటలశబ్దం చెవులబడ్డట్టు, ఒక అనుమానమేదో ఆమెమనస్సులో పడ్డది. వెంటనే పక్కమీదినుంచి దిగి భయకంపితయై కుర్చీలో కూలబడ్డది.

ఫ్లారిమెల్ పక్కదిగివచ్చి పాలిన్ ముందు మోకరిల్లి అన్నాడు: 'పాలిన్! దేవత తనపని నెరవేర్చుకుంది. నీపాదాల ముందు ప్రేమభిక్షుకుడు దీనంగా ప్రార్థించుతున్నాడు.'

పాలిన్ కుర్చీలోనించిలేచి క్రోధారుణకపోలయై 'నీవెవరివైనాసరే, తక్షణం ఇక్కడినుంచి వెళ్లిపో' అని ఆజ్ఞాపించింది.

'పాలిన్! అంత కోపపడవద్దు, నీవు నామీద జాలిపడి, నన్ను క్షమించకపోతే ఆత్మహత్య చేసుకుంటాను.'

'ఒక్కనిమిషంకూడా నీవిక్కడ ఇక ఉండకూడదు. నీ కపటబుద్ధికీ, నీ పిరికితనానికీ సిగ్గుపడి, తక్షణం నన్ను విడిచి వెళ్లిపో.'

'పాలిన్! నేటి నాప్రవర్తన నీనిరసనకు తగినదే. కాని నన్ను క్షమించు. నిన్ను చూడకముందే, నీసౌందర్యాన్ని విని, నిన్ను నేను ప్రేమించాను. నిన్ను కలసికోవాలని తీవ్రమైన కుతూహలంతో ఇలా చేశాను. నన్ను క్షమించు. నిన్ను నేను వివాహం చేసుకుంటాను. నీవు నన్నెరుగవు. నేను ఫ్లారిమెల్ ప్రభువును.'

'ఫ్లారిమెల్ ప్రభువు!'

'ఔను. నీప్రియమైన గేబ్రయల్. అది నాఅసలు నామధేయం.'

ఇంతలో ఇంటిముందు బండి ఆగినచప్పుడు వినిపించింది. కిటికీలోంచి తొంగి చూచింది పాలిన్.

'హా! భగవంతుడా! మానాన్నగారు! ఆక్టేవియా ఇంట్లోలేదు. నే నిలా నీతో—'

'ఫరవాలేదు. శాంతపడు. అంతా చక్కబడగలదు.'

'ఎలాగా? ఏంచేయడం?'

'నిన్నూ, నీఅక్కనూ,—ఇద్దర్నీ మీనాన్నగారు అనుమానించకుండా చేయాలి?'

'అంటే?'

'ఆక్టేవియా ఇంట్లో లేకపోవడం మీనాన్నకు కోపకారణమౌతుంది. అందుచేత ఆమె శిక్కడే పడుకుని ఉందని చెప్పి ఆయన్ను ఆగదిలోకి రాకుండా చేయి.'

బయటతలుపు రెండుమూడుసార్లు తట్టబడింది. పాలిన్ మేడదిగిపోయి తలుపుతీసి తండ్రిని కలసికొన్నది.

క్లేరెండన్ యాభైనాలుగు సంవత్సరాల యీడుగల పొడుగాటిమనిషి. ఎదుటివానిముఖంలో అతని హృదయం చూడగల తీక్ష్ణమైనవి ఆయనచిన్న, నల్లటి నేత్రాలు. ఎప్పుడూ మూసుకుని ఉండే పెదవులు చూస్తే ఆయన ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేవాడని, ప్రపంచంలో కష్టాలు ఎరిగి ఉన్నవాడని తెలుస్తుంది. కాలమూర్తి ఆయన ఇనుపకడ్డీవంటి శరీరాన్ని క్షయింప శక్తిచాలక దుఃఖమనే ఉపకరణము ఆయనమీద ప్రయోగించి తనపని చేసుకుంటున్నాడు.

బండివాడు ట్రంకుపెట్టె తెచ్చి లోపల పెట్టి వెళ్లిపోయాడు. పాలిన్ తలుపుగడియవేసి వచ్చింది.

క్లేరెండన్ కూతుర్ని కౌగిలించుకుని 'ఆక్టేవియా ఎలా ఉంది' అని అడిగాడు.

'పడుకుని నిద్రపోతోంది' అని పాలిన్ ప్రత్యుత్తరం చెప్పింది. తండ్రితో అబద్ధమాడడం ఆమెకదే మొదటిసారి. అదే చివరసారి యౌగాక అనుకుంది.

'నే నిప్పుడేమీ భోజనంచేయను. ఆక్టేవియా నిద్రపోతోంది గాబోలు! ఎందుకు లేపడం? నేనుపోయి పడుకుంటాను. రేపు అన్నిసంగతులూ విపులంగా చెబుతాను. మర్ఫీమంటు ప్రభువు ఈసారి మనయెడ అనుకూలంగానే ఉన్నాడు.' అంటూ క్లేరెండన్ తన పడుకగదివేపు నడిచాడు.

తండ్రి పడుకున్నతర్వాత పాలిన్ తన పడుకగదికి పోయింది. గేబ్రియల్ ఫ్లారిమెల్ కుర్చీలో కూర్చుని ఉన్నాడు. పాలిన్ చెప్పింది: 'గేబ్రియల్! నీవిప్పుడొక గౌరవనీయుని యింట్లో ఉన్నావు. ఆకనికూతురి గౌరవాన్ని మన్నించు. నన్ను వివాహంచేసుకుంటానని చెప్పావు; నేను ఆలోచించుకుని అందుకు జవాబు చెబుతాను.'

'పాలిన్! నిన్ను నేను ప్రేమిస్తున్నాను. పూజించుతున్నాను.'

‘నన్ను తొందరచేయవద్దు. ఇప్పుడు నామనస్సేమీ బాగులేదు. అక్టేవియాను గురించి మానాన్నతో అబద్ధం చెప్పవలసి వచ్చింది.’

‘అబద్ధమాడినా ఫరవాలేదు. అందు మూలాన్న అక్టేవియాను కాపాడావు.’

‘నీమాటలు నాకు అర్థంకావడం లేదు.’

‘నీకు తెలీదు. అక్టేవియా ప్రేమించు తోంది. ఇప్పుడు ప్రియునికౌగిళ్ళలో ఉంది. అలా ఆశ్చర్యపొతావేం?’

‘అబద్ధం. అక్టేవియా తనరహస్యా లను నాకు చెప్పకుండా ఉండదు.’

‘పిచ్చిపిల్లా! ఇటు చూడు. ఒక్క సంగతి అడుగుతాను చెప్పు. రేపు ఉదయం అక్టేవియా వచ్చినతరువాత మన సమావేశమంతా ఆమెకు చెబుతావా? ఆలోచించు.’

ఆకన్యబుగ్గలమీద సిగ్గు తొణికింది. ‘ఔను. కొన్ని చెప్పరాని రహస్యాలు ఉంటవి.’ అన్నది.

‘అయితే అక్టేవియా ప్రేమించుతోందని నమ్ముతావుకదూ!’

‘మరి మానాన్నకు తెలిస్తే ఆమెసంగతి ఏమికావాలి?’

‘భయంలేదు. నేను తెస్తానామెను.’

‘ఆమెరహస్యమంతా నీకు తెలుసునన్నమాట!’

‘సౌందర్యమయీ! నీవద్ద నేనేమీ దాచను.’

‘నన్నలా సంబోధించవద్దు. నేను వినలేను.’

‘అయితే నీవు నన్ను ప్రేమించటంలే దన్నమాట.’

‘కాదు కాదు. నిన్ను ప్రేమించగలుగుతాను. నీపాదాలమీద పడతాను. నీదాసీ నౌతాను. నిన్ను నాభగవంతునిగాచూచుకుంటాను. అక్టేవియాను రక్షించావంటే—నాతండ్రికి అనుమానం కలగకుండా తెల్లవారేలోగా ఆమెను తెచ్చావంటే—ఆమె ఇప్పుడెక్కడఉందో నీకు తెలుసునులాగుంది.’

‘అంతాచేస్తాను; మరి నాకేమి బహుమానం ఇస్తావు?’ మోహాపూరితమైన దృక్కులు బరపుతూ అన్నాడు.

పాలిన్‌కు కోపంవచ్చింది: ‘గేబ్రియల్! ప్రపంచంయెడల నాకిప్పుడు కనువిప్పయింది. ప్రేమ మానవుల్ని తప్పుదార్లకు తీసుకుపోతుందని నాకిప్పుడు తెలుస్తోంది. ఈరాత్రి నాఅనుభవం స్త్రీ ఎంత దుర్బలో తెలుపుతోంది. కాని తుచ్ఛవ్యామోహానికి లొంగని మనోబలాన్ని నేను సంపాదిస్తాను. నాసౌశీల్యము భంగమయ్యేముందు మృత్యువునే ఆహ్వానిస్తాను. కనుక గేబ్రియల్! గౌరవంగా నీవు నన్ను వివాహమాడుతావంటే నీమాటలు వింటాను. కాని నాగౌరవహానికరంగా ఒక్కమాట పలికేవంటే నాతండ్రిగారిని పిలిచి ఆయన పాదాలమీదపడి సర్వమూ చెబుతాను.’

ఫ్లారిమెల్ ప్రభువుకు తానుచేసినదానికి పశ్చాత్తాపం కలిగింది. ఆమె సౌశీల్యమునెడ పూజ్యభావం మొలకెత్తింది.

‘పాలిన్! నీవు నాలో పరివర్తన తెచ్చావు. నన్ను క్షమించు’ అంటూ ఆమెముందు మోకాళ్ళమీద నిల్చాడు.

‘ఎప్పుడూ నీవీసమయంలోవలె సుస్వభావుడివైతే నిన్ను నేనెంతగా ప్రేమిస్తాను!’

‘నీవునన్ను ప్రేమించగలవన్నమాట!’

‘నీ యీసుస్వభావం మారిపోయినప్పుడు ఎంతగాఢంగా నిరసిస్తానో, అంతగాఢంగా ప్రేమించగలను ఇలాగే మంచివాడివిగా వుంటే.’

‘అయితే పాలిన్! నీ ఆజ్ఞానువర్తిని. ఏమిచేయమంటావో చెప్పు.’

‘ఇప్పుడు రెండుగంటలయింది. సూర్యోదయంముందుగానే అక్టేవియాను ఇక్కడకు పంపించాలి.’

‘తప్పకుండా. ఇక నేను వెళ్లుతాను.

‘ఈసారి నిన్ను నీకుచితమైన పురుషదుస్తుల్లోనే చూడాలని నాకోరిక.’

ఆ నిశీధినీప్రశాంతనిశ్శబ్దవీచికలలో వారి పెదవులు కలసిన చప్పుడు మధురంగా ధ్వనించింది. తరువాత తలుపు తెరవబడి ఫ్లారిమెల్ వీధిలోనికివెళ్లాడు.

పాలిన్ నిద్రపోయింది. కాని ఆనిద్ర ప్రశాంతమైనది కాదేమో? అక్టేవియాను గురించినభయం కొంతవరకు ఆమెనిద్రను కలతపెట్టి వుండవచ్చు. ఆకలతనిద్రలో గేబ్రియల్‌నుగూర్చి మధురస్వప్నాలు కూడా కన్నదా? కని వుండవచ్చు.

సినిమా సీమ * టాకీలోకము

రాధాకృష్ణ

విశ్వప్రయత్నముచేసి లక్ష్మీవారు కవలబిడ్డల్ని ప్రసవిస్తున్నారు. శిశ్నోదయం కాకముందే ఒకబిడ్డది తెనుగు భాషని, మరోబిడ్డది అరవంఅని గుప్తగారు సిద్ధాంతంచేశారు. తెనుగుబిడ్డపేరు రాధాకృష్ణ. ఆఫిలుముబిడ్డకు కళాధ్యాపకుడు ఆంధ్రభూమిపాఠకులకు చిరపరిచితుడు శ్రీపాద దుర్గారావుఅని తెలియుచున్నది. ఇంతకీ ఈరాధాకృష్ణ ఫిల్ములో కృష్ణపాత్రధారి రాజు రమ్యంగా నటిస్తాడని వదంతి. ఏదైనా మంచిచెడ్డలు తెలిసిన మీరు చూసి చెప్పాలి, నావంటివాడు వినాలి. పూర్తిఅయేరోజులు దగ్గరకు వచ్చినవి. సంభావించే సమయానికీ వేచి వుండండి.

కచ దేవయాని

పూర్వం సక్కుబాయి సాంఘికటాకీ చిత్రాన్ని తీసి మిక్కుటంగా ఆంధ్రుల ఆదరాభిమానములు చూరకొన్నదనే చెప్పాలి రాధాఫిలింకంపెనీ. ఆదేకంపెనీ నేడు కచ-దేవయాని లేక సంజీవిని అను పౌరాణికటాకీచిత్రాన్ని తీసింది. ఇందులో నటీకటకులు అందరు నిరక్షరకుక్షులుగాక విద్యావంతులు, నాట్యకళాప్రజ్ఞావంతులుగా ఉన్నారు. దృశ్యములు రమ్యమైనవిగా ఉన్నవి. కష్టనష్టములకోర్చి కళాదృష్టితో కచ-దేవయానలను తెరఎక్కించినందుకు డైరక్టరు బి.వి. రామానందంగారు ఎంతేనా ప్రశంసనీయులై వున్నారు.

మోహినీ భస్మాసుర

పుల్లయ్యగారి ప్రజ్ఞ సత్యనారాయణ చిత్రంలో కొంత తల్లక్రిందులైందని విన్నాం. అట్టివారి డైరక్షన్‌లో—చింతించడానికి బదులు కళ్ళుసికిలింపులతోను-పళ్లు నెకిలింపులతోనుఉండిన సీతమ్మనుచూపించిన సంపూర్ణరామాయణం టాకీని తయారుచేసిన స్టూడియోలో నేడు పుష్పవల్లి వళ్ళువిరుపులతోను, వయ్యారాలతోను భస్మాసురుని భస్మంచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన నటనటీమణులు, డైరక్టరులు ప్రస్తుతం మన్యాలు పట్టారు. రంపఘోరారణ్య దృశ్యాల్ని దేశంమీదికి తెస్తారని తెలుస్తూవుంది.

భక్త మార్కండేయ

ఆంధ్రులు శ్రీకృష్ణునికాలములో రాక్షసులుగా వర్ణింపబడ్డారు. శ్రీకృష్ణున్ని చాణూరాంధ్రనిషూదన అంటారు. కాలక్రమాన్ని ఉత్తరాదివారి వత్తిడిచేత రాక్షసత్వం ఆంధ్రులను వదిలిపోయింది. నిర్వీర్యులైపోయారు. కాని ఆంధ్రులైపుట్టిన గగ్గయ్యగారు పూర్వపుసాంప్రదాయం పునరుద్ధరించుచున్నట్లున్నది. కళ్ళు ఉరమడం, పళ్ళుకొరకడం మొదలైన పనులుచేయవలసివుంటే రాక్షసవేషాలు గుత్తకి పుచ్చుకున్నారు. ఆదిలో ఏపాత్రకైతే పేరుపడ్డారో ఆ పాత్రనే కుబేరాఫిలుమ్సువారి 'భక్త మార్కండేయలో' ప్రదర్శించారు. రాక్షసవేషాలలో ఇంతకాలం వృద్ధిచేసుకొన్న కళను పూర్తిగా ఇందులో చూపియుంటారని ఆశిస్తున్నాను. యమధర్మరాజు సురుడో అసురుడో నిర్ణయించాలంటే వారినే అడగాలి. లేదా విడుదలయినతరువాత చూసి తెలుసుకోవాలి. విడుదలకు చాలారోజులు వేచివుండవలసింది లేదు. ప్రజ్ఞావంతులైన యితర నటీనటులుకూడా యిందులో వున్నారని ఘట్టిగా చెప్పగలను.

కృష్ణ జరాసంధ

జయాఫిలిమ్సువారి విజయయాత్ర చెన్నపట్టణం తొక్కకుండానే సాగుతోంది. 'కృష్ణజరాసంధ' చెన్నపట్టణం ఇప్పట్లోవచ్చేటట్టుకూడా కనుపించదు. కాని వారు మళ్ళీ ఏదో ఒకఫిల్మితీయాలని తల్లక్రిందులా తపస్సుచేస్తున్నారని వదంతి. రాజుతలిస్తే దెబ్బలకు కొదవా? వారు తలిస్తే ఎన్నయినా ఫిల్ములు తీయగలరు; తీస్తారు.

మాలపిల్ల

మండువేసంగిఅయినా సారథిఫిలుమ్సువారి 'మాలపిల్ల' రథంమీద జోరుగానే పరుగెడుతున్నది. గిరీశంగారి పాత్రధరించి ఆంధ్రనాటకరంగం మీద ఆంధ్రుల అభిమానపాత్రులైన డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావుగారు, ఈ చిత్రంలో నటిస్తున్నారు. 'తీటకొద్దీ సినీమారంగంలో దిగినా' మన్నారు. ఆతీట తీరడంకోసరమే చెత్తమాడే ఎండల్లో కూడా పనిబాగా సాగిస్తున్నారు. వారు బోడిగుండు బ్రాహ్మణవేషం అద్వితీయంగా ప్రదర్శిస్తున్నారు. ఆ అద్భుతదృశ్య సందర్శనావకాశాన్ని ఆంధ్రులు యీ తరుణంలో కోలుపోకూడదని నామనవి. మాలపిల్ల లావణ్యమహిమ, బ్రాహ్మణుడి పూర్వాచార పరాయణత 'రామబ్రహ్మంగారి' అమృతహస్తములలో సిద్ధిపొందుతున్నాయని వేరేచెప్పాలా? కలకత్తాలో కొన్నిసీనులుతీయుటకు త్వరలోనే వెళ్లునట్లు తెలియుచున్నది. కళకోసం కలకత్తాకూడా వెళ్ళివస్తూవున్న ఈ 'మాలపిల్ల' కథలో బ్రాహ్మణకుటుంబానికి చెందిన యువకుణ్ణి మోహింపచేసినట్లే తెరమీద ఆంధ్రకుటుంబాలకు చెందిన సినీమాప్రియుల నందర్నీ మోహింపచేయగలదు.

—'నారదుడు.'

కిట్టక చెప్పిన చాడీలూ కావు

కాంగ్రెస్‌లో పావలాసభ్యుడే నా కాని మహాత్మాగాంధిగారు కాంగ్రెస్ సారధ్యం వహించి వున్నంతకాలం కాంగ్రెస్‌లో పావలాసభ్యుడైన ఆంధ్రుడెవడూ సీమలో ఆంధ్రరాష్ట్రవిషయం ప్రస్తావించకూడదు.

... ...

ఇండియాస్టేట్ సెక్రటరీ ప్రస్తుతంలో హిందూదేశంలో క్రొత్త రాష్ట్రాలు నిర్మించడానికి అవసరం లేదన్నాడు కాబట్టేన్నీ, కాంగ్రెస్ వర్కింగు కమిటీవారు ఆంధ్రరాష్ట్ర విషయం సీమకు రాయబారం వద్దన్నారు కాబట్టేన్నీ, తాను ప్రధానమంత్రి అయివుండగా ఇక ఎల్లాగా ఆంధ్రరాష్ట్రం రాదు కాబట్టేన్నీ రాజగోపాలాచారిగారు మదరాసు శాసనసభవారి భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణపు తీర్మానాన్ని మంచిరిక మెండేషన్‌తో మద్రాసు కూమునదిలోనుంచి లండన్ థేమ్సునదిలోనికి పంపారు.

... ...

మంచిరిక మెండేషన్‌తో పంపారనడం కిట్టకచెప్పిన చాడీ, కోరి చెప్పిన కొండెము. ఆచారిగారు అల్లాంటి అనాచారపుకార్యం చెయ్యరు. వారు భాషాప్రయుక్త తీర్మానాన్ని లండన్ పంపుతూ ఆంధ్రరాష్ట్రవిషయం ఏమీ ఎత్తుకోలేదు. మద్రాసు రాష్ట్రాన్ని భాషాప్రయుక్తకంగా విడదీయమని తీర్మానంలోవున్న వాక్యాల్నే మళ్లీ ఓసారి ఇంకోకాగితంమీద వ్రాసి తీర్మానపుకాగితానికి గుచ్చి పంపించారు.

... ...

మైసూరు విదురాశ్వత్థం కాల్పులతో చీరాల కాల్పులను ఆంధ్రులంతా మరిచిపోయినా రాజగోపాలాచారిగారు ధర్మవిదులు కావడంచేత వానిసంగతి మరిచిపోక చీరాలకాల్పులు శాస్త్రబద్ధమైనవంటూనే ఆసందర్భంలో వచ్చిన ప్రాసిక్యూషన్‌లు ఉపసంహరించుకోవలసినవిగా నిర్ధారణచేశారు. పోలీసులదీ తప్పుకాదు, కూలీలదీ తప్పుకాదు అని ఇందుతో తేలింది. ఇక తప్పుఅంతా విచారణచేసినవారిది.

... ...

మదరాసులో రేడియోస్టేషను పూర్తి అయింది కాబట్టేన్నీ, తిరుచునాపల్లిలో పూర్తిఅవుతోంది కాబట్టేన్నీ ఇకమీద రాజమండ్రిలోకూడా ఒకస్టేషన్ పెట్టమని మదరాసు ప్రభుత్వంవారు కేంద్రప్రభుత్వంవారిని కోరినారట. తమకు ప్రత్యేకరాష్ట్రం రాలేదని రేడియోద్వారా ఆంధ్రులు ఏడవడానికి అవకాశం చిక్కుతుందన్నమాట.

... ...

అసలు సాంబునికి కైలాసపర్వతంమీద కాంక్ష కుదిరినట్లే ఆంధ్రసాంబునికి సీమమీద చిత్తం కుదిరింది. పార్లమెంటరీ ప్రొసీజరు చూడ్డానికి సీమపోవాలన్నాడు. వర్కింగుకమిటీవారు వద్దన్నారు. అయినా సాంబునికి సీమమీది చిత్తం చెదరలేదు. ఉద్యోగం అయిన కొత్తలో ఆంధ్రరాష్ట్రం వద్దన్న సాంబుడు రంగుపిరాయించి ఇంతలో ఆంధ్రరాష్ట్రంకోసం సీమ వెళ్తానన్నాడు. వర్కింకమిటీవారు అదీ వల్లకాదన్నారు. ఆంధ్రరాష్ట్రంవద్దనీ, కావాలనీ సాంబుడు ఆంధ్రులికి ఇట్లా అపకారమే చేశాడు. సాంబమూర్తి అంటే అసలు లయకర్తగా.

... ...

వర్కింగుకమిటీవారు ఆంధ్రరాష్ట్ర రాయబారాన్ని వద్దన్నాడు కాబట్టి ఆవర్కింగుకమిటీలోవున్న ఆంధ్రుడు పట్టాభిసీతారామయ్యగారు దాన్ని వదిలి లేచి రావాలని కొందరు అంటున్నారు. వర్కింగ్ కమిటీలో సభ్యత్వం ఆయనికి ఆంధ్రుడవడంచేత రాలేదు, స్టేట్సు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడవడంచేత వచ్చింది. ఆయన్ని లేచిరమ్మనడానికి ఆంధ్రులికి ఏమీహక్కులేదు. ఆయన లేచి రానున్నారారు.

... ...

ఆంధ్రరాష్ట్ర సమస్యమీద మదరాసుశాసనసభలోని ఆంధ్రసభ్యులంతా రాజీనామా ఇయ్యాలని కొందఱు అంటున్నారు. వారికి నెలకు డెబ్భయిఅయిదురూపాయిల జీతాలు వస్తూవున్నాయి, ఆంధ్రరాష్ట్రంతోబాటు వారు కర్ణాట

ష్ట్రం, తమిళరాష్ట్రం, మళయాళరాష్ట్రంకూడా నిర్మించవలసివుంది. ఇన్నిరాష్ట్రాల నిర్మాణం కావలసివుండగా ఒక్క ఆంధ్రరాష్ట్రం విషయంలో నెలకు డెబ్బయి అయిదురూపాయిల్ని వదులుకోమనడం కార్యం తెలిసి వ్యవహరించడంకాదు. అనడంతడవుగా వదలుకోవడానికి ఆంధ్రశాసనసభ్యులంత తెలివితక్కువవారు కారు.

... ...

కృష్ణాపత్రికవారు కొద్దిరోజుల్లో ప్రపంచం తల్లక్రిందులు అవుతుంది, అట్లా తల్లక్రిందులవడంతోటే ఆంధ్రరాష్ట్రం వచ్చితీరుతుందని సంపాదకీయరూపకమైన అక్షింతలు ఆంధ్రదేశమంతా చల్లుతున్నారు. ఆంధ్రరాష్ట్రం రావడంకోసం ప్రపంచంఅంతా తల్లక్రిందులు కావాలనడం కృష్ణుడికి మరోపేరైన గోపాలుడికి ఆచారత్వంతో కూడిన రాజత్వం వచ్చినదానికి ఫలం.

... ...

ఆంధ్రరాష్ట్రమే వస్తే ఆంధ్రరాష్ట్రంలోవున్న అరవకాఫీహోటళ్ళన్నీ మూసెయ్యాలనీ హోటలుయజమానులు లోపాయికారీగా అనుకుంటూన్న మాటలు ఆంధ్రులకి తెలిస్తే ఆంధ్రరాష్ట్రం నిజంగా కావాలని ఆంధ్రుడెవడేనా కోరుతాడా? ఆంధ్రదేశంలో అరవహోటళ్లు పోయిననాడు ఆంధ్రుడికి పిండాకూడుకూడా లేకుండా పోతుంది.

—కోరి చెప్పిన కొండెములూ కావు

కాంగ్రెస్ కార్యసంఘానికి వ్యతిరేకంగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘం ఏమీ చేయలేదు కాబట్టి ఆంధ్రరాష్ట్రవిషయంలో శ్రద్ధవహించడానికి ఆంధ్రజాతీయ మహాసభ పూనుకోవాలంటున్నారు పట్టాభిగారు. అయితే వారు కాంగ్రెస్ పావలాసభ్యత్వంవదలి ఆంధ్రజాతీయమహాసభలో నాయకత్వం వహిస్తారా? పావలాసభ్యత్వంతో పదవులు సంక్రమిస్తూవుండగా వానినివదలి ఆంధ్రదేశంకోసం కృషిసల్పే ఆంధ్రనాయకులు లేనేలేరు. ఉండినట్లయితే మనకు ఆంధ్రరాష్ట్రం ఏనాడో వచ్చేది.

... ...

పృధ్వీసింగు విడుదలను గూర్చి గాంధిగారి అంతవాడు వైస్రాయిని యాచింపవచ్చు. కాని ఆంధ్రులు తమకు రాష్ట్రాన్ని ఇమ్మని ఇండియామంత్రిని అడగకూడదు. చిన్నవిషయాలకు యాచిస్తే గౌరవహాని లేదు. పెద్దవిషయాలకు ప్రార్థిస్తే గౌరవహాని అయి తీరుతుంది. గ్రుడ్డిగా కాంగ్రెస్‌ను నమ్మి నోరునొక్కుకుని కూర్చున్న ఆంధ్రులవిషయాలన్నీ కాంగ్రెస్‌లో ఇట్లాగే వుంటాయి.

... ...

ఆంధ్రరాష్ట్రం వచ్చినా రాకపోయినా ఈసందర్భంలో కాంగ్రెస్ కార్యసంఘంలో అందులో సభ్యుడేనా కాని గాంధిగారి వియ్యంకుడికి ఎక్కువ పలుకుబడి వుందో, అందులో సభ్యుడైన పట్టాభిగారికి ఎక్కువ పలుకుబడి వుందో తేలిపోయింది.

... ...

విశాఖపట్టణం మెడికల్ కాలేజి అభివృద్ధికి ధారాళంగా డబ్బు వెచ్చించడానికి ఒప్పుకోని మద్రాసు ప్రభుత్వం రాయపురం మెడికల్ స్కూలును కాలేజీగా విశేషవ్యయంతో మారుస్తూండడానికి ఏమైనా కారణంవుందా అంటే ఆరోగ్యశాఖామాత్యుడు అరవవాడు కావడం, విశాఖపట్టణం కాలేజీ తెలుగుసంస్థ కావడమూనని చెప్పుకుంటున్నారు.

... ...

మద్రాసు శాసనసభలలోని ఆంధ్రరాష్ట్ర తీర్మానం ఏడ్చేపిల్లల్ని ఊరుకోపెట్టడాకిని ఇచ్చేరబ్బరు పాలతిత్తిలా ఆందోళనచేసే ఆంధ్రుల్ని ఊరుకోపెట్టడానికి ఉద్దేశింపబడ్డదని అంటున్నారు రామలింగారెడ్డిగారు. ఈతీర్మాన సందర్భంలో ప్రధాని తన తమిళజాతిని తండ్రిగా పోల్చుకున్నాడు. ఉపమానాన్ని ఇంకా పొడిగిస్తే తండ్రి అయిన ప్రధాని బిడ్డలైన ఆంధ్రులికి ఏడ్పు ఉడిపేటందుకుగాను భాషాప్రయుక్త రాష్ట్రతీర్మానం అనే పాలతిత్తిని ఇచ్చాడని తేలుతోంది. చప్పరించతగ్గవిషయం.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము

౨౨౧.

శ్రీనిజామాంధ్రీయ
బహుధాన్య
సంవత్సర పంచాంగమ్.

శ్రీనిజాంరాష్ట్రమునందు మెదకు, మహబూబునగరు, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాదు, కరీమ్నగరు, హైదరాబాదు మున్నగు మండలములలో నివసించువారల కత్యంతోపయోగముగా నుండునట్లు మెదకు జిల్లా ఆందోల్ తాలూకా శంకరంపేట నివాసులు దైవజ్ఞ బి. వెంకటరాజేశ్వరశర్మగారు గుణించినది. ఇతర ఉపయుక్త విషయములు అనేకములు చేర్చుటయేగాక జ్యోతిశ్శాస్త్రరహస్యములనదగు మేషాధిద్వాదశరాసులకు జాతకఫలములు, గురుశనుల గ్రహచారఫలములు, కార్తెప్రవేశవాహనాదులఫలములు, మాసఫలములు ప్రస్తరించుటచే పంచాంగము శ్రోత్రప్రయోజనమును కూర్చుకొనుచున్నది. పంచాంగము ప్రతిని కోరువారు రెండుఅణాల పోష్టుబిళ్ళలు శర్మగారికి పంపగలరు.

౨౨౨.

మృత్యుంజయఫార్మసీవారి
శ్రీబహుధాన్యసంవత్సర
గంటల పంచాంగము.

శాస్త్రోక్తమగు ఆయుర్వేదౌషధములుచేసి ప్రజల కందించుచు ప్రజాసేవ చేయుచున్న బెజవాడ మృత్యుంజయఫార్మసీవారు పాకెట్ సైజున బహుధాన్య సంవత్సర గంటల పంచాంగమును ప్రచురించినందులకు అభినందనీయులై యున్నారు. సంవత్సరఫలితములు ద్వాదశభావముల పద్ధతిని వివరముగ వ్రాయబడినవి. కార్తెలు, వర్షయోగములు కూడ విపులముగ చెప్పబడినవి. పుట్టుకదినమునుబట్టి ఆరోగావారలకు సంవత్సరఫలితములు కూడ వ్రాయబడినవి. ఇట్లు అనేకవిషయములచే ఈపంచాంగము చాల ఉపయుక్తముగా నున్నదని చెప్పగలము.

౨౨౩.

ఆంధ్రప్రావిడెంటు కంపెనీవారి
శ్రీబహుధాన్య
సంవత్సర పంచాంగము.

నర్సారావుపేట కాపురస్థులగు బ్రహ్మశ్రీ గొట్టిముక్కల సుందరరామశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణింపబడి బెజవాడయందలి ఆంధ్రప్రావిడెంటు కంపెనీ మేనేజింగు డైరెక్టరు దిట్టకవి వీరరాఘవయ్యపంతులు గారిచే ప్రకటింపబడినది. ఇందు సాయనపద్ధతిని జగల్లగ్నఫలితములు, వర్షయోగములు మున్నగు పెక్కుమంచివిషయములు చేర్పబడినవి. జేబునందిముడు చిన్నసైజున ముద్రింపబడినది.

౨౨౪.

శ్రీమద్బహుధాన్యనామ
సంవత్సర పంచాంగము.

పూజ్యమైన కౌణ్వశాఖకు చెందిన శ్రీలింగాల సూర్యనారాయణగారి పుత్రులైన బంగారయ్య సిద్ధాంతిగారు రచియించినది. విరవాడగ్రామకాపురస్తులు శ్రీమిరియాల జగన్నాథముగారి ద్రవ్యసహాయమున అచ్చొత్తింపబడినది. ఈపంచాంగమును గుణించిన బంగారయ్యగారు గొప్ప సిద్ధాంతులు. అగుట ఈపంచాంగము ప్రామాణికభావముతో చూడదగినది. 21 పుటల పీఠికగలదగుటచే ఈ పంచాంగముయొక్క ప్రాశస్త్యమును సులభముగ ఊహింపవచ్చును. వలయువారు పశ్చిమగోదావరిజిల్లా నిడదవోలునందున్న సిద్ధాంతిగారికి వ్రాయునది.

౨౨౫.

నవశక్తి
మేడే సంచిక.

కాంగ్రెస్‌పత్రికను సంపాదించి ఆంధ్రపత్రికా ప్రపంచమున అపూర్వఖ్యాతినార్జించిన శ్రీయుత మద్దూరి అన్నపూర్ణయ్యగారు ఐదుమాసములక్రితము రాజమండ్రినుండి 'నవశక్తి' అను వారపత్రికను ప్రచురింప ప్రారంభించి అచిరకాలముననే ఆంధ్రవారపత్రికాలోకమున దానికి అతిశయస్థానమును సంపాదించిరి. 'నవశక్తి' కార్మిక కర్షకుల జీవగఱ్ఱ. అగుట కార్మిక కర్షకుల పర్వదినమగు మే ౧-వ తేదీని అదియొక ప్రత్యేకసంచికను వెలువరించినది. శ్రీరంగం శ్రీనివాసరావుగారి 'దేశచత్రలు,' పోతేపెద్ది నరసింహమూర్తిగారి 'జాతీయ ఐక్యసంఘటనమే సామ్రాజ్యవాదాన్ని సరిగా ఢీకొంటుంది', మద్దుకూరి చంద్రశేఖరరావుగారి 'రష్యాలో కుట్రలు', వావిలాల గోపాలకృష్ణయ్యగారి 'ఆంధ్రరాష్ట్రోద్యమము', కామ్రేడ్ సుందరయ్యగారి 'ప్రపంచయుద్ధంవ ...', కంభంపాటి సత్యనారాయణగారి 'ఫేసిజం' మున్నగు వ్యాసములతో సంచిక ముచ్చటగానున్నది. బహుళచిత్రయుతము. క్రౌన్ పెద్దసైజు. 32పుటలు. వెల రెండు అణాలు.

Printed at the Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.